ఈనాడు

విజయవాడ 3-2-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 174

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఆగస్టు నుంచే ఆయుష్మాన్



- స్వాతంత్ర్య దినోత్సవాన ప్రారంభించేలా కసరత్తు
- తొలిదశలో 50 కోట్ల మందికి ఆరోగ్య భద్రత
- పైసా చెల్లించకుండానే పేదలందరికీ ఉచిత వైద్యం
- ప్రీమియంలో కేంద్ర, రాష్ట్రాల వాటా నిష్పత్తి 60:40
- కాగితం, నగదు రహిత సేవలు..
- ఏ రాష్ట్రంలో ఉన్నా వైద్యసేవలు పొందవచ్చు
- సామాజిక ఆర్థిక కుల జనాభా గణాంకాలే ప్రాతిపదిక

అత్యంత ఖరీదైన వైద్య సేవలను సైతం పేద ప్రజల ముంగిటకు తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని సాధ్యమైనంత త్వరగా అమలుపరచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకం పకడ్బందీ కార్యాచరణకు అవసరమైన కసరత్తును జులైకల్లా పూర్తిచేయాలని భావిస్తోంది. అనుకున్నవిధంగా అన్ని ఏర్పాట్లు పూర్తయితే వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం(ఆగస్టు 15)నాడు పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. ఒకవేళ అప్పటికి సాధ్యం కాకపోతే జాతిపిత మహాత్మాగాంధీ జయంతి అయిన అక్టోబరు 2 నుంచి అమలులోకి వస్తుంది. ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైనదిగా భావిస్తోన్న 'ఆయుష్మాన్ భారత్' ప్రపంచంలోనే అతిపెద్ద వైద్య పథకం. జాతీయ ఆరోగ్య భద్రత పథకం పేరుతో అమలుచేయబోయే ఈ బృహత్తర కార్యక్రమాన్ని 'మోదీ కేర్'గా కూడా వ్యవహరిస్తున్నారు. తొలి దశలో 10 కోట్ల నిరుపేద కుటుంబాలు లేదా 50 కోట్ల మంది ప్రజలు దీని పరిధిలోకి వస్తారు. జబ్బుపడిన వారికి రూ.5 లక్షల విలువైన ఆరోగ్యసేవలను పూర్తి ఉచితంగా అందిస్తారు. - సమగ్ర వివరాలు 11లో

ప్రీమియం చెల్లించేదెవరు?

'ఆయుష్మాన్ భారత్' పథకం కింద లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఉండదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ఆ మొత్తాన్ని సమకూరుస్తాయి. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు ఈ వాటా 90:10 నిష్పత్తిలో ఉంటుంది. పూర్తి నగదు రహిత సేవలు అందిస్తారు. ఇందులో చేరడానికి దరఖాస్తులేమీ భర్తీ చేయాల్సిన అవసరంలేదు. 2011 నాటి సామాజిక, ఆర్థిక, కుల జనాభా గణన (ఎస్ఈసీసీ) డేటాలో పేరున్న పేదలంతా ఆధార్ సంఖ్య ద్వారా వేలిముద్రవేసి పథకంలో చేరవచ్చు.

ఏయే వ్యాధులకు...

అన్నిరకాల తీవ్రమైన వ్యాధులు, ప్రమాదం, అత్యవసర సేవలను దీని కిందికి తెస్తారు. అన్ని రకాల చికిత్సలకు ప్రభుత్వం ముందస్తుగానే ప్రామాణిక ధరలు నిర్ణయిస్తుంది. అన్నిరకాల మాధ్యమిక, సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు ఇందులో అవకాశం కల్పిస్తారు. ఈ నెట్‌వర్క్‌లో చేరిన ఆసుపత్రులకు అవి అందించే సేవల నాణ్యతను బట్టి శ్రేణు(గ్రేడింగ్)లను ఇస్తారు. నాణ్యతను పెంచుకోవడానికి ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రోత్సాహకాలు అందిస్తారు.



మద్దతు ధర ఎలా నిర్ణయిస్తారు?

- జైట్లీ ప్రకటనపై సర్వత్రా చర్చ
- ఇప్పటి పద్ధతైతే ప్రయోజనం శూన్యం
- సాగు ఖర్చు ఎక్కువ ఉన్న రాష్ట్రాలకు నష్టం

ఈనాడు, హైదరాబాద్: సంక్షోభంలో ఉన్న రైతును ఆదుకోవడానికి కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పీ) పెంచనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిన నేపథ్యంలో ఇది ఎలా ఉండబోతుందోనన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. రైతు సాగు వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర ఇవ్వాలని కొన్నేళ్లుగా రాజకీయపార్టీలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో జైట్లీ ప్రకటనకు అధిక ప్రాధాన్యం ఏర్పడింది. అయితే సాగు వ్యయాన్ని ఎలా లెక్కిస్తారన్న అంశంపై ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు సాగుకయ్యే వ్యయాన్ని లెక్కగట్టిన పద్ధతినే కొనసాగిస్తే యాభైశాతం అదనంగా ఇచ్చినా ప్రయోజనం నామమాత్రంగానే ఉండే అవకాశం ఉంది. వాస్తవంగా హెక్టారుకయ్యే సాగు ఖర్చు, ఆ రైతు కుటుంబం భూమిలో చేసిన శ్రమను పరిగణనలోకి తీసుకొని కనీస మద్దతు ధరను నిర్ణయిస్తుండగా, భూమి కౌలు ధర, సొంత పెట్టుబడి (మిగతా 2లో)


మదుర ఆలయ ప్రాంగణంలో కాలిపోతున్న దుకాణాలు

మదుర మీనాక్షి ఆలయ ప్రాంగణంలో అగ్నిప్రమాదం

కాలిపోయిన 30 దుకాణాలు

ఈనాడు డిజిటల్, చెన్నై: తమిళనాడులోని మదుర మీనాక్షి ఆలయం తూర్పుగోపురం వద్ద శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం ఏర్పడింది. సమీపంలోని 30 దుకాణాలకు మంటలు వ్యాపించి భారీ ఆస్తి నష్టమైంది. విషయం తెలిసిన వెంటనే మదురై కలెక్టర్ వీరరాఘవరావు సంఘటన స్థలికి చేరుకున్నారు. 200 మందికిపైగా అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేస్తున్నారు. ఈ సమయంలో భక్తులు, ఆలయసిబ్బంది లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ప్రభుత్వ యంత్రాంగమంతా అప్రమత్తమై మంటలను అదుపు చేసిందని కలెక్టర్ తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు.

బేర్ దెబ్బకు.. బెంబేల్

స్టాక్ మార్కెట్లో శుక్రవారం నష్టం వాటిల్లింది. సూచీలు గత రెండేళ్ల వ్యవధిలోనే అత్యధిక నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 840 పాయింట్లు; నిఫ్టీ 250 పాయింట్ల మేర కుదేలయ్యాయి. దీంతో మదుపర్ల సంపద ఏకంగా రూ. 4.5 లక్షల కోట్ల వరకు ఆవిరైంది. బడ్జెట్‌లో మూలధన లాభాలపై 10 శాతం పన్నును ప్రతిపాదించడం ఇందుకు కారణంగా విశ్లేషిస్తున్నారు. ఇది మదుపర్ల సెంటిమెంటును బాగా దెబ్బతీసిందనే చెప్పాలి. ఎనిమిది వారాల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. అయితే ఇది తాత్కాలికమేనని.. భారత వృద్ధిపై ఎటువంటి అనుమానాలు, ఆందోళనలు అవసరం లేదని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ అన్నారు.

- పూర్తి వివరాలు బిజినెస్ పేజీలో

ఉద్యోగుల విభజనకు స్థానికత రాజ్యాంగ విరుద్ధం

- తెలంగాణ విద్యుత్ సంస్థల నిర్ణయాన్ని తప్పుపట్టిన హైకోర్టు
- కమిటీలు ఏర్పాటు చేసి 4 నెలల్లో విభజన ప్రక్రియను పూర్తి చేయండి
- అప్పటిదాకా రిలీవ్ చేసిన వారిని తెలంగాణ విద్యుత్ సంస్థల్లోనే కొనసాగించండి
- సీనియార్టీ పునరుద్ధరించాలి.. పదోన్నతులు, సర్వీసు ప్రయోజనాలు కల్పించండి
- ఏపీ విద్యుత్ సంస్థలు చెల్లించిన సొమ్ము తిరిగి ఇచ్చేయండి
- తెలంగాణ విద్యుత్ సంస్థలను ఆదేశించిన హైకోర్టు



ఈనాడు - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ 'స్థానికత' ఆధారంగా తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న వారిని రిలీవ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు తప్పుపట్టింది. ఈ వ్యవహారమై తెలంగాణ విద్యుత్ సంస్థలు జారీ చేసిన మార్గదర్శకాలు, ఉద్యోగుల్ని రిలీవ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని తేల్చిచెబుతూ.. వాటిని కొట్టేసింది. రెండు రాష్ట్రాల ట్రాన్స్‌కో, జెన్‌కోలు, టీఎస్ఎస్‌పీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్‌లు ఇప్పటికే ఉన్న సంయుక్త కమిటీలను కొనసాగించడం లేదా తాజాగా కమిటీలను ఏర్పాటు చేసుకొని ఉద్యోగుల విభజన వ్యవహారంలో 'స్థానికత'కు ఆస్కారం లేకుండా రెండు నెలల్లో కమిటీలను ఏర్పాటు చేసి మార్గదర్శకాలు రూపొందించాలనీ, ఆ తర్వాత రెండు నెలల్లో ఉద్యోగుల విభజన ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. విభజన ప్రక్రియ ముగిసే వరకు రిలీవ్ చేసిన ఉద్యోగుల్ని తెలంగాణ విద్యుత్ సంస్థల్లోనే కొనసాగించాలంది. ఎలాంటి వివక్షకు తావులేకుండా వారికి పదోన్నతులు కల్పించి, సర్వీసు ప్రయోజనాలు ఇవ్వాలని పేర్కొంది. రిలీవ్ చేసిన ఉద్యోగుల సీనియార్టీని తక్షణమే పునరుద్ధరించాలని ఆదేశించింది. కోర్టు గతంలో ఆదేశించిన ప్రకారం రిలీవ్ అయిన ఉద్యోగులకు ఏపీ విద్యుత్ సంస్థలు (58% నిష్పత్తిలో) చెల్లించిన జీతాల సొమ్మును మూడు నెలల్లో తిరిగి ఇచ్చేయాలని తెలంగాణ విద్యుత్ సంస్థలకు స్పష్టంచేసింది. తెలంగాణ విద్యుత్ సంస్థలు ఇతరులకు కల్పించిన పదోన్నతులను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాల్ని తర్వాత పరిష్కరిస్తామని పేర్కొంది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ ఎమ్మెస్కే జైశ్వాల్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

ఏపీ స్థానికత ఆధారంగా సుమారు 1200 మంది విద్యుత్ ఉద్యోగుల (మిగతా 2లో)

పథకాలు ఘనం.. ఇచ్చింది అరకొర

- కేంద్ర బడ్జెట్‌పై మంత్రిమండలి పెదవి విరుపు 11లో
- అగ్రిగోల్డ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు
- మార్చి 5న రాష్ట్ర బడ్జెట్?

రాజధాని అమరావతి పొలాల్లో ఉంది కదా, అది పల్లెటూరు.. నిధులు ఎందుకన్న భావనలో ఉన్నారేమో..! విజయవాడ పల్లె కాదు, పట్నమూ కాదు అనుకున్నారేమో..!

– బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడంపై చంద్రబాబు

రాష్ట్రంలో డ్రోన్, కంటెంట్ కార్పొరేషన్లు

- గుంటూరులో 597 పడకలతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం
- వైద్య సౌకర్యాలకు రూ.3,365 కోట్ల రుణం తీసుకునేందుకు సమ్మతి
- టిడ్కో నిధుల సమీకరణకు ప్రభుత్వం హామీ
- రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయాలు 16లో

ఇదీ సంగతి!



వద్దు సార్, లక్షల కోట్ల రూపాయల రాజాలాంటి స్కాంలనే ఏమీ చేయలేక పోయాం, ఆఫ్టరాల్ 67 కోట్ల రూపాయల కేసునేం చేయగలం సార్, వద్దు.

ఎలా ముందుకెళ్దాం


- భాజపాతో గొడవపడడం ఉద్దేశం కాదు..
- కేంద్ర ప్రభుత్వంలో కొనసాగడంపై చర్చించాకే నిర్ణయం
- పార్టీ రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- బడ్జెట్‌లో రిక్తహస్తంపై తెదేపా మథనం



ఈనాడు – అమరావతి

'భాజపాతో గొడవ పెట్టుకోవడం మన ఉద్దేశం కాదు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ప్రజలు ఆమోదించలేని స్థితి వచ్చినప్పుడు ఏం చేయాలన్న దానిపైనే మన దృష్టంతా..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల నాడిని సరైన సమయంలో కనిపెట్టి ముందుకెళ్లినప్పుడే రాజకీయాల్లో విజయం సాధించగలమని పేర్కొన్నారు. తాను ఇంతకాలం పరుగులు పెట్టానని, ఇకపై మరింత లోతులకు వెళ్లి విశ్లేషిస్తానని, ఒక వ్యూహాన్ని రూపొందిస్తున్నానని తెలిపారు. భాజపాతో సంబంధాలు ఎలా ఉండాలి? కేంద్ర ప్రభుత్వంలో కొనసాగాలా? వద్దా? అన్న అంశాలపై మంత్రిమండలిలోనూ, ఎంపీలతోనూ చర్చించాక ఒక నిర్ణయానికి వద్దామని పేర్కొన్నారు. శుక్రవారం ఉండవల్లిలోని ప్రజాదర్బారు హాల్‌లో ముఖ్యమంత్రి అధ్యక్షతన పార్టీ రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. మంత్రులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. జిల్లాలనుంచి పార్టీ నాయకులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు వెల్లడించారు. కేంద్ర (మిగతా 2లో)

ఎలా ముందుకెళ్దాం



(మొదటి పేజీ తరువాయి)

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్న దానిపైనే ప్రధానంగా చర్చించారు. రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరిపై జిల్లాల నాయకుల అభిప్రాయాలు కోరగా.. కొందరు తీవ్ర ఆవేశంతో స్పందించారు. కేంద్రంలోని తెదేపా మంత్రుల నుంచి రాజీనామాలు తీసుకోవాలని, ప్రధానితో మాట్లాడి రాష్ట్రానికి న్యాయం చేస్తారో లేదో తెలుసుకున్నాక కేంద్రంలో కొనసాగాలో వద్దో నిర్ణయించాలని చిత్తూరు జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి సూచించారు. కడప, గుంటూరు, కృష్ణా జిల్లాలనుంచీ అలాంటి స్పందనే వచ్చింది. భాజపాతో తెగదెంపులు చేసుకోవాలన్న భావన కొందరిలో వ్యక్తమైంది. జిల్లా నేతలు తీవ్ర స్వరంతో మాట్లాడుతుండటంతో.. కొందరు మంత్రులు జోక్యం చేసుకుని ముందు మనం మాట్లాడుకుని స్పష్టతనిద్దామని ముఖ్యమంత్రికి సూచించారు. ఆయన కూడా జిల్లా నేతల్ని సమాధానపరుస్తూ మాట్లాడారు.

ముమ్మాటికీ అన్యాయమే: 'మనకు అన్యాయం జరిగిన మాట వాస్తవం. కేంద్రంపై ప్రజల్లో ఉన్న ఆగ్రహానికి అనుగుణంగా నడుచుకోకపోతే మనమూ వెనుకబడిపోతామన్న ఆందోళన, ఆవేశం రెండూ మీలో ఉన్నాయి. మీ ఆలోచన విధానం నాకర్థమైంది. ఈ అంశం అంత తేల్చికైంది కాదు. రాజకీయాలు ఒక పద్ధతి ప్రకారం జరుగుతాయి. ఎవరంటేవారు మాట్లాడితే లేనిపోని సమస్యలొస్తాయి. మనం ఒక విధానం తీసుకున్నాం. మనకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దమని కోరుతున్నాం. మీరు కూడా సంయమనంతో మాట్లాడండి' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఇది సున్నితమైన అంశం. కేంద్రం నుంచి మనకు ఎలాంటి సహకారం అందకపోవడంతో ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. అన్నీ పరిశీలిద్దాం. ఏం చేస్తే లాజికల్‌గా ఉంటుందో చూద్దాం. ఏదైనా ఒక నిర్ణయం తీసుకున్నా, తీసుకోకపోయినా సమస్యే. మన వ్యతిరేకత తెలియజేయకున్నా ఇబ్బందే. అతిగా వెళ్లినా సమస్యే. పోలవరం వంటి పనులు కేంద్రంతో రోజూ ఉంటాయి. వాళ్లు చెయ్యకూడదనుకుంటే ఇబ్బందులొస్తాయి. ఈ అంశాలన్నీ దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి. ప్రజల మనోభావాలు, రాష్ట్ర ప్రయోజనాలు, జరిగిన అన్యాయం, ఇకపై ఎలా ముందుకు వెళ్లాలి? ఏం చేస్తే న్యాయం జరుగుతుందన్న అంశాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

బెంగళూరుకిచ్చి మనకివ్వరా?

భాజపా అధ్యక్షుడు అమిత్‌షాతో ఆ పార్టీ రాష్ట్ర నేతలు సమావేశమైనప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అన్నీ చేస్తోందన్న భావన వచ్చేలా మాట్లాడటం గురించి ప్రస్తావన రాగా ముఖ్యమంత్రి స్పందిస్తూ.. 'వాళ్లు అన్నీ అయిపోయాయి కదా? ఇంకేం సమస్యలున్నాయి? అని తేలిగ్గా మాట్లాడేస్తున్నారు. ప్రత్యేక హోదా బదులు దానికి సమానమైన ప్రయోజనాలతో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నారు. పైసా రాలేదు. రెవెన్యూ లోటు రూ.16వేల కోట్లకుగాను రూ.నాలుగు వేల కోట్లే వచ్చింది. రైల్వేజోన్ రాలేదు. విశాఖ, విజయవాడ మెట్రోలు, దుగరాజపట్నం నౌకాశ్రయం, కడప ఉక్కు కర్మాగారం రాలేదు. రెండు విశ్వవిద్యాలయాల బిల్లులింకా ఆమోదం పొందలేదు. ఇవన్నీ పెండింగ్‌లో పెట్టుకుని అన్నీ ఇచ్చేశామంటే ఎలా? బాగా అభివృద్ధి చెందిన బెంగళూరులో సబర్బన్ రైల్వే ప్రాజెక్టుకు రూ.17వేల కోట్లు ఇచ్చి మన రాజధానికి మాత్రం గతంలో ఇచ్చిన రూ.2,500 కోట్లతో సరిపెట్టుకోమంటే ఎలా? రైతులు రూ.50వేల కోట్ల విలువైన 35వేల ఎకరాలను రాజధాని కోసం స్వచ్ఛందంగా ఇచ్చినప్పుడు కచ్చితంగా పోలిక వస్తుంది. రైతులకున్న బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని సామాన్యులు పోల్చి చూస్తారు..'అని సీఎం పేర్కొన్నారు. 'మన ప్రజలు తెలివైనవాళ్లు. కష్టపడి పనిచేస్తే ఐదు, పదేళ్లలో ఇబ్బందుల నుంచి బయటపడతాం. అది సమస్య కాదు. కేంద్రం ఎందుకు చెయ్యదన్నదే ఇక్కడ సమస్య. మాకు జరిగిన అన్యాయాన్ని ఎందుకు సరిదిద్దరు? అని అడిగినప్పుడు వారి నుంచి సమాధానం లేదు. ఆరోజు కాంగ్రెస్ తప్పు చేసిందని చెప్పలేరు. ఒక ప్రభుత్వం తప్పు చేస్తే మరో ప్రభుత్వం ఎందుకు సరిదిద్దదు. జరిగిన అన్యాయాన్ని సరిద్దుతారనే ఆరోజు భాజపాతో కలిశాం' అని తెలిపారు.

మీరు చెబితే సరి చేసుకుంటా!

'మనం ప్రతిదీ సీరియస్‌గా తీసుకోవాలి. ఏముందిలే అని చిన్నచూపు చూస్తే పనితీరు దెబ్బతింటుంది. ఏదైనా అంశంపై నేను మౌనంగా ఉంటే మీరూ అలాగే ఉంటున్నారు. నేను మాట్లాడితే. . మీరు ఎక్కువ మాట్లాడుతున్నారు. సంయమనంతో ఉండాలి. ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. నేను చెబుతున్నదే సరైందని కాదు. మీరు కూడా విశ్లేషించుకోండి. నేను చెప్పింది సరిగ్గా లేకపోతే చెప్పండి. సరి చేసుకుందాం. పార్టీ, ప్రభుత్వం క్రియాశీలం కావాలి' అని తెలిపారు. ఇకపై తాను ప్రతిరోజూ సాయంత్రం అయిదున్నర గంటలకల్లా అధికారిక కార్యక్రమాలు ముగించుకుని పార్టీపై దృష్టి పెడతానని, రోజూ మూడు గంటలు పార్టీ పనికి కేటాయిస్తానని తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గాలవారీగా సమీక్షిస్తానని, మొదట కడపతో ప్రారంభిస్తానని చెప్పారు. 'ప్రభుత్వంలో ఉంటేనే మనకు గౌరవం. కొన్ని రాష్ట్రాల్లో మనకంటే తక్కువ పనులు చేసినా కొన్ని పార్టీలు రెండు, మూడుసార్లు సునాయాసంగా గెలుస్తున్నాయి. మన ప్రవర్తనలో, ప్రజలకు తెలియజేసే విధానంలోనూ కొంత లోపముంది. దాన్ని సరిదిద్దుకోవాలి' అని సూచించారు.

వైకాపా ధోరణిని ఎండగట్టాలి..!

భాజపాకు దగ్గరయ్యేందుకు వైకాపా చేస్తున్న ప్రయత్నాల గురించి ప్రస్తావన రాగా సీఎం స్పందిస్తూ.. 'వైకాపా చరిత్ర గుర్తుపెట్టుకోవాలి. తండ్రి చనిపోయిన వెంటనే జగన్ సీఎం కావాలనుకున్నారు. పదవి ఇవ్వలేదు కాబట్టి పార్టీ పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐతో కేసులు పెట్టి జైలుకు పంపింది. మళ్లీ అతన్ని బయటకు తీసుకురాకపోతే సీట్లు రావని భయపడి వాళ్లే బెయిల్ ఇప్పించి బయటకు తెచ్చారు. జైలునుంచి బయటకు వచ్చి హీరోలా ఊరేగారు. ఇప్పుడు కేసుల నుంచి బయటపడేందుకు కేంద్రానికి అనుకూలంగా మాట్లాడుతున్నారు. ఆ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి దిల్లీలో మంతనాలు చేయటమే పనిగా పెట్టుకున్నారు. ఎంపీ పదవి అడ్డు పెట్టుకుని వ్యవహారం చేయాలని చూస్తున్నారు. నిన్నామొన్నా వాళ్ల మాటలు చూస్తుంటే.. మనమేదో తప్పు చేస్తున్నాం, వాళ్లే సరిగ్గా చేస్తున్నారన్న భావన ప్రజల్లో కల్పించేందుకు ప్రయత్నించారు. వాటన్నిటినీ మనం ఎండగట్టాలి.'అని పేర్కొన్నారు.

నీరుకొండ వద్ద 108 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం

- నాలుగు ఆకృతులను పరిశీలించిన ముఖ్యమంత్రి
- తుది మెరుగులు దిద్దాలని ఆదేశం



స్వాతిముత్యం ఆకృతి: విగ్రహం కింద ఉండే పీఠం(పెడస్టల్) ఎత్తు 24 మీటర్లు ఉంటుంది. దానిపైన విగ్రహాన్ని ఏర్పాటుచేస్తారు. ఈ పీఠం స్వాతిముత్యం ఆకృతిలో ఉంటుంది.



ముత్యపు చిప్ప ఆకృతి: విగ్రహం కింద ఉండే పీఠం ముత్యపు చిప్ప ఆకారాన్ని పోలి ఉంటుంది. దీని ఎత్తు 24 మీటర్లు.

ఈనాడు, అమరావతి: రాజధానిలో 108 అడుగుల ఎత్తయిన ఎన్టీఆర్ విగ్రహాన్ని నీరుకొండ వద్ద ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన నాలుగు ఆకృతులను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పరిశీలించారు. వాటికి మరింత మెరుగులు దిద్ది వచ్చే మంత్రివర్గం నాటికి ఆకృతులు సిద్ధం చేయాలని ఆదేశించారు. తొలుత కృష్ణా నది ఒడ్డున కోర్ క్యాపిటల్‌కు అభిముఖంగా ఏర్పాటు చేయాలనుకున్నారు. తాజాగా ఆ ప్రాంతాన్ని మార్చి నీరుకొండ కొండపైన రాజధాని వైపు చూసేలా ఈ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని తీర్మానించారు. విగ్రహం ఎదుట భారీ జలాశయం ఉంటుంది. ఈ కొండపైనే ఎన్టీఆర్ స్మారక కేంద్రం, కన్వెన్షన్ కేంద్రాలు, గ్రంథాలయం, ఎన్టీఆర్ జీవిత విశేషాలతో కూడిన ప్రదర్శనశాల ఉంటాయి.



పరిక్రమ ఆకృతి: సందర్శకులు కొండ చుట్టూ తిరిగి పైకి చేరుకునేలా ఈ ఆకృతి ఉంటుంది. కొండశిఖరంపైన ఎన్టీఆర్ విగ్రహం ఉంటుంది. పీఠం ఎత్తు 35 మీటర్లు. చుట్టూ పచ్చదనం ఉంటుంది. నిర్మిత ప్రాంతం 70 వేల చ.అడుగులు.



కమలం: విగ్రహం కింద ఉండే పీఠం కమలం ఆకారంలో ఉంటుంది. దానిపైన విగ్రహాన్ని ఏర్పాటుచేస్తారు.

కాగితపు ఆధారిత హెచ్‌ఐవీ వైరస్‌నిర్ధారణ పరీక్ష

ప్రపంచంలోనే చవకైన, కచ్చితమైన పద్ధతి

లండన్: హెచ్‌ఐవీ సంక్రమణ వైరస్‌ను ప్రాథమిక దశలోనే కచ్చితంగా గుర్తించగలిగే కాగితపు ఆధారిత నిర్ధారణ పద్ధతిని శాస్త్రవేత్తలు అభివృద్ధి పరిచారు. రక్తంలో వైరస్ ఉంటే ఈ కాగితం రంగు మారడాన్ని బట్టి తొలిదశలోనే గుర్తించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా వ్యాపిస్తున్న ఎబోలా, జికా వైరస్‌లను సైతం ఇదేరకపు పరీక్షతో గుర్తించవచ్చని యూకేలోని ఇంపీరియల్ కాలేజ్ లండన్ పరిశోధకులు చెబుతున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సరైన నిర్ధారణ పరీక్షలు లేకపోవడం, అవగాహన రాహిత్యం వల్ల ప్రాథమిక దశలోనే వైరోగాలను గుర్తించడంలో ఆలస్యమవుతోంది. ఫలితంగా ఇవి వేగంగా ఇతరులకు వ్యాపించడంతో పాటు మరణాల సంఖ్య పెరిగిపోతోందని ఇంపీరియల్ కాలేజ్‌కు చెందిన ప్రొఫెసరు మైక్ థామస్ పేర్కొన్నారు. యూనివర్సిటీ కాలేజ్ లండన్‌వారితో కలసి చేసిన పరిశోధన ఫలించిందని, గర్భనిర్ధారణ ఎలా చేస్తామో ఇకపై హెచ్‌ఐవీ పరీక్ష నిర్ధారణ కూడా అలాగే చేయవచ్చని ఆయన చెప్పారు. హెచ్‌ఐవీ వైరస్ వెలుపల ఉండే పీ24 అనే ప్రొటీన్ ఆధారంగా వ్యాధిని గుర్తిస్తామన్నారు. పరిశోధన పూర్తి వివరాలు 'ఏసీఎస్ నానో' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

సతారాలో స్వల్ప భూకంపం

పుణె: ఇక్కడికి దాదాపు 100 కి.మీ. దూరంలోని సతారాలో శుక్రవారం స్వల్పంగా భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై 3.4 తీవ్రత నమోదయింది.

సంక్షేమ పథకాల్లో రైతులకు వయోపరిమితేమీ లేదు!

కేంద్ర మంత్రి స్పష్టీకరణ

దిల్లీ: ప్రధానమంత్రి బీమా సురక్ష యోజన వంటి పథకాల ప్రయోజనాలను పొందేందుకు రైతులకు వయోపరిమితి ఏమీలేదని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్ శుక్రవారం స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా ఉంటే ఏ వయసు వారైనా సంక్షేమ పథకాలకు అర్హులేనని వివరించారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో - 60ఏళ్లు పైబడిన చిన్న, సన్నకారు రైతులు, కూలీల సంక్షేమానికి చేపట్టిన చర్యలపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. నాబార్డ్ పరిధిలో అమలవుతున్న సంయుక్త బాధ్యుల బృంద(జేఎల్‌జీ) పథకంలో 25 లక్షల మందికి పైగా రైతులు చేరినట్లు వివరించారు. అలాగే యువతకు ముద్ర రుణాలను రూ. 4.5 లక్షల కోట్లకు విస్తరించినట్లు పేర్కొన్నారు. రైతు రుణాలపై వడ్డీరేటుకు సంబంధించి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ప్రభుత్వరంగ సంస్థల ద్వారా 7శాతానికే రుణాలిస్తుండగా.. అందులో ప్రభుత్వం 3శాతం రాయితీ ఇస్తున్నట్లు వివరించారు.

రైల్వే ఛార్జీల విధానంపై పునరాలోచన

మంత్రి పీయూష్ గోయల్

దిల్లీ: రైల్వే ఛార్జీల విధానంపై పునరాలోచన చేస్తున్నట్టు ఆ శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. శుక్రవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానం ఆయన చెబుతూ డిమాండు ఉన్నప్పుడు పెంచి, లేనప్పుడు తగ్గించే సులభతర ధరల (ఫ్లెక్సీ ఫేర్స్) విధానంపై పునఃపరిశీలన చేస్తున్నట్టు చెప్పారు. ఈ విధానం వల్ల కొన్నిసార్లు ఛార్జీలు విపరీతంగా పెరుగుతున్నాయంటూ భాజపా సభ్యుడు రామ్‌విచార్ నేతాం చేసిన వ్యాఖ్యకు ఆయన సమాధానం ఇచ్చారు. చలనశీల ధరల విధానం (డైనమిక్ ప్రైసింగ్) అమలు చేయాలని కమిటీ నివేదిక ఇచ్చిందని, దీంతో రద్దీ లేని సమయాల్లో రాయితీలు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. వేతన సంఘం సిఫార్సుల కారణంగా భారం పడినప్పటికీ, గత నాలుగేళ్లుగా ఛార్జీలు పెంచలేదని తెలిపారు. వందేళ్లనాటి సిగ్నలింగ్ వ్యవస్థను పూర్తిగా తొలగించి, రానున్న అయిదారేళ్లలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఈటీఎస్-2 సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

మద్దతు ధర ఎలా నిర్ణయిస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

పెట్టినపుడు దానికయ్యే వడ్డీని కూడా లెక్కించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ దీనినే సిఫార్సు చేసింది.

ప్రస్తుత విధానం లోపభూయిష్టం

మరోవైపు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం లోపభూయిష్టంగా ఉందని, మార్పులు చేయాలనే అభిప్రాయమూ ఉంది. అన్ని రాష్ట్రాల నుంచి సాగుకు సంబంధించిన వివరాలు తీసుకొని జాతీయ సగటు ఆధారంగా ధర నిర్ణయిస్తున్నారు. దీనివల్ల సాగు ఖర్చు ఎక్కువగా ఉండే రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది.

ఉదాహరణకు 2017లో క్వింటా వరి సాగుకు రూ. 2,158 ఖర్చవుతుందని, దీనికి యాభైశాతం కలిపి రూ. 3,237 కనీస మద్దతు ధరగా నిర్ణయించాలని తెలంగాణ కోరింది. కేంద్ర కమిటీ మాత్రం సాగు వ్యయం, కుటుంబ శ్రమకు కలిపి క్వింటాకు రూ. 1,117 మాత్రమే ఖర్చవుతుందని తేల్చింది. వరి పండించే అన్ని రాష్ట్రాలను లెక్కలోకి తీసుకొని ఈ నిర్ణయానికి వచ్చింది. కౌలు, సొంత పెట్టుబడి వడ్డీ కలిపితే క్వింటాకు రూ. 1,484 అవుతుందని అంచనాకు వచ్చింది. చివరకు క్వింటా ధర రూ. 1,550గా నిర్ణయించింది. దీని ప్రకారం సాగు ఖర్చు, కుటుంబ శ్రమకు క్వింటాకైన ఖర్చు కంటే 38.76 శాతం అదనంగా కనీస మద్దతు ధరను నిర్ణయించినట్లు కమిటీ పేర్కొంది. తాజా నిర్ణయం ప్రకారం యాభైశాతం పెంచినా మరో రూ. 120 వరకు పెరుగుతుంది. ఈశాన్య రాష్ట్రాల్లో నిల్వలు ఎక్కువగా ఉండటం వల్ల కనీస మద్దతు ధర కూడా రావడం లేదని, ఈ నేపథ్యంలో కనీస మద్దతు ధరతో సేకరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్న కమిటీ.. సాగు వ్యయం, కుటుంబశ్రమ, కౌలును కూడా పరిగణనలోకి తీసుకొని ధర నిర్ణయించినట్లుగా పేర్కొంది. అయితే యాభైశాతం గురించి ప్రస్తావించలేదు.

జొన్నకు వచ్చే సరికి మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయని, సాగు వ్యయం, కుటుంబ శ్రమను మాత్రమే లెక్కలోకి తీసుకొన్నట్లు పేర్కొంది. ఇలా ఒక్కో పంటకు ఒక్కో విధానాన్ని కమిటీ అనుసరించింది. 2017-18 సంవత్సరానికి కనీస మద్దతు ధర నిర్ణయించినపుడు 2012-13 నుంచి 2014-15 వరకు వాస్తవ అంచనాలను పరిగణనలోకి తీసుకొంది. కొన్ని పంటల్లో సాగు వ్యయం, కుటుంబ శ్రమను మాత్రమే లెక్కించినా 46 శాతానికిపైగా లాభాలు వస్తున్నాయని, కొన్ని పంటలకు మాత్రమే తక్కువ వస్తుందని కూడా పేర్కొంది.

- 2017-18లో ధరల నిర్ణయ సమయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి అన్ని ప్రధాన పంటలు, ఒడిశా నుంచి వరి, బిహార్ నుంచి వరి, మొక్కజొన్న.. పంజాబ్ నుంచి వరి, పత్తి పంటలను పరిగణనలోకి తీసుకొంది. ఆంధ్రప్రదేశ్ పేర్కొన్న ఖర్చుకు, కమిటీ తీసుకొన్న ఖర్చుకు వ్యత్యాసం ఉండటానికి కారణం దిగుబడి తక్కువగా పేర్కొనడమేనని కమిటీ వ్యాఖ్యానించింది. పత్తిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తక్కువ దిగుబడి ఉన్నట్లు పేర్కొనడంతోపాటు సాగు ఖర్చులను ఎక్కువగా చూపించినట్లు కమిటీ అభిప్రాయపడింది. కొన్ని రాష్ట్రాల్లో సాగు ఖర్చులు తక్కువగా ఉన్నాయి. ఇలా వాస్తవ సాగు ఖర్చులో తేడాలతో పాటు రాష్ట్రాలు పలు అదనపు ఖర్చులను చేర్చుతున్నాయని కమిటీ అభిప్రాయపడింది. ప్రస్తుతం ఇలాంటి అంశాలన్నింటిపైనా నీతిఆయోగ్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

జీవన వ్యయాన్ని లెక్కించడం లేదు

ఎంఎస్‌పీ నిర్ణయంలోనే సమస్య ఉందని సుస్థిర వ్యవసాయ కేంద్రం డైరెక్టర్ రామాంజనేయులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రాల మధ్య ఉన్న వ్యత్యాసాలను కేంద్రం పరిగణనలోకి తీసుకున్నప్పుడు.. తీసుకోనప్పుడు ఆ తేడాలను రాష్ట్రాలే భరించాలని ఆయన అభిప్రాయపడ్డారు. కనీస మద్దతు ధర నిర్ణయ సమయంలో జీవన వ్యయాన్ని సరిగా లెక్కించడం లేదు. . ఇప్పుడిది చాలా ఎక్కువగా పెరిగింది. ధరల రూపంలోనే కాదు, మిగిలిన అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వాలు ప్రయత్నించాలన్నారు. రైతులకు సబ్సిడీలు, ప్రోత్సాహకాలివ్వాలి. వాస్తవ సాగుదారులకు సాయమందేలా ప్రభుత్వాల నిర్ణయాలుండాలి. బ్యాంకుల రుణాల్లో 21 శాతం మాత్రం సన్న,చిన్నకారు రైతులకు వెళ్తున్నాయి. కానీ సాగుదారుల్లో ఎక్కువమంది వీళ్లే. రైతు బతికేలా విధానాల్లో మార్పు వస్తేనే ప్రయోజనం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

కనీస మద్దతు ధర లెక్కించే విధానం ఇలా

- మొదట పంటల సాగు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ఇందుకు అవసరమైన సమాచారాన్ని ఆయా రాష్ట్రాల్లోని అర్థగణాంక శాఖ నుంచి సేకరిస్తారు. ఇందులో కూలీలు, ఎద్దులు, యంత్రాల వినియోగం, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, సత్తువ, నీటి తీరువాలను లెక్కలోకి తీసుకుంటారు. వాటి వినియోగాన్ని బట్టి ప్రాధాన్యమిస్తారు. అన్ని రాష్ట్రాల సమాచారాన్ని తీసుకొని కమిటీ ఓ నిర్ణయానికి వస్తుంది. దీనినే ఏ2(వాస్తవ వ్యయం) గా పరిగణిస్తారు.
- సాగుదారు సొంతంగా భూమిలో పని చేస్తారు. ఈ శ్రమను కనీస మద్దతు ధర నిర్ణయ సమయంలో పరిగణనలోకి తీసుకోవడాన్ని ఎఫ్2గా పేర్కొంటున్నారు.
- భూమి సాగుకు చెల్లించే మొత్తం, సొంతంగా పెట్టిన పెట్టుబడికి వడ్డీని పరిగణనలోకి తీసుకోవడాన్ని సీ2గా పరిగణిస్తున్నారు. ఈ మూడింటిని కలిపి కనీస మద్దతు ధరగా నిర్ణయించడంతోపాటు, దీనిపై యాభై శాతం అదనంగా చెల్లిస్తేనే వ్యవసాయం లాభదాయకమవుతుందని ఆచార్య ఎం.ఎస్.స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతు సంక్షేమ కమిషన్ సిఫార్సు చేసింది. అయితే ప్రస్తుతం వాస్తవ వ్యయం, కుటుంబ శ్రమను లెక్కలోకి తీసుకొని మద్దతు ధర నిర్ణయిస్తున్నారు.
- కేంద్రప్రభుత్వం 26 పంటలకు కనీస మద్దతు ధరలను నిర్ణయించడానికి ప్రముఖ వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త ఛైర్మన్‌గా కేంద్రం నిపుణుల కమిటీని నియమిస్తుంది. ఈ కమిటీ అన్ని రాష్ట్రాల అర్థగణాంక శాఖల ద్వారా సాగు వివరాలు తీసుకుని, క్షేత్రస్థాయి అంశాలను సాగుదారుల నుంచి సేకరిస్తుంది. ఆయా రాష్ట్రాలు తమ రాష్ట్రంలో సాగు వ్యయం, భూమి ధరలు ఇలా అన్నింటి ఆధారంగా పంటల వారీగా క్వింటాకు ఎంత ధర నిర్ణయించాలో కోరతాయి. అన్ని రాష్ట్రాల వివరాలు తీసుకోవడంతోపాటు తాము సేకరించిన వివరాల ఆధారంగా కమిటీ కనీస మద్దతు ధరను సిఫార్సు చేస్తుంది. దీని ఆధారంగా క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ అఫైర్స్(సీసీఈఏ) నిర్ణయం తీసుకుంటుంది. ఈ కమిటీ మొత్తం 11 అంశాలను లెక్కలోకి తీసుకుంటుంది. ఇందులో ఉత్పత్తి వ్యయం, డిమాండ్-సప్లై, మార్కెట్‌పై ధరల ప్రభావం, అంతర్జాతీయంగా ధరల పరిస్థితి ఇలా అనేక అంశాల ఆధారంగా ఈ కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుంది.

2017–18లో కనీస మద్దతు ధర నిర్ణయానికి కమిటీ చేసిన సిఫార్సులు

పంట	ఏ2	ఏ2,ఎఫ్2 కలిపి	సి2	2017–18 కనీస మద్దతుధర
వరి సాధారణ రకం	839	1117	1484	1550
జొన్న(హైబ్రిడ్)	1214	1556	2089	1700
రాగి	1384	1861	2351	1900
మొక్కజొన్న	761	1044	1396	1425
వేరుసెనగ	2546	3159	4089	4250
పొద్దుతిరుగుడు	2933	3481	4526	4000
సోయాబీన్	1787	2121	2921	2850
కంది	2463	3318	4612	5250
పెసర	2809	4286	5700	4800
పత్తి(మీడియంస్టేపుల్)	2622	3276	4376	4020

ఉద్యోగుల విభజనకు స్థానికత రాజ్యాంగ విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

విభజనకు సంబంధించి తెలంగాణ విద్యుత్ సంస్థలు జారీ చేసిన మార్గదర్శకాలు, రిలీవ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ పలువురు ఉద్యోగులు 2015లో హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. స్థానికత ఆధారంగా తమను తెలంగాణ సర్కారు/విద్యుత్ సంస్థలు రిలీవ్ చేయడం సరికాదన్నారు. ఈ వ్యవహారం ఒకానొక దశలో సుప్రీంకోర్టుకు చేరింది. సుప్రీంకోర్టు నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని హైకోర్టును ఆదేశించింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి మార్గదర్శకాలు రూపొందించి సమస్య పరిష్కారానికి చేసిన యత్నం కొలిక్కిరాలేదు. గతంలో ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు.. ఆ రిలీవ్ అయిన ఉద్యోగుల జీతభత్యాలను 42 శాతం తెలంగాణ విద్యుత్ సంస్థలు, 58శాతం ఏపీ విద్యుత్ సంస్థలు భరించాలని పేర్కొంది. ఏపీ సంస్థలు తమ సొమ్మును జీతాల రూపంలో చెల్లించాయి. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరాక అక్కడి ఆదేశాల ప్రకారం ప్రస్తుతం రిలీవ్‌లో ఉన్న ఉద్యోగుల జీతాల్ని తెలంగాణ విద్యుత్ సంస్థలే చెల్లిస్తున్నాయి. ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి హైకోర్టు పలుమార్లు అవకాశం కల్పించినా.. పరిష్కారం కాకపోవడంతో ఇటీవల తుది విచారణ జరిపింది. నిర్ణయాన్ని వాయిదా(రిజర్వు) వేసింది. శుక్రవారం తీర్పు ఇచ్చింది. తెలంగాణ విద్యుత్ సంస్థలు ఏపీతో సంప్రదించకుండా మార్గదర్శకాలు రూపొందించాయని ధర్మాసనం తప్పుపట్టింది. ఉద్యోగుల విభజన వ్యవహారంలో కమలనాథన్, ప్రత్యూష్‌సిన్హా కమిటీలు అనుసరిస్తున్న విధానాన్ని తెలంగాణ విద్యుత్ సంస్థలు అనుసరించలేదని ఆక్షేపించింది. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం వ్యవహరించలేదని పేర్కొంది. ఉద్యోగానికి నివాస ప్రాంతాన్ని అర్హత కల్పించే అధికారం పార్లమెంట్ పరిధిలోనిదని గుర్తుచేసింది. పుట్టిన ప్రాంతం ఆధారంగా ఉద్యోగిని అనర్హుడిగా చేసేందుకు రాజ్యాంగం అనుమతించదని స్పష్టంచేసింది.

గ్రహం అనుగ్రహం
3–2–2018 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
తదియ: మ. 2-20 తదుపరి చవితి
పుబ్బ నక్షత్రం: మ. 3-09 తదుపరి ఉత్తర
అమృత ఘడియలు: ఉ. 8-58 నుంచి 10-31 వరకు
వర్జ్యం: రా. 10-12 నుంచి 11-46 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-34 నుంచి 8-04 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-51

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.7	34.0
హైదరాబాద్	12.8	32.7
తిరుపతి	14.5	35.0
అనంతపురం	15.3	32.0
విజయవాడ	15.4	33.2
విశాఖపట్నం	15.6	32.0
శ్రీకాకుళం	16.5	35.5
కర్నూలు	16.7	33.4
గుంటూరు	16.8	34.5
రాజమహేంద్రవరం	17.0	35.0
కడప	18.0	35.0
తాడేపల్లిగూడెం	19.0	31.0
నరసాపురం	19.2	32.0
ఒంగోలు	19.9	34.1
నెల్లూరు	20.0	32.0

పాలి'టెక్నిక్'గా అక్రమాలు

- డిప్యూటేషన్లనూ వదలని వైనం
- ముందు మారుమూలలకు.. ఆపై పట్టణాలకు
- బినామీ బ్యాంకు ఖాతాల్లోకి మామూళ్లు..
- పాలిటెక్నిక్ కళాశాలల పదోన్నతుల్లో వెలుగులోకి మరిన్ని అక్రమాలు

ఈనాడు - అమరావతి

పాలిటెక్నిక్ కళాశాలల్లో పదోన్నతులు, పోస్టింగ్‌ల్లో జరిగిన అక్రమాలపై ఆసక్తికరమైన అంశాలు బయటకొస్తున్నాయి. పోస్టింగ్ ఇవ్వడంతోపాటు డిప్యూటేషన్లలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధ్యాపకులకు సీనియర్‌గా పదోన్నతి కల్పిస్తూ మొదట ఎక్కడో ఒకచోట పోస్టింగ్ ఇవ్వడం.. ఆ తర్వాత డబ్బులు దండుకొని పలువురికి డిప్యూటేషన్లు వేసినట్లు వెల్లడవుతోంది. విభాగాధిపతులకు వారి బ్రాంచి(సబ్జెక్టు)కి సంబంధించిన ఖాళీల్లో కాకుండా మామూళ్లు ఇచ్చినవారికి ఇతర బ్రాంచిలకు విభాగాధిపతులుగా పోస్టులు ఇచ్చేశారు. సివిల్‌లో-5, మెకానికల్-2, ఈసీఈ-2, ఈఈఈ-2, సీసీపీ-2, సీఎస్-1, జనరల్ సెక్షన్‌లో 8మందికి ఇలా మొత్తం 18 మందికి వారికి సంబంధం లేని బ్రాంచిలకు విభాగాధిపతులకు పోస్టింగ్‌లు ఇచ్చారు. దీంతో మారుమూల ప్రాంతాల్లోని అయా బ్రాంచిలకు విభాగాధిపతుల కొరత ఏర్పడింది. అనంతపురం జిల్లా మడకశిర, రాయదుర్గం, కర్నూలు జిల్లా శ్రీశైలం, కడప జిల్లాలోని సింహాద్రిపురం పాలిటెక్నిక్ కళాశాలల్లో రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు లేని దుస్థితి నెలకొంది.

డిప్యూటేషన్ల హవా..!: రాయలసీమ జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ డిప్యూటేషన్లు భారీగా చోటుచేసుకున్నాయి. ఓ అధ్యాపకుడికి సీనియర్ అధ్యాపకుడిగా పదోన్నతి కల్పిస్తూ మొదట విశాఖపట్నం జిల్లాలోని మారుమూల ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చారు. అనంతరం కొద్దిరోజులకే విశాఖపట్నానికి మార్పుతూ సాంకేతిక విద్యాశాఖ నుంచి డిప్యూటేషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. మరో అధ్యాపకుడికి కృష్ణా జిల్లాలో నియమించి అనంతరం విజయవాడకు, ఇదే జిల్లాలో మరో అధ్యాపకుడి విషయంలోనూ ఇదే విధంగా మార్పు చేశారు. ఇంకొకరికి మొదట అనంతపురం జిల్లాలోని ఓ కళాశాలలకు పోస్టింగ్ ఇచ్చి వెంటనే తిరుపతికి మార్పు చేశారు. అదేవిధంగా చిత్తూరు జిల్లాలోని మారుమూల ప్రాంతంలో మొదట నియమించి అనంతరం తిరుపతికి డిప్యూటేషన్ వేసినట్లు సమాచారం. ఈ వ్యవహారాలతో మారుమూల పాలిటెక్నిక్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఏర్పడుతోంది. దీంతో అక్కడ చేరుతున్న విద్యార్థులకు నైపుణ్యాలు అందడం లేదు. కొన్ని డిప్యూటేషన్లకు రూ. 70వేలు నుంచి రూ. 1.50లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారం అంతా అంతర్గత ఉత్తర్వుల ద్వారా సాగడంతో చాలా అక్రమాలు వెలుగులోకి రావడం లేదని పలువురు అధ్యాపకులు ఆరోపిస్తున్నారు.

బయటవారి ఖాతాల్లోకి సొమ్ములు ..

సాంకేతిక విద్యా విభాగంలో దళారులుగా వ్యవహరించిన కింద స్థాయి ఉద్యోగి బంధువుల బ్యాంకు ఖాతాల్లో మామూళ్ల డబ్బులు భారీగా వేసినట్లు ప్రచారం సాగుతోంది. కమిషనరేట్‌లోని ఉద్యోగికి క్షేత్రస్థాయిలో అనుసంధానంగా పని చేసిన కొందరు పాలిటెక్నిక్ అధ్యాపకులు, వారి కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాల్లోనూ అక్రమాల సొమ్ము జమ చేసినట్లు తెలిసింది. విభాగాధిపతి పోస్టుల్లో కమిషనరేట్‌కు సంబంధంలేని మరో వ్యక్తి కీలకంగా వ్యవహరించినట్లు వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉందని కొందరు అధ్యాపకులు పేర్కొంటున్నారు.



స్వర్ణభారత్ ట్రస్టులో ఆత్కూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పోలీసుస్టేషన్ భవన నిర్మాణాల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో మంత్రులు కొల్లు రవీంద్ర, కామినేని శ్రీనివాస్, జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ, కలెక్టర్ లక్ష్మీకాంతం, సీపీ గౌతం సవాంగ్, ఎమ్మెల్యే వంశీ తదితరులు

'ఆధార్'ను అంతా ఆహ్వానించాలి

- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, హనుమాన్ జంక్షన్ గ్రామీణం, న్యూస్‌టుడే: గతానికి భిన్నంగా పథకాల లబ్ధి నేరుగా ప్రజలకే చేరేలా ప్రధాని మోదీ జాగ్రత్తలు తీసుకుంటున్నారని, ఈ ప్రక్రియలో అక్రమాలను అతిక్రమించటానికి ఆధార్ అతి కీలకంగా మారిందని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆధార్ అత్యుత్తమమైనదని, దానిని అందరూ ఆహ్వానించాలని ఆయన సూచించారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులో రూ. 2.20కోట్లతో పోలీస్‌స్టేషన్, రూ. 1.20 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాల నిర్మాణానికి వేదికగా ఎం.వెంకయ్యనాయుడు శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీటి నిర్మాణం జరగనుంది. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ దేశంలో 63శాతం మంది ఇంకా పల్లెల్లోనే నివసిస్తున్నారన్నారు. విద్య, వైద్యం, వినోదం, తదితర అవసరాల కోసం వారంతా పట్టణాలకు వలస వస్తున్నారని.. ఈ వసతులన్నీ గ్రామాల్లోనే కల్పిస్తే సమస్యే ఉండదన్నారు. ప్రజల జీవనశైలిలో మార్పుల వలనే ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. దాన్ని సరిదిద్దుకోడానికి పూర్వీకుల మార్గం అనుసరణీయమన్నారు. ఆత్కూరు వంటి గ్రామంలో రూ. 60కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని, కలెక్టర్ లక్ష్మీకాంతం, ఐఏఎస్ అధికారి రాజమౌళి లాంటి వ్యక్తుల కృషి ఇందులో ఉందన్నారు. మంత్రులు కామినేని శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, సీపీ గౌతం సవాంగ్, గ్రామ ప్రముఖులు అడుసుమిల్లి రామబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో 595 కిలోమీటర్ల ట్రాక్ పునరుద్ధరణ

ఈనాడు, దిల్లీ: 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో తలపెట్టిన రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ డిసెంబరు నాటికి 61 శాతం పూర్తయింది. మొత్తం 966 కిలోమీటర్లు పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకోగా 595 కిలోమీటర్లు పూర్తయినట్లు కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి రాజన్‌గోహెన్ తెలిపారు. శుక్రవారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు టీజీ వెంకటేష్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 3,600 కిలోమీటర్లు లక్ష్యం కాగా 26శాతం ఏపీలోనే ఉంది. తెలంగాణ పరిధిలో 147 కిలోమీటర్ల లక్ష్యానికి 128 కిలోమీటర్లు(87 శాతం) పూర్తయింది. ఏపీలో ట్రాక్ పునరుద్ధరణకోసం రూ. 2,416 కోట్లు కేటాయించగా డిసెంబరు నాటికి రూ. 1,418.23 (58 శాతం) ఖర్చుచేశారు.

ఐదు జిల్లాల్లో తాగునీటి ప్రాజెక్టులకు ఉత్తర్వులు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్ తాగునీటి సరఫరా సంస్థ (ఏపీడీడబ్ల్యూఎస్‌సీ) ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఐదు జిల్లాల్లో తాగునీటి సదుపాయాలు కల్పించనుంది. రూ. 9,500 కోట్ల వ్యయ అంచనాతో కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో తాగునీటి ప్రాజెక్టులను హైబ్రీడ్ యాన్యుటీ విధానంలో నిర్మించేందుకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైనుకు నిధుల విడుదల

ఈనాడు డిజిటల్, అమరావతి: నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 21.54 కోట్లు విడుదల చేసింది. ఈ మార్గం నిర్మాణానికయ్యే ఖర్చులో 50 శాతం నిధులను రాష్ట్రమే భరిస్తున్నందున ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ రవాణా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నేటి నుంచి మంత్రి అమరనాథరెడ్డి విదేశీ పర్యటన

ఈనాడు డిజిటల్, అమరావతి: విశాఖపట్నంలో ఈ నెలాఖరున జరగనున్న సీఐఐ భాగస్వామ్య ఒప్పంద సదస్సుకు వివిధ దేశాల పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథరెడ్డి బృందం శనివారం నుంచి విదేశీ పర్యటనకు బయలుదేరుతోంది. ఈ నెల 10 వరకూ జరిగే పర్యటనలో మంత్రి బృందం.. బ్రిటన్, జర్మనీ, స్వీడన్ దేశాల్లో పర్యటిస్తుంది. ఈ బృందంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ప్రీతమ్‌రెడ్డి, పరిశ్రమలశాఖ కమిషనర్ సిద్ధార్థజైన్ తదితరులు ఉన్నారు.

క్లౌడ్ సెంటర్ ఏర్పాటుకు అమెజాన్ ఆసక్తి

- క్లౌడ్ విధానం బాగుందన్న సంస్థ ప్రతినిధులు
- అమెరికా పర్యటనలో సీఈఓలతో లోకేశ్ భేటీ

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో క్లౌడ్ సెంటర్ ఏర్పాటుకు అమెజాన్ సంస్థ ఆసక్తి చూపింది. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన క్లౌడ్ హబ్ పాలసీని అభినందించిన ఆ సంస్థ ఉపాధ్యక్షుడు మైఖేల్ పంక్.. దీనిపై అధ్యయనానికి భారత్‌లో ఉన్న తమ బృందాన్ని ఏపీకి పంపుతామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో కలిసి అంకుర సంస్థలు, విద్య, ఆరోగ్య రంగాలను అభివృద్ధి చేసేందుకు స్వచ్ఛందంగా క్లౌడ్‌సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏపీ ఐటీ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన సందర్భంగా శుక్రవారం ఆయన అమెజాన్, శాంసంగ్, బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులను కలిశారు. పెట్టుబడుల కల్పనకు రాష్ట్రంలో తాము కల్పిస్తున్న వసతులను వివరించారు. శాంసంగ్ గ్లోబల్ ఈకామర్స్ సెంటర్‌ను ఏపీలో ఏర్పాటు చేస్తామని ఆ సంస్థ చీఫ్ డిజిటల్ అధికారి కాల్‌రామన్ హామీనిచ్చారు. మిగిలిన రంగాల్లోనూ పెట్టుబడులు పెట్టే అవకాశాలపై అధ్యయనం చేస్తామన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు మరింత సహకారం అందిస్తామని బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ వ్యవసాయాభివృద్ధి ప్రతినిధి చికావా తెలిపారు. వాషింగ్టన్ స్టేట్ ఇండియా ట్రేడ్ రిలేషన్స్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ కంపెనీల సీఈవోలతో నిర్వహించిన ఏపీ బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ లోకేశ్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్- వాషింగ్టన్ మధ్య వాణిజ్య బంధం బలపడేలా చర్యలు తీసుకుంటామని ఈ సమావేశంలో వాషింగ్టన్ రాష్ట్ర గవర్నర్ సైరస్ హబీబ్ హామీనిచ్చారు. సియాటెల్‌లో ఎన్ఆర్ఐ తెదేపా సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో 406 తాత్కాలిక పోస్టుల భర్తీకి అనుమతి

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు పంపిణీ సంస్థల్లో 406 తాత్కాలిక పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసింది. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్)లో 240, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్)లో 166 పోస్టులను మంజూరు చేసింది. ఇంజినీరింగ్, వ్యక్తిగత, జనరల్, అకౌంట్స్, ఆపరేషన్, నిర్వహణ విభాగాల్లో ఆయా క్యాడర్‌లలో పోస్టులను సృష్టించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి హేమ వెంకటప్ప శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శాఖా పరీక్షల్లో ఐదుగురు ఐఏఎస్‌ల ఉత్తీర్ణత

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నిర్వహించిన శాఖాపరమైన పరీక్షల్లో ఐదుగురు ఐఏఎస్ అధికారులు ఉత్తీర్ణులయ్యారు. 2013 బ్యాచ్‌కు చెందిన పి.రవి సుభాష్, ఎస్.షన్మోహన్, శివ శంకర్, సృజన.జి, లక్ష్మీషా.జి ఇందులో ఉన్నారని ప్రభుత్వ కార్యదర్శి శ్రీకాంత్ నాగులపల్లి శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.



సమస్యను ఎదుర్కొనే విద్యా విధానం రావాలి

- విజ్ఞాన్ మహోత్సవంలో జస్టిస్ జాస్తి చలమేశ్వర్

ఈనాడు–గుంటూరు: 'విద్యార్థి దశలో, జీవితంలో ఏదైనా సమస్య వస్తే దాన్ని ఎలా పరిష్కరించుకోవాలో తరగతి గదిలోనే నేర్పించాలి. అలాంటి విద్యావిధానాన్ని అనుసరించాలి' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. ఇలాంటి విధానాన్ని 15ఏళ్ల కిందటే తాను విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్యకు సూచించానని ఆయన తెలిపారు. గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2రోజులపాటు జరిగే 'విజ్ఞాన్ మహోత్సవ్' జాతీయ కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'యువత, విద్యార్థుల్లో నైపుణ్యాలు కొరవడటం, సమస్యలను పరిష్కరించుకునే ధోరణి లేక ఒత్తిడికి లోనుకావటం వంటివి జరుగుతున్నాయి. వారిలో సామర్థ్యాలను గుర్తించి సమస్యలను పరిష్కరించుకునేలా తరగతి గదిలోనే అర్హతలు కలిగిన అధ్యాపకులతో అన్ని రకాల శిక్షణలను యాజమాన్యాలు అందించాలి' అని సూచించారు. అప్పుడే ప్రపంచం ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారం చూపగలరని, మూస విధానంలో విద్యకొనసాగితే యువతే సుడిగుండంలో చిక్కుకుంటుందని హెచ్చరించారు.



సృజనాంకురను ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్; పక్కన విజ్ఞాన్ అధినేత లావు రత్తయ్య, తదితరులు

విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య మాట్లాడుతూ.. 15ఏళ్లుగా తాము వర్సిటీలో ఏటా విజ్ఞాన్ మహోత్సవం పేరుతో కళా, సాంస్కృతిక నైపుణ్యాలను ప్రదర్శించటానికి అనేక పోటీలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 800 ప్రాజెక్టులు వచ్చాయని, వాటిని తయారు చేసిన 8 వేల మంది యువత ఈ కార్యక్రమంలో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించుకోనున్నారని చెప్పారు. ఎస్‌బీఐ ఏపీ ప్రధానాధికారి మనీపాల్వేశన్ మాట్లాడుతూ.. సాంకేతిక విద్యను ప్రోత్సహించడం, విద్యార్థులకు విద్యారుణాలు అందజేయటం, ఉచితంగా ఉపకారవేతనాలు పంపిణీ వంటి అంశాల్లో తమ బ్యాంకు చేయూతనందిస్తోందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఎం.వై.ఎస్.ప్రసాద్, ఛాన్సలర్ డాక్టర్ రామ్మూర్తినాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీల్లో అక్రమాలపై విచారణకు కమిటీ

ఈనాడు, అమరావతి: రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న ట్రిపుల్ ఐటీల్లో లొసుగులపై విచారణకు ప్రభుత్వం కమిటీని వేసింది. అధ్యాపకులు సక్రమంగా విధులకు హాజరుకావడంలేదని, కొనుగోళ్లు, నియామకాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ నూజివీడు ట్రిపుల్‌ఐటీలో బంగారు పతకం సాధించిన శివకుమార్ అనే విద్యార్థి స్నాతకోత్సవంలో మంత్రి గంటా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విశ్రాంత ఐఏఎస్ సీబీఎస్ వెంకటరమణ ఛైర్మన్‌గా, జేఎన్‌టీయూ కాకినాడ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి స్వరూపరాణి, విశ్రాంత ఈఎన్‌సీ ఎం.కె. రహ్మాన్ సభ్యులుగా విచారణ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీ 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

గత కమిటీ నివేదిక మూలకు..

ట్రిపుల్ ఐటీల్లో అక్రమాలపై గతంలో ఏకసభ్య కమిటీని నియమించారు. ఈ కమిటీ ఇచ్చిన నివేదికపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. అవసరం లేకపోయినా కొనుగోళ్లు, నిబంధనల ఉల్లంఘన.. ఇలా అనేక అక్రమాలు జరిగినట్లు నివేదికలో పేర్కొంది. నియామకాల్లోనూ నిబంధనలు పాటించలేదని గత కమిటీ వెల్లడించింది.

చంద్రబాబు బలహీనతలే రాష్ట్రానికి శాపం

- పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బలహీనతలే ఏపీ పాలిట శాపంగా మారాయని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి విమర్శించారు. బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా తెదేపా, వైకాపా ఎంపీలందరూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడారు. 'కేంద్రంలో భాజపా, రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వాలకు ఇదే చివరి బడ్జెట్ కావాలి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలప్పుడు భాజపా అభ్యర్థులకు మద్దతిచ్చే విషయంలో కనీసం మాట్లాడి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి తలెత్తుండేది కాదు. ప్రత్యేక హోదా, రాజధానికి నిధులు, రెవెన్యూ లోటు భర్తీ, రైల్వే జోన్, పోలవరం నిధులపై స్పష్టత, దుగరాజపట్నం ఓడరేవు, కడప ఉక్కు పరిశ్రమ ఇలా ఏవిషయంలో చూసినా రాష్ట్రానికి అన్యాయమే జరిగింది. ప్రధాని మోదీ అమరావతికి మట్టి, నీరు తెచ్చినప్పుడే సీఎం మేల్కొని ఉండాల్సింది. అమిత్ షా రాష్ట్రానికి రూ. 1.40 లక్షల కోట్లు ఇచ్చామని చెప్పినప్పుడైనా స్పందించి ఉండాల్సింది. ఏపీలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ ప్రజావ్యతిరేక పక్షాలే. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతాం" అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు

12 నుంచి ఐఆర్‌సీటీసీ భారతదర్శన్ యాత్ర

విజయవాడ, న్యూస్‌టుడే: దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఈ నెల 12వ తేదీ నుంచి భారతదర్శన్ ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ డీజీఎం ఆర్.కె.చాంద్ తెలిపారు. శుక్రవారం విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ఆయన యాత్ర వివరాలను వెల్లడించారు. ప్రత్యేక రైలు ఈ నెల 12న విజయవాడ నుంచి బయలుదేరి 20న తిరుగు ప్రయాణమవుతుందన్నారు. యాత్రలో హంపి, గోవా, గోకర్ణం, మురుడేశ్వర్, కొల్లూరు మూకాంబిక దేవాలయం, శృంగేరి శారదాపీఠం, అన్నపూర్ణేశ్వరి, ధర్మస్థలి దేవాలయాలు, ఉడిపి, మైసూర్ ప్యాలెస్, బృందావన్ గార్డెన్స్, చాముండేశ్వరి, బేలూరు, హలెబీడు దేవాలయాల సందర్శన ఉంటుందని అన్నారు. ఈ రైలు ఖమ్మం, వరంగల్, కాచిగూడ, మహబూబ్‌నగర్, కర్నూలు, గుంతకల్లు మీదుగా నడుస్తుంది. స్లీపర్, ఏసీలో ప్రయాణం, వసతి, విడిది, రవాణా, బీమా సౌకర్యం కూడా సంస్థ కల్పిస్తోంది. స్లీపర్ టికెట్ ధర ఒక్కొక్కరికి రూ. 10,375, థర్డ్ ఏసీ రూ. 12,265 ఉంది. టికెట్ల బుకింగ్ ఇతర వివరాలకు 0866-2572280, 9701360632, 9701360675 ఫోన్‌నెంబర్లలో సంప్రదించవచ్చున్నారు. సమావేశంలో సంస్థ మేనేజర్ కె. మధుసూదనరావు పాల్గొన్నారు.

అధ్యయన యాత్రకు సోమిరెడ్డి బృందం

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బృందం విదేశాల్లో అధ్యయన యాత్రకు శుక్రవారం రాత్రి బయలుదేరి వెళ్లింది. ఈ బృందంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి దామోదరనాయుడు, పరిశోధన విభాగం సంచాలకుడు ఎన్.వి.నాయుడు, ముఖ్య శాస్త్రవేత్త ప్రసూనరాణి ఉన్నారు. వీరు వియత్నాం, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ దేశాల్లో ఈ నెల 11 వరకు పర్యటిస్తారు.



కొరవడిన ప్రత్యేక శ్రద్ధ

అవిభక్త కవలల్ని శస్త్రచికిత్సతో వేర్వేరు చేసే ప్రక్రియలో అడుగడుగునా ఎన్నో జాగ్రత్తలు, విడివడిన పిల్లలు ఆరోగ్యకరంగా ఎదిగేందుకు ప్రత్యేక తోడ్పాటు చర్యలు తప్పనిసరి. కడ నిమిషంలో హడావుడిగా వండివార్చిన పునర్విభజన చట్టాన్ని పట్టాలకెక్కించి యూపీఏ పాలకశ్రేణి చాపచుట్టేయగా, ఉభయ తెలుగు రాష్ట్రాల ఉజ్జ్వల ప్రగతికి తాము భరోసాగా ఉంటామని మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అభయమిచ్చింది. కేంద్రంలో ఎన్‌డీఏ సర్కారు కొలువుతీరి మూడున్నరేళ్లు దాటిపోగా, వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల ముందు విత్తమంత్రి ప్రవేశపెట్టిన కడపటి పూర్తిస్థాయి బడ్జెట్- రెండు తెలుగు రాష్ట్రాలకూ నిరాశ నిస్పృహల్నే మిగిల్చింది. విభజన చట్టం హామీల అమలుకోసం ఎంతగా మొత్తుకుంటున్నా బడ్జెట్లో వాటి ఊసే కనపడకపోవడం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలనే కాదు- ప్రజల్నీ కుపితుల్ని చేస్తోంది. విభజన చట్టం హామీల కింద గత ఏడాది ఏపీకి చేసిన కేటాయింపులు కేవలం రూ.257.47 కోట్లు; ఈసారి ఆ మొత్తం రూ.337 కోట్లకు మాత్రమే పెరిగి నివ్వెరపరుస్తోంది. తెలంగాణకు బడ్జెట్లో రూ.2,652.22 కోట్లు కేటాయించినా, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఏటా అందించే మొత్తాలేగాని అదనంగా ఒరిగిందేమీ లేదని గుర్తించాలి. ప్రగతిశీల రాష్ట్రంగా తెలంగాణ- అన్నిటికీ కలిసి రూ.40వేల కోట్ల ప్రతిపాదనల్ని పంపితే, కేంద్రం అసలు పట్టించుకోలేదని కేసీఆర్ ప్రభుత్వం గుస్సాపడుతోంది. మూడేళ్లకుపైగా విభజన చట్టం హామీల అమలులో నెలకొన్న స్తబ్దతను చెదరగొట్టాలంటూ జనవరి రెండోవారంలో ప్రధానమంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని చంద్రబాబు సర్కారు ఆవేదన చెందుతోంది. ఏపీ చేపట్టిన తక్షణ పాలన ప్రాజెక్టు దేశానికే ఆదర్శప్రాయమని ప్రథమ పౌరుడే కితాబులిచ్చినా, ఆ తరహా నవకల్పనలకు మౌలిక సదుపాయాల దన్ను సమకూడితేనే కదా- సుస్థిరాభివృద్ధి సాధ్యపడేది? కాళేశ్వరం నిర్మాణం అనుపమానమని శ్లాఘించడమేగాని, జాతీయ హోదాతో వ్యయభారాలనుంచి విముక్తి కల్పించాలన్న విజ్ఞప్తుల్ని పెడచెవిన పెడుతున్నారు. విభజన చట్టం హామీల అమలు ఇంకెన్నడని రెండు తెలుగు ప్రభుత్వాలూ సంధిస్తున్న ప్రశ్నలు పూర్తిగా అర్థవంతమైనవి!

విభజన సమయంలో తెలంగాణకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఉక్కు కర్మాగారం, గిరిజన- ఉద్యాన విశ్వవిద్యాలయాలు ఇస్తామని నాటి యూపీఏ ప్రభుత్వం హామీ ఇచ్చింది. స్థలంతోపాటు మౌలిక వసతులు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా కోచ్ ఫ్యాక్టరీ దస్త్రాలు దాటి కదలిరానంటోంది! బయ్యారం ఉక్కు కర్మాగారంపై కేంద్రమంత్రి రెండు నెలల క్రితం విస్పష్ట ప్రకటన చేసినా, దాని ప్రస్తావన బడ్జెట్లో కనుమరుగైంది. ఉద్యాన విశ్వవిద్యాలయమైతే అతీగతీ లేదు. కోటి ఎకరాలకు సాగునీటి కల నెరవేర్చే కాళేశ్వరం, ఇంటింటికీ మంచినీటి మిషన్ భగీరథ లాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు దన్నుగా నిలవాలన్న తెలంగాణ ఆకాంక్షలు వట్టిపోతున్నాయి. విభజన సమయంలోనే 'లోటు' కాటుకు గురైన పద్దులుగా ఆర్థిక సంఘం చెప్పినట్లు 2020కి కూడా లోటులో ఉండే ఏకైక రాష్ట్రంగా దిగాలు పడుతున్న ఏపీ పరిస్థితి మరింత బాధాకరంగా ఉంది! ఉన్నత విద్యా విషయకంగా వెనకబాటును చెదరగొట్టి నాణ్యమైన మానవ వనరులకు గొడుగు పట్టేందుకంటూ విభజన చట్టం ఏపీకి 12 విద్యాసంస్థలు మంజూరు చేసింది. తనవంతుగా వాటికి రూ.11,600 కోట్ల విలువైన 2,900 ఎకరాల భూముల్ని తెదేపా ప్రభుత్వం కేటాయించినా వాటి పరిపూర్తికి కావాల్సిన దాదాపు ఏడు వేల కోట్ల రూపాయల్లో- ఏటా విదిలిస్తున్నది పిసరంతే! పది విద్యాసంస్థలకు ఈ ఏడాది బడ్జెట్లో కేటాయించిన రూ.287 కోట్లు- మొత్తం అవసరాల్లో 4.1శాతమే! విశాఖ రైల్వేజోన్ విషయంలో ఏపీకి ఈసారీ నిరాశే ఎదురు కాగా- కొత్త లైన్లు, డబ్లింగ్, విద్యుదీకరణ తదితరాల్లో రెండు రాష్ట్రాలకూ దక్కిందేమీ లేదు. బెంగళూరు, ముంబయి మహానగరాల్లో మెట్రో, ఇతర లైన్ల విస్తరణకోసం వేల కోట్లు అనుగ్రహించిన కేంద్ర విత్తమంత్రి జైట్లీ హైదరాబాద్, అమరావతి అవసరాల్ని గుర్తించనే లేదు!

'ప్రత్యేక హోదాతో మూడునుంచి మూడున్నరవేల కోట్ల రూపాయల ప్రయోజనం దక్కేది... ప్రత్యేక ప్యాకేజీవల్ల రూ.2.30 లక్షల కోట్ల ప్రాజెక్టులు ఏపీకి దక్కాయి'- అని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా వెంకయ్యనాయుడు నిరుడు జూన్‌లో వెల్లడించారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో రూ.10.57 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగితే అందులో రూ.6.13 లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలవేనంటూ ఏపీ అభివృద్ధిపట్ల కేంద్రం ప్రత్యేక ఆసక్తికి అది నిదర్శనమని ప్రకటించారు. ప్రధానంగా వ్యవసాయాధారిత రాష్ట్రంగా మిగిలిన ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక, సేవారంగాల్లో వెనకబాటు కుంగదీస్తోంది. వడివడిగా అభివృద్ధి స్థిరకక్ష్యలో కుదురుకోవాలని, 2022 నాటికి రూ.2.95 లక్షల తలసరి ఆదాయంతో దేశంలోనే తొలి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా ఎదగాలనే లక్ష్యం నెరవేరాలంటే- విభజన చట్టం తాలూకు హామీలు త్వరితంగా వాస్తవ రూపం దాల్చాలి. దిల్లీకి మించిన రాజధాని నిర్మాణానికి మోదీయే వాగ్దానం చేసినందున అమరావతిపై సమధిక ఔదార్యం కనబరచాలని ఏపీ చిరకాలంగా కోరుతోంది. ప్యాకేజీకి మోదీ మంత్రివర్గం ఆమోదం తెలిపినా, దాని గడువు 2020 తరుముకొస్తుండటంతో ప్రాజెక్టుల సత్వర అమలుపై తీవ్రాందోళన చెందుతోంది. రెవిన్యూ లోటు భర్తీ, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్, దుగరాజపట్నం నౌకాశ్రయం వంటి కీలక ప్రకటనల కోసం ఏపీ; ఐఐఎం, ఎయిమ్స్, పసుపు బోర్డు, కాళేశ్వరానికి జాతీయ హోదా వంటివాటి కోసం తెలంగాణ చకోరాలై ఎదురుచూస్తున్నాయి. రాష్ట్రాలనే జవనాశ్వాలుగా పూన్చి జాతిప్రగతి రథాన్ని పరుగులు పెట్టిస్తానన్న మోదీ సర్కారు- రెండు తెలుగు రాష్ట్రాల బాలారిష్టాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. అవి ధీమాగా పురోగమించే వాతావరణం కల్పించాలి!

పల్లెరాగం... సేద్యగానం

గ్రామీణ వికాసానికి, పల్లెలతో ముడివడిన వ్యవసాయానికి ఊతమిస్తూ ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేసే దిశగా అరుణ్ జైట్లీ బడ్జెట్ అడుగులు వేసింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టి కల్పించడం, గ్రామాల్లో మౌలిక వసతులు పెంపొందించడం ద్వారా వ్యవసాయానికి ఊతమిచ్చేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుంది. ఎన్నికలకు ముందు తన చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఆర్థికమంత్రి జైట్లీ పల్లెప్రజ శ్రేయానికి పెద్దపీట వేశారు. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా ఏటికేడు పడిపోతున్నా సేద్యరంగం చోదకశక్తిగానే ఉంటుందని ఆర్థిక సర్వే స్పష్టీకరించిన తరుణంలో అన్నదాతల సంక్షేమాన్ని విస్మరించబోమని బడ్జెట్ చాటిచెప్పింది. మొత్తంగా సంస్కరణల పథం తప్పకుండా సామాన్యుడి సంక్షేమాన్ని, రైతుశ్రేయాన్ని స్మరిస్తూ పల్లె వికాసాన్ని పల్లవించిన బడ్జెట్ ఇది!

ఆదాయం పెంపే లక్ష్యం


రైతుల ఆదాయాన్ని 2022నాటికి రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో గత రెండు బడ్జెట్లలో సేద్యానికి అధికంగా కేటాయింపులు చేసిన మోదీ ప్రభుత్వం, ఈసారీ అదే పంథా అనుసరించింది. లక్ష్యసాధనకు అనుసరించాల్సిన మార్గాలను ఎక్కడా ప్రస్తావించకుండానే గ్రామీణాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి పరస్పరం ముడివడి ఉన్నాయన్న సూత్రాన్ని గుర్తు చేస్తూ, పల్లె ప్రాంతాల్లో మౌలికవసతులకు పెద్దపీట వేసింది. అందుకు సుమారు రూ.22 వేలకోట్లు కేటాయించడం పరోక్షంగా సేద్యానికి మేలుచేసేదే. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.63,836 కోట్లు కేటాయించడం మెచ్చదగినదే. ఇందులో హరిత విప్లవానికి రూ.13,909 కోట్లు, శ్వేతవిప్లవానికి రూ.2,220 కోట్లు, నీలి విప్లవానికి రూ.643 కోట్లు, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజనకు రూ.9,429 కోట్లు కేటాయించారు. సాగునీటిని పొదుపుగా వాడుకుంటూ పంటల ఉత్పాదకతను పెంపొందించేందుకు ఈ పథకంలో భాగంగా సూక్ష్మనీటి పారుదలకు రూ.4,000 కోట్లు ప్రత్యేకించారు. వీటికింద దేశంలోని పలు సాగునీటి ప్రాజెక్టులకు అత్తెసరు నిధులిచ్చి మమ అనిపించారు. మోదీ గతంలో ఎంతో గొప్పగా ప్రకటించిన ఫసల్ బీమా పథకానికి కేవలం రూ.13 వేలకోట్లు ఇచ్చారు. పంటల బీమా పరిధిలోకి 50 శాతం విస్తీర్ణాన్ని తీసుకువచ్చే లక్ష్యాన్ని పెట్టుకున్న ప్రభుత్వం అందుకు తగ్గట్లు నిధులు కేటాయించడంలో విఫలమైంది. రైతులకిచ్చే స్వల్పకాలిక రుణాలకు వడ్డీరాయితీ కింద రూ.800 కోట్లు, పంటల పరిశోధనలకు రూ.800 కోట్లు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు రూ.685 కోట్లు ప్రత్యేకించారు. ఆహారశుద్ధి రంగానికి రూ.1,400 కోట్లు, పశుసంవర్ధక, ఆక్వాపరిశ్రమల అభివృద్ధికి రూ.10 వేలకోట్లు ప్రకటించడం ముఖ్యమైనవి.

సేంద్రియసేద్యం దిశగా స్వయం సహాయక బృందాలను ప్రోత్సహిస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే దిశగా సేంద్రియసేద్యాన్ని మరింతగా ప్రోత్సహించాలన్న నిర్ణయం మంచిదే. వీటికితోడు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో క్లస్టర్ ఆధారిత విధానాల ద్వారా రైతులకు మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు కేంద్రం 'ఆపరేషన్ గ్రీన్ ప్రాజెక్టు'ను ప్రకటించింది. దీనివల్ల త్వరగా పాడయ్యే టమాటో, ఉల్లి, బంగాళదుంపల ధరల్లో తలెత్తే హెచ్చుతగ్గుల్ని నియంత్రించేందుకు బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించారు. ఈ మొత్తం ఎంతమాత్రం సరిపోదని ప్రభుత్వం గుర్తించాలి. ఆహార శుద్ధి, వాణిజ్య శాఖలతో కలిసి వ్యవసాయ ఉత్పత్తుల క్లస్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా దేశంలోని పలు జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు నిల్వ, గ్రేడింగ్ తరహా వసతుల కల్పనకు మార్గం సుగమమవుతుంది. పెద్ద క్లస్టర్ల కింది సేంద్రియ సేద్యం సాగించే ఉత్పత్తిదారుల సంఘాలు, గ్రామీణ ఉత్పత్తిదారుల సంస్థలను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి రూ.2,000 కోట్లతో మూలధన నిధి ఏర్పాటుచేయడం కొంతలో కొంత ఊరట. రైతులు నేరుగా వినియోగదారులకు పంటను విక్రయించుకోవడానికి, టోకు కొనుగోళ్లను ప్రోత్సహించడానికి వీలుగా గ్రామాల్లో ఇప్పుడున్న సంతలను వ్యవసాయ మార్కెట్లు 'గ్రామ్స్' అభివృద్ధిపరచడం మంచి ముందడుగు. మార్కెట్ కమిటీ నిబంధనల నుంచి ఈ 'గ్రామ్స్'కు మినహాయింపు ఇవ్వడం కొసమెరుపు. దీనివల్ల పండ్లు, కూరగాయలు సహా స్థానికంగా పండే పంటలను వారపు సంతల్లో విక్రయించుకునే బడుగు రైతులకు మంచి ధరలు అంది వారి ఆదాయం పెంచే లక్ష్యం ఇందులో కనిపిస్తోంది. మార్చినాటికి 585 విపణులను ఇ-నామ్ పథకంతో అనుసంధానిస్తామని చెప్పడం ద్వారా దేశంలోని దాదాపు అన్ని జిల్లాల్లో సమీప భవిష్యత్తులో రైతులకు మంచిధరలు అందేలా కృషిచేస్తామని ప్రభుత్వం స్పష్టీకరించింది. మద్దతు ధరల విషయంలో రైతులకు న్యాయం జరిగే పరిస్థితులు లేకపోయినా పరోక్షంగా సాగుదారుల ఆదాయం పెంచడంపైనే ప్రస్తుత బడ్జెట్ ఎక్కువగా దృష్టిపెట్టినట్లు కనిపిస్తోంది.

ఔషధ, సుగంధ మొక్కల సాగు, వాటి ఆధార పరిశ్రమల స్థాపనకు రూ.200 కోట్లు కేటాయించారు. వెదురు సాగు ఆధార పరిశ్రమల కోసం రూ.1,290 కోట్లు ప్రత్యేకించడం ద్వారా అటవీ వ్యవసాయం చేసే గిరిజన రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. వ్యవసాయ యంత్రాల రాయితీ పథకానికి రూ.114 కోట్ల కేటాయింపు వ్యవసాయ యాంత్రీకరణ దిశగా ఊరటనిచ్చేదే. రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పలు పరోక్ష చర్యలు ప్రకటించింది. ఆహార

కేటాయింపులు ఎంతెంత?

సంవత్సరం	రూ.కోట్లలో
2013–14	21,933
2014–15	25,917
2015–16	22,958
2016–17	53,806
2017–18	56,589
2018–19	63,836



కేంద్ర బడ్జెట్లో గ్రామీణ భారతానికి పెద్ద పద్దు

శుద్ధి రంగాన్ని ప్రతి జిల్లా పరిధిలో బలోపేతంచేసే దిశగా రూ.1,400 కోట్ల కేటాయింపే ఇందుకు ఉదాహరణ. నిరుటికంటే ఇది రెట్టింపు మొత్తం. ఈ మేరకు ఆయా జిల్లాల్లో మెగాఫుడ్ పార్కులు, శీతల గిడ్డంగులు, ఆహార శుద్ధి యంత్రాలు, విలువ జోడింపు పరిశ్రమలకు కావలసిన ఇతర మౌలిక వసతుల కల్పనకు ఈ నిధులు అందజేస్తారు. ఈ ఏడాది ఏర్పాటు చేయదలచని 42 మెగాఫుడ్ పార్కులను అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటుచేస్తే ఫలితాలు బాగుంటాయి. వీటి రాకతో ప్రపంచస్థాయి పరీక్షా కేంద్రాలు నెలకొనడంతో పాటు ఉత్పత్తుల సేకరణ వల్ల స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తులకు స్థిరమైన ధరలు దక్కే అవకాశం ఉంది.

కొత్త చొరవ

ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆహార శుద్ధి పరిశ్రమల వార్షిక టర్నోవర్ రూ.100 కోట్లు ఉంటే, ఆ మొత్తంపై ఎంత లాభం వచ్చినా అయిదేళ్లపాటు వంద శాతం పన్ను మినహాయింపు ఇవ్వడం రైతు సంఘాల స్థాయిలో పరిశ్రమల ఏర్పాటు దిశగా పెద్ద ముందడుగు. ఇది కచ్చితంగా ఉత్పత్తిదారు సంఘాల ఏర్పాటును, వారి స్థాయిలో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించే అంశమే. వీటికి ఆర్థిక సాయం చేసేందుకు ప్రత్యేక ఆర్థిక సంస్థలను నెలకొల్పనున్నారు.

పరపతి సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామంటూ ఈ దఫా రూ.11 లక్షలకోట్ల వ్యవసాయ రుణాలు అందిస్తామని బడ్జెట్లో పేర్కొన్నారు. ఇందులో స్వల్పకాలిక రుణాల కంటే దీర్ఘకాలిక రుణాలే అధికం. సంస్థాగతంగా దేశంలోని మొత్తం రైతుల్లో వ్యవసాయ రుణాలు అందుకుంటున్నవారి శాతం నేటికీ 30 దాటకపోవడం శోచనీయం. వీటిలో అధికభాగం పుస్తక సర్దుబాట్లే ఉంటాయి. నేటికీ బ్యాంకులిస్తున్న మొత్తం రుణాల్లో వ్యవసాయానికి అందుతున్నవి 12 శాతం మించడంలేదు. కౌలుదారులకు పంట రుణాల పరిస్థితి ఎండమావే. ఈ దిశగా నీతి ఆయోగ్ కృషి చేస్తోందన్న బడ్జెట్, అన్ని రాష్ట్రాల అంగీకారంతో అది అమలుకు నోచుకునేసరికి దశాబ్దాలు దాటుతుందన్న భయాలు కొట్టిపారేయలేనివి. విత్తన చట్టమే అందుకు ఉదాహరణ. 2002లోనే విత్తన చట్టానికి రూపకల్పన చేసినా పార్లమెంటుకు దాన్ని ఆమోదించే తీరికే లేకపోయింది.

వట్టిమాటలు కారాదు...

సేద్యరంగానికి జవసత్వాలు కల్పించకుండా కాగితాలపై కేటాయింపులు పెంచుకుంటూ పోయినంతమాత్రాన దేశంలో రైతుల ఆదాయం పెరగదు. క్షేత్రస్థాయిలో పంటల ఉత్పాదకత అధికమై, గిట్టుబాటు ధరలు లభించేలా చేయగలిగితేనే స్థిరమైన ఆదాయాలను రైతులు కళ్లజూడగలుగుతారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు సుమారు 25 శాతంవరకు రైతుల రాబడిని దెబ్బతీస్తున్నాయని ఆర్థిక సర్వే హెచ్చరించిన నేపథ్యంలో- విపత్తులు ముంచెత్తిన ఏడాది అన్నదాతల పరిస్థితిని ఊహించుకోవచ్చు. సాగులో నష్టాలు వాటిల్లితే అనుబంధ రంగాలు అదనపు ఆదాయంతో రైతుల్ని ఆదుకోవడం పరిపాటి. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాడిపరిశ్రమాభివృద్ధికి మోదీ ప్రభుత్వం రూ.2,000 కోట్లతో 'డెయిరీ ప్రాసెసింగ్ నిధి' ఏర్పాటుచేసింది. మూడేళ్లలో దీన్ని రూ.8,000 కోట్లకు పెంచే యోచన ఉన్నట్లు తెలిపింది. ఈ సంగతిని పక్కనపెట్టేసి పాల దిగుబడులు పెంచేందుకు శ్వేత విప్లవానికి రూ.2,220 కోట్లుగా పేర్కొని కొంత గందరగోళపరచినట్లయింది. రైతుకు నేరుగా ఇన్‌పుట్ సబ్సిడీలు అందించే విషయంలో మోదీ ప్రభుత్వం ఏదో చేస్తుందని ఆశించినవారికి నిరాశే ఎదురైంది. ఎరువుల సబ్సిడీకి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.70,080 కోట్లు కేటాయించింది. నిరుటికంటే ఇది సుమారు రూ.5,000 కోట్లు అధికం. సంస్కరణల పథంలో ముందుకు సాగుతున్నామని ప్రభుత్వం చెబుతున్నా దేశంలో రైతుల ఆత్మహత్యలు ఆగడంలేదు. దిద్దుబాటు చర్యలు చేపట్టని ఫలితంగా వ్యవసాయం నుంచి వైదొలగుతున్నవారి సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. జలవనరులు నానాటికీ పడిపోతున్నాయి. దీర్ఘకాలంలో ఆహారోత్పత్తిపై ఇది పెను ప్రభావం చూపడం ఖాయం. ఆర్థికసర్వే ఈ భయాలను వ్యక్తీకరించిన తరుణంలో సమర్థ నీటి యాజమాన్యం, సూక్ష్మనీటిపారుదల పద్ధతులను విస్తృతంగా రైతులకు వాడుకలోకి తీసుకురావాలి. ఏటా భూసార పరీక్షలు చేయించినవారూ సిఫార్సు మేరకు ఎరువులు వాడని పరిస్థితి పోవాలి.

సంక్షుభిత వ్యవసాయానికి కాయకల్ప చికిత్స చేయడం కత్తిమీద సామే అయినా ఇప్పుడా అడుగులు మరింత వేగంగా పడాలి. సేద్యంలో ఎదురవుతున్న నష్టాలను తగ్గించే దిశగా క్షేత్రస్థాయి అవగాహన కల్పించేందుకు పెద్దపీట వేయాలి. ఇందుకు విస్తరణ యంత్రాంగాన్ని గ్రామాల్లో పెద్దయెత్తున నియమించాలి. రైతులకు మంచి ఆదాయం రావాలంటే, ఒకటి మంచి ధరలివ్వాలి. రెండోది ఉత్పత్తి పెరగాలి. ఆహారశుద్ధి రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయాలు అందించే అవకాశముంది. పంటల ఉత్పాదకత పెంచే దిశగా పరిశోధనలు వేగవంతం కావాలి. రెట్టింపు దిగుబడుల్ని ఇచ్చి, చీడపీడల్ని తట్టుకోగల వంగడాలకు రూపకల్పన చేయాలి. ఈ దిశగా మోదీ ప్రభుత్వం బడ్జెట్లో ఆశావహ పరిస్థితులు కల్పించినా రైతుకు జీవన భద్రత అందించే దిశగా ఈ చర్యలు చాలవు. వ్యవసాయ ప్రధాన ఆర్థిక వ్యవస్థలో ఈ రంగం వాటా క్రమేపీ తగ్గిపోతున్నా సేద్యంపై ఆధారపడిన జనాభా నేటికీ 58 శాతం ఉందన్న సత్యాన్ని గమనించాలి. పొలంలో గెలుస్తున్నా విపణిలో ఓడుతున్న రైతుల్ని నిలబెట్టి సేద్యంపై భరోసా పెంచేలా కీలక సంస్కరణలు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా చొరవ చూపాలి. ఘనమైన కేటాయింపుల కంటే వాటి ఆచరణ గొప్పగా ఉంటేనే- పల్లెరైతు నిలదొక్కుకోగలుగుతాడు!

– అమిర్నేని హరికృష్ణ

ఇ-నామ్ లోపాలే శాపాలు



ఇ-నామ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2016 ఏప్రిల్‌లో ప్రారంభించింది. ధర రానప్పుడు రైతు తన ఉత్పత్తిని ద్వారా ఇతర విపణులకు తరలించి అధికలాభం పొందడానికి ఈ వ్యవస్థ ఉపకరిస్తుంది. అయితే నేటికీ క్షేత్రస్థాయిలో ఇ-నామ్ అనేక లోపాలతో సతమతమవుతోంది. ఈ లోటుపాట్లను కేంద్ర ప్రభుత్వం సత్వరం సరిదిద్దగలిగితే గిట్టుబాటు ధరల కల్పన దిశగా ముందడుగు పడుతుంది. ఉత్పత్తి ఖర్చు కంటే ఒకటిన్నర రెట్లు అదనంగా మద్దతు ధర స్థిరపరుస్తూ రైతులకు మెరుగైన ధరలు అందిస్తామని కేంద్రం తాజాగా భరోసా ఇచ్చింది. వచ్చే ఖరీఫ్ నుంచి మద్దతు ధరలు ఏ మేరకు పెంచుతారన్న విషయాన్ని మాత్రం వివరించలేదు.

దారితప్పిన పౌరస్వేచ్ఛ



వీరేంద్ర కపూర్

'సమస్యలు ఎప్పుడూ ఉంటాయి. ఇండియా వంటి సువిశాల దేశంలో, వాటి సంఖ్య మరీ ఎక్కువ. ప్రజాస్వామ్య విలువలకు పట్టం కట్టే దేశం మనది. పలు విధాలుగా చుట్టుముట్టే సమస్యల్ని మనమే ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వెళ్లాలి. ఆ క్రమంలో విలువల్ని విస్మరించకూడదు. సంయమనం కోల్పోయి ఇష్టానుసారం వ్యవహరించడం అసలే తగదు. ఓర్పు, నేర్పు లోపిస్తే- ఉన్న ఇబ్బందులు తీరకపోగా, మరికొన్ని కష్టాలు కట్టుకొని ముందు నిలుచుంటాయి. సమస్య ఒకటే అయినా, దానికి పరిష్కార మార్గాలు అనేకం. వాటిలో ఏది అనువైనదో ఎంచుకొని అదే దారిలో నడవాలి. అంతే తప్ప, దారీ తెన్నూ కానకుండా తెగబడి ముందుకు దూకితే అనర్థాలు తప్పవు'...రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అంతరంగ తరంగాలే ఇవన్నీ! గణతంత్ర దినోత్సవం ముగిసి రోజులు గడిచిపోయినా, జాతికి అప్పుడు ఆయన ఇచ్చిన సందేశం ఇప్పటికీ నా చెవుల్లో గింగురుమంటోంది. అది కేవలం ప్రసంగపాఠ పఠనం కాదు, భారత ప్రథమ పౌరుడి గుండె లోతుల నుంచి పెల్లుబికిన ఉద్వేగభరిత భావ ధార!

బాధ్యత నుంచి తప్పించుకోలేరు

చరిత్రను ఎవరూ విస్మరించలేరు. దాన్ని మార్చనూలేరు. చారిత్రక అంశాల మంచిచెడుల్ని మాత్రం ఎవరైనా ఎప్పుడైనా చర్చించవచ్చు. తమ అభిప్రాయాలకు తాము బలంగా కట్టుబడి ఉండనూవచ్చు. సర్వసహజంగానే భేదాభిప్రాయాలు ఎదురవుతుంటాయి. చర్చోపచర్చలు ఒక స్థాయి దాటిన తరవాత వాదవివాదాలకు దారితీస్తాయి. అవి ముదిరినప్పుడే ఆవేశకావేషాలు చోటుచేసుకుంటాయి. వాతావరణం వేడెక్కి ఆగ్రహమో అవహేళనో చోటుచేసుకుంటుంది. 'పౌర స్పృహ' అంటూ ఒకటి ఉంటే- ఏదీ దారి తప్పదు. అంటే పౌరుల్లో మాత్రమే అటువంటి జాగృతి కలగాలన్నది నా ఉద్దేశం కాదు. నాయకులూ దేశ పౌరులే. జాతి నిర్మాణంలో పాలకులు, పాలితులు అందరూ భాగస్వాములే. బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉంటుంది'... ఇవే మాటలు నాలుగు దశాబ్దాల క్రితం నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి నోటి నుంచి వెలువడ్డాయి. ఆయన 1978 జనవరి 26న జాతికిచ్చిన రిపబ్లిక్ దినోత్సవ సందేశంలో 'స్వేచ్ఛ'ను సవివరంగా నిర్వచించారు. 'ప్రతి అంశంపైనా తనదైన భావాన్ని వ్యక్తపరిచే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అందరికీ ఉంటాయి. ఆ వ్యక్తీకరణ తగిన విధంగా ఉండాలి. తన అభిప్రాయాన్ని తాను వెలిబుచ్చే క్రమంలో ఏ వ్యక్తీ ఇతరుల భావాల్ని కించపరచరాదు. అయినదానికీ కానిదానికీ బజారుకీడ్చే దురుద్దేశం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. మంచి మర్యాద లేకుండా, సాటి మనిషికి గౌరవ హాని కలుగుతుందన్న ఇంగితమైనా కనబరచకుండా, తోచిన రీతిలో ప్రవర్తించడం స్వేచ్ఛావాదం కాదు. అది బాధ్యతా



హింసా విధ్వంసాలే పరిష్కారాలా?

రాహిత్యం అవుతుంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని హింసాత్మక చర్యలకు పాల్పడటం, శాంతిభద్రతలకు భంగం కలిగించడం స్వేచ్ఛ అనిపించుకోదు. 'నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు' అన్నట్లు ఎవరి చిత్తానుసారం వారు చెలరేగిపోతే అదేం స్పృహ, అదేం స్వేచ్ఛ? హక్కులకు అసలు అర్థమేమిటో తెలిసినవారు ఎన్నడూ అలా చేయరు' అంటూ నాటి రాష్ట్రపతి పలికిన హితవు నేటికీ, ఏనాటికీ శిరోధార్యమే!

నలభై ఏళ్లనాటి మాటలవి. అవి ఇప్పటికీ దేశానికి నూటికి నూరుపాళ్లూ వర్తిస్తాయి. మరి దేశ కాలమాన పరిస్థితులు మారినట్లా, మారనట్లా? నాయకులైనా ప్రజలైనా ఎవరికి వారే ఆలోచించుకోవాలి. సమస్యలకు సులభ పరిష్కారాలు లభించడం కొంతమందికి ఇష్టం ఉండదు. వర్గ ప్రయోజనాలే తప్ప, వారికి విశాల జనహితం నచ్చదు. అలాంటివారి కవ్వింపులకు, ఎత్తుగడలకు ఇతరులు లోనైతే ఏమవుతుందో- ఇటీవల చెలరేగిన హింసాత్మక సంఘటనల్ని గమనిస్తే బోధపడుతుంది. వివాదాల మధ్య చిక్కిన ఓ చిత్రానికి సంబంధించి, దేశంలో కొన్నిచోట్ల అలజడులు రేగాయి. చరిత్రను వక్రీకరించారంటూ మొదలైన ఆందోళన గంటల వ్యవధిలోనే హింస, విధ్వంసాలకు దారితీసింది. చిత్రాన్ని ప్రదర్శిస్తున్న థియేటర్లపై పెట్రోలు సీసాలు విసిరారు. గుజరాత్, హరియాణా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్‌లలోని ఆయా సినిమాహాళ్లపై దాడులకు దిగారు. పలు వాహనాలకు నిప్పుపెట్టారు. నిలువరించాలని యత్నించిన పోలీసులపై రాళ్లవర్షం కురిపించారు. పనిగట్టుకొని, బడిపిల్లల బస్సులపైనా ప్రతాపం చూపించారు! కర్ణాటకలోనూ ఎన్నికల రాజకీయాలు వికృత రూపం ధరించాయి. ఆందోళనకారులు అనేకచోట్ల హింసాకాండకు పాల్పడ్డారు. భీతావహ వాతావరణం సృష్టించారు. వీటన్నింటికీ మూల కారకులెవరు? చీటికీమాటికీ బందులకు పిలుపిచ్చి ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం, సామాన్య జనాన్ని కష్టనష్టాలకు గురిచేయడం ఎటువంటి పరిస్థితిలోనూ క్షంతవ్యం కాదు.

ఆత్మవిమర్శ తప్పదు

ఇక జాతినిర్మాణం విషయానికొస్తే- దాన్ని ఏ కొందరి బాధ్యతగానో పరిగణించకూడదు. జాతి నిర్మాణ కృషిలో దేశంలోని ప్రతి పౌరుడికీ భాగస్వామ్యం ఉంటుంది, ఉండాలి. వివిధ రకాల స్థితిగతుల్లో ఎదురయ్యే సమస్యలకు ఏ ఒక్కరినో లేదా ఏ కొంతమందినో బాధ్యుల్ని చేయలేం. ఎవరో ఒకరి వైపు వేలెత్తి చూపడం మాని, ఎవరికి వారు ఆత్మవిమర్శ చేసుకుంటేనే క్షేత్రస్థాయి వాస్తవాలు అర్థమవుతాయి. గడచిన దశాబ్దాలతో పోల్చిచూస్తే, పరిస్థితులు కొంత మెరుగుపడ్డాయి.. అభివృద్ధి రేటు గణనీయంగా పెరుగుతోంది. రాజ్యాంగ హక్కులకు సంబంధించిన అవగాహన విభిన్న వర్గాల్లో అధికమైంది. ఆర్థిక, సామాజిక సమానత కోసం పలు స్థాయుల్లో ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి. వీటన్నింటినీ ఎవరూ కాదనలేరు. తిట్టుకుంటూ కూర్చుంటే, చీకట్లు తొలగిపోవు. వెలుగు కావాలన్న తపన ఒక్కటే వ్యక్తినైనా వ్యవస్థనైనా నడిపిస్తుంది. కాలక్రమంలో పరుగులు తీయిస్తుంది. కలిసికట్టుగా పనిచేస్తే ఎంతైనా సాధించగలం. అన్నీ ఉన్నా, ఏమీ లేనట్లు బాధపడేవారికి; జీవితంలో అన్నివేళలా ఒంటరితనంతోనే సతమతమయ్యేవారికి ఉపశమనంగా యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఓ ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉంది. ఆ తరహా పరిస్థితులు, అవసరాలు భారత్‌లో ఎదురు కానందుకు అందరం ఎంతో సంతోషించాలి!

సంబంధ బాంధవ్యాలు

మానవుడు సంఘజీవి. నలుగురితోనూ కలిసి ఉండటం అతడి సహజ లక్షణం. అందువల్ల నిరంతరం నూతనత్వాన్ని ఆస్వాదిస్తాడు. ఇరుగుపొరుగులు, మిత్రులతో అతడికి ఉండేవి మానవ సంబంధాలు. కుటుంబ సభ్యులు, బంధువులతో సాగించేవి బాంధవ్యాలు.

సంబంధ బాంధవ్యాల గురించి వాల్మీకి రామాయణం చక్కగా వివరించింది. వాటిలోని ధర్మాలు, నీతినియమాల్ని విపులీకరించింది. కుటుంబంతో కొనసాగాల్సిన బాంధవ్యాల తీరుతెన్నులను పలు పాత్రలు వ్యక్తపరుస్తాయి. దశరథ మహారాజు, ఆయన నలుగురు కుమారుల మధ్య ఆదర్శవంతమైన సంబంధముంది. రాముడికి రాజ్యాభిషేకం చేస్తానని ప్రకటించిన ఆయన, గతంలో కైకేయికి ఇచ్చిన మాట ప్రకారం వ్యవహరించాల్సి వస్తుంది. అడవులకు వెళ్లాలన్న తండ్రి మాటను రాముడు గౌరవిస్తాడు. ఆదర్శవంతమైన బాంధవ్యం అంటే అదే!

భార్యాభర్తల బాంధవ్యం అనురాగానికి, ప్రేమకు, నమ్మకానికి ప్రతీక. శ్రీరాముడితో పాటు తానూ అరణ్యవాసం చేస్తానంటుంది కౌసల్య. స్త్రీకి తండ్రి, సోదరులు, బంధువులు కొంతవరకు న్యాయం చేయగలరు. పూర్తి బాధ్యతతో ఆమెకు న్యాయం చేయగలిగేవాడు- భర్త. అతడితో జీవితాంతం కలిసి ఉండాల్సింది భార్యే అంటూ దాంపత్యబంధ ధర్మాన్ని, ప్రత్యేకతను రాముడు తేటతెల్లం చేస్తాడు. అలా సీతారాముల అనుబంధాన్ని లోకానికి తెలియజేయడం ద్వారా, బాంధవ్యానికి పట్టంకట్టాడు వాల్మీకి మహర్షి.

తోటివారు, మిత్రులతో ఎటువంటి సంబంధం కొనసాగించాలో సుగ్రీవుడు,



గుహుడు, విభీషణుల పాత్రలు వెల్లడిస్తాయి. స్నేహితుల మధ్య భేదభావాలు, ఎక్కువ తక్కువలు పనికిరావు. తాను మానవుడైనా, సుగ్రీవుడు వానరుడైనా 'ఇద్దరం మిత్రులమే' అంటాడు రామచంద్రుడు. మిత్రధర్మాన్ని కొనసాగిస్తాడు. వాలిని వధించి, సుగ్రీవుణ్ని రాజును చేస్తాడు. పడవ నడిపే గుహుణ్ని

అంతర్యామి

తనతో సమానంగా గౌరవిస్తాడు. దానవ వీరుడైన విభీషణుణ్ని తోటి రాజుగా ఆదరిస్తాడు.

శత్రువుతోనూ ధర్మం పాటిస్తాడు రాముడు. అలసి సొలసిన రావణాసురుణ్ని- విశ్రాంతి తీసుకొని మరునాడు యుద్ధానికి రమ్మంటాడు. ఆ తరవాత, మరణించిన రావణుడి స్థాయికి తగినట్లు అంత్యక్రియలు చేయిస్తాడు. అతడి భార్య మండోదరిని ఊరడించి, మానవత్వం కనబరుస్తాడు.

నేటి సమాజంలో కుటుంబసభ్యుల మధ్య బాంధవ్యాలూ ఆర్థికపరమైనవిగా మారుతున్నాయి. ప్రేమ, అనురాగం, పరస్పర గౌరవం క్షీణిస్తున్నాయి. కొడుకులు, తల్లి, తండ్రి బద్ధశత్రువులవుతున్నారు. తోటివారితో మాట్లాడే తీరికైనా లేకుండా, మనిషి ఒంటరి జీవితం గడుపుతున్నాడు. ఆకాశమార్గంలో విహరిస్తున్నా, తనకు తానే దూరమవుతున్నాడు.

జీవితంలో సరస సంభాషణలు, చతురోక్తులు, మురిపించే ముచ్చట్లు కావాలి. అరమరికలు లేని రీతిలో ఆప్యాయత వెల్లివిరియాలి. కల్మషానికి, కపటానికి తావు లేని విధంగా నవ్వులు విరబూయాలి. ఇవన్నీ నిత్యం ఉంటేనే, మనిషి జీవితానికి ధన్యత చేకూరుతుంది!

– రావులపాటి వెంకట రామారావు

అనంత జేఎన్‌టీయూ పీహెచ్‌డీ ప్రవేశాల నిలిపివేత

అనంతపురం, న్యూస్‌టుడే: అనంతపురం జేఎన్‌టీయూ పరిధిలో పీహెచ్‌డీ ప్రవేశాలను నిలిపివేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో ఉమ్మడి పరీక్ష ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాలను చేపట్టాలని నిర్ణయించగా.. అనంత జేఎన్‌టీయూలో ప్రత్యేకంగా ప్రకటన ఎందుకు జారీచేశారంటూ ఇటీవల మంత్రి గంటా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈక్రమంలో ఉన్నత విద్యామండలి సూచన మేరకు అనంత జేఎన్‌టీయూ పరిధిలో పీహెచ్‌డీ, ఎంఫిల్, ఎంఎస్ ప్రవేశాలను నిలుపుదల చేస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు విజయ్‌కుమార్ ప్రకటించారు. దరఖాస్తు రుసుములను ఖాతాల్లో తిరిగి జమ చేస్తామని ప్రకటించారు.

10న ధర్నా: ఎస్టీయూ

ఈనాడు, అమరావతి: కంట్రిబ్యూటరీ పింఛన్ పథకం(సీపీఎస్) రద్దు కోసం ఈనెల 10న అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట పింఛన్ సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్‌బాబు తెలిపారు.

'సొంత ప్రాంతాలకు బదిలీ చేయాలి'

ఈనాడు అమరావతి: తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన 420మంది, ఏపీలో ఉన్న 190మంది తెలంగాణ ఉపాధ్యాయులను సొంత ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుకు ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు.

బంగారు నాణేల అవకతవకలపై విచారణాధికారిగా సహదేవరెడ్డి

ఈనాడు, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానంలో 5 గ్రాముల బరువున్న 300 బంగారు నాణేలు మాయమైన వ్యవహారానికి సంబంధించి 17 మందిపై విచారణ నిర్వహించేందుకు విచారణాధికారిగా కె. సహదేవరెడ్డిని నియమిస్తూ దేవాదాయ, ధర్మదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ వ్యవహారం 2009లో చోటు చేసుకుంది. 17 మందిపై వచ్చిన అభియోగాలపై విచారణ జరిపి మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు.

ఇదేం 'ఖర్మా'గారం!

- పెదవేగి పాత యంత్రాల నుంచి తక్కువగా నూనె శాతం
- 2శాతం తేడాతో ఆయిల్‌పామ్ రైతులకు రూ.150 కోట్ల నష్టం
- పొరుగు రాష్ట్రానికి తరలుతున్న గెలలు
- చోద్యం చూస్తున్న ఏపీ ఆయిల్‌ఫెడ్



ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్‌పామ్ ధర టన్ను రూ. 8,200.
సరిహద్దు దాటి తెలంగాణలోకి వెళితే టన్ను రూ. 9,354.

పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి అరగంట ప్రయాణించి తెలంగాణకు తీసుకెళితే టన్నుకు రూ. 1,154 లాభం. రాష్ట్రంలో పండే పంటనంతా (13లక్షల టన్నులు) ఇక్కడే అమ్ముకుంటే రైతులకు ఏడాదికి రూ. 150కోట్ల నష్టం. .అందుకే రైతులు ఆయిల్‌పామ్ గెలలను తెలంగాణకు తరలిస్తున్నారు. ఫలితంగా రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గిపోతున్నా.. ఉద్యానశాఖ, ఏపీ ఆయిల్‌ఫెడ్ చోద్యం చూస్తున్నాయి.

ఆయిల్‌పామ్ సాగుచేసే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం.. దేశవ్యాప్తంగా 3లక్షల హెక్టార్లలో ఇది సాగవుతుండగా 50 శాతం పంట ఏపీ నుంచే వస్తోంది. ఇందులో పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోనే సాగు అధికం. రాష్ట్రంలో 10.75లక్షల ఎకరాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయి. సరైన ధరలు లేకపోవడం, పాత యంత్రాలతో లెక్కింపు వల్ల రైతులు నష్టపోతున్నారు.

ధరల్లో దగా..

ఆయిల్‌పామ్ పండ్ల నుంచి వచ్చే నూనె శాతం, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ముడినూనెను పరిగణనలోకి తీసుకుని ధరలు నిర్ణయిస్తారు. ప.గో. జిల్లా పెదవేగిలో ప్రభుత్వ పరిధిలోని కర్మాగారంలో తీసే నూనె శాతాన్నే ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. అక్కడి పాత యంత్రాల కారణంగా వాస్తవ దూరంగా ఇంధన శాతం వస్తోందని, నష్టపోతున్నామని రైతులు చెప్తున్నారు.

- గతంలో 17.06 వచ్చిన నూనె శాతం ఇప్పుడు 16.43కి పడిపోయింది. ఇది 1శాతం తగ్గితే ధరలో రూ. 380 వరకు కోత పడుతుంది. మన రాష్ట్రంలో గతంలో రూ. 8,200 ధర నిర్ణయించారు. నూనె శాతం భారీగా తగ్గుతుండటంపై రైతుల ఆందోళనతో కొత్తగా ధరల నిర్ణయాన్ని పక్కన పెట్టారు.
- తెలంగాణలో కొత్తగా కర్మాగారాన్ని నిర్మించారు. అక్కడ నూనె శాతం 18.43 వస్తోంది. టన్నుకు రూ. 9,354 వరకు ఇస్తున్నారు.
- నూనె ఉత్పత్తిలో రెండు రాష్ట్రాల మధ్య 2శాతం తేడా చూపిస్తున్నారు. దీంతో టన్నుకు రూ. 760 వరకు నష్టం వస్తోంది. మొలాసిస్ వంటి ఉపోత్పత్తులనూ లెక్కలోకి తీసుకుంటే రూ. 1,154 వరకు తేడా కనిపిస్తోంది.
- నష్టాలకు ప్రధాన కారణం పెదవేగిలోని కాలం చెల్లిన కర్మాగారమే అనేది రైతుల ఆవేదన. కొత్త కర్మాగారం నిర్మిస్తే సమస్య తీరుతుంది.
- ఏపీ ఆయిల్‌ఫెడ్ వద్దనున్న రూ. 80కోట్ల నిధులను ఇందుకు కేటాయించవచ్చు.
- ప్రస్తుతం 8 మండలాల్లోని పంటనే ఏపీ ఆయిల్‌ఫెడ్‌కు కేటాయించారు. అదనంగా 10 మండలాలు కేటాయించాల్సిన అవసరముంది.

త్వరలోనే ఉపశమన చర్యలు

ఆయిల్‌పామ్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో ఆయిల్‌పామ్ రైతు సంక్షేమ సంఘం నాయకులు బొబ్బా వీరరాఘవరావు తదితరులకు హామీనిచ్చారు. ఉద్యానశాఖ కమిషనర్‌తో మాట్లాడుతున్నట్లు చెప్పారు. నూనెశాతం తక్కువగా వస్తుండటంపై ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచిస్తున్నట్లు ఆయన 'ఈనాడు'కు తెలిపారు. కొంత ఉత్పత్తిని తెలంగాణకు పంపి అక్కడ ఎంత వస్తుందో పరిశీలిస్తామన్నారు. రైతుల సమస్యలపై కమిటీ నివేదిక అందగానే చర్యలు తీసుకుంటామన్నారు. – మంత్రి సోమిరెడ్డి

శివదీక్ష భక్తులకు మల్లన్న స్పర్శదర్శనం

- 6 నుంచి 10వ తేదీ వరకు అవకాశం

శ్రీశైలం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలోని శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఆరవ తేదీ నుంచి 10వ తేది రాత్రి 7.30 గంటల వరకు జ్యోతిర్ముడి కలిగిన శివదీక్షా భక్తులకు శ్రీమల్లికార్జునస్వామి స్పర్శదర్శనం కల్పించనున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో అన్ని ఆర్జిత సేవలు నిలుపుదల చేశారు. సాధారణ భక్తులకు శ్రీస్వామివార్ల సర్వదర్శనం కల్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో శీఘ్రదర్శనం టిక్కెట్టు ధరను రూ. 150 రూ. 200 పెంచారు. ఈ టిక్కెట్టు కొనుగోలు చేసిన భక్తుడికి 100 గ్రాముల రెండు లడ్లను ఉచితంగా అందజేస్తారు. 11వ తేదీ నుంచి 16 వరకు స్వామిఅమ్మవార్ల దర్శనానికి వచ్చే ముఖ్య అతిథుల కోసం మూడు విడతల్లో ప్రత్యేక విరామ దర్శనాలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు, 12.30 గంటల నుంచి 1 గంట వరకు, రాత్రి 7 గంటల నుంచి 7.30 గంటల వరకు విరామ దర్శనానికి సమయం కేటాయించారు.

ఎయిడెడ్ కారుణ్య నియామకాలపై మరో ఉత్తర్వు

ఈనాడు, అమరావతి: ఎయిడెడ్ కారుణ్య నియామకాలపై మరో ఉత్తర్వును పాఠశాల విద్యాశాఖ జారీ చేసింది. ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తూ మృతి చెందిన ఉద్యోగుల స్థానంలో భర్తీ చేసే కారుణ్య నియామకాలను కేవలం అదే పాఠశాలలో భర్తీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చాలా పాఠశాలల్లో మినిస్ట్రియల్ సిబ్బందికి చెందిన పోస్టులు అదే పాఠశాలల్లో ఉండవని, పంచాయతీరాజ్ యాజమాన్యం, ఇతర శాఖల్లోనూ పోస్టులను భర్తీచేసే సౌకర్యం కల్పించాలని ఏపీటీఎఫ్, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. హృదయరాజు, బాబురెడ్డి డిమాండ్ చేశారు.

తగిన హాజరుంటేనే ఇక పరీక్షలకు అనుమతి!

- విద్యార్థుల వివరాలు ప్రతి నెలా వర్సిటీకి చేరేలా చర్యలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి సంస్కరణల అమలు
- ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ వెల్లడి

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైద్యవిద్యలో సంస్కరణలను తీసుకురాబోతోంది. తరగతులకు సక్రమంగా రాని విద్యార్థులను ఇకపై పరీక్షలకు అనుమతించకుండా నిబంధనలను కఠినతరం చేయనుంది. యూజీ విద్యార్థుల హాజరు వివరాలను ప్రతినెలా కళాశాలల నుంచి విశ్వవిద్యాలయానికి అందేలా చర్యలు తీసుకుంటోంది.

వైద్య కళాశాలల్లో విద్యార్థులకు 75% హాజరు లేకుంటే పరీక్షలకు అనుమతించరాదు. కానీ కొందరు విద్యార్థులు తరగతులకు దూరంగా ఉంటున్నా యాజమాన్యాల చలవతో మిగతా వారితో పాటు పరీక్షలు రాసేస్తున్నారు. ఈ తంతుకు అడ్డుకట్ట వేసేందుకు ఇకపై కళాశాలల నుంచి ప్రతి నెలా విద్యార్థుల హాజరు వివరాలను స్వీకరించాలని నిర్ణయించినట్లు వర్సిటీ ఉపకులపతి డాక్టర్ సీవీరావు 'ఈనాడు'కు వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని ఆయుష్, పారా మెడికల్, ఇతర కోర్సుల్లో చదివే వారికి వర్తింపజేస్తామని వెల్లడించారు. పీజీ వైద్య విద్యార్థులకు ఆధార్‌తో కూడిన బయోమెట్రిక్ విధానాన్ని అనుసరించబోతున్నామన్నారు. ఇదే విధానాన్ని ఆయుర్వేద, హోమియో, ఇతర పీజీ వైద్య విద్యార్థులకు కూడా వర్తింపజేస్తామన్నారు.

ప్రధాన అంశాలు..

- ★ విద్యా సంవత్సరం ఆరంభంలోనే వార్షిక విద్యాబోధన, పరీక్షల పట్టికను విడుదల చేయనున్నారు. తదనుగుణంగా కళాశాలల్లో బోధన జరగాలి.
- ★ విద్యా సంవత్సరం ఆరంభంలో యూజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు భావవ్యక్తీకరణ, వైద్యవిద్య ప్రాధాన్యం, ప్రవర్తన శైలి తదితరాలపై ప్రత్యేకంగా తరగతులు నిర్వహించనున్నారు.
- ★ విద్యార్థుల సందేహాలు తీర్చుతూ, వివిధ అంశాలపై సలహాలు ఇచ్చేందుకు మెంటార్ వ్యవస్థను కళాశాలల్లో నెలకొల్పేలా చర్యలు తీసుకోబోతున్నారు.
- ★ పరీక్షలకు పర్యవేక్షకులుగా వచ్చే వారికి విశ్వవిద్యాలయమే రవాణా సౌకర్యాల్ని కల్పించనుంది.
- ★ విద్యార్థులకు ఒక అవయం గురించి బోధించే సమయంలోనూ, దానికి వచ్చే జబ్బులు ఎలా ఉంటాయో ఏకకాలంలో తెలిపేలా సమీకృత బోధన విధానాన్ని తీసుకురానున్నారు.
- ★ ఇంటర్నల్స్‌లో 20మార్కులకు బహుళ ఐచ్ఛిక రూపంలో ప్రశ్నలను ఇవ్వనున్నారు.

సహకార చక్కెర కర్మాగారాలకు 7.85% వడ్డీకే రుణం

ఈనాడు, అమరావతి: జాతీయ చెరకు అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) నుంచి రూ. 235 కోట్ల రుణాన్ని ఏపీలోని 4 సహకార చక్కెర కర్మాగారాలు 7.85 శాతం వడ్డీరేటుకే పొందేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు జారీ చేసింది.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపిన కేంద్రం వైఖరిని ఎండగట్టడానికి వామపక్షాల ముఖ్యులు శనివారం విజయవాడలో సమావేశం కాబోతున్నట్లు సీపీఎం రాష్ట్రకార్యదర్శి మధు తెలిపారు.

నిట్ ముంగిట వసతి సమస్య!

- టెండర్ల దశలోనే శాశ్వత భవనాలు
- వచ్చే విద్యాసంవత్సరం వసతిపై సందిగ్ధం

ఈనాడు డిజిటల్, తాడేపల్లిగూడెం–తాడేపల్లిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 2015లో మంజూరైన జాతీయ సాంకేతిక విద్యాసంస్థ(నిట్)కు నేటికీ శాశ్వత భవనాలు నిర్మించలేదు. ఇప్పటికి మూడు విద్యాసంవత్సరాల్లో చేరిన విద్యార్థులు చదువు కొనసాగిస్తుండగా.. తర్వాత చేరే వారికి ఆశ్రయం కల్పించడమెలా అన్నది తాజాగా వేధిస్తున్న ప్రశ్న. నిట్‌కు పక్కా భవనాల నిర్మాణానికి జనవరి 20న టెండర్లు పిలిచారు. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో ఈ పనులు చేయాలి. వీటి అంచనా విలువ సుమారు రూ. 180కోట్లు. పనులు పూర్తిచేసేందుకు 390 రోజులు సమయం ఇచ్చారు. టెండర్ల ఖరారుకు మరో రెండు నెలల సమయం పడుతుంది. అన్నీ సక్రమంగా జరిగితే 2019 ఏప్రిల్‌కల్లా పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. అంటే కొత్త విద్యార్థులకు ఇబ్బంది తప్పదు.

★ ప్రస్తుతం తాడేపల్లిగూడెంలోని వాసవీ ఇంజినీరింగు కళాశాలలోని 32 గదుల్లో నిట్ తరగతులు నిర్వహిస్తున్నారు. బాలికలకు కళాశాల ఆవరణలో, బాలురకు తాడేపల్లిగూడెం పట్టణం, నల్లజర్ల సమీపంలో వసతి కల్పించారు. ఒప్పందం ప్రకారం మూడేళ్లు పూర్తయినందున ఈ ఏడాది జూన్‌కల్లా భవనాలు ఖాళీ చేసేయాలని వాసవీ యాజమాన్యం నిట్ అధికారులకు చెప్పేసింది. మూడేళ్లలో వరసగా 388, 375, 438 మంది విద్యార్థులు నిట్‌లో చేరారు. మొత్తం సీట్లు 480 కాగా రానున్న ఏడాది అవన్నీ నిండే అవకాశముంది.

తాత్కాలిక వసతుల్లోనూ ఇబ్బందులు

తాత్కాలిక వసతుల కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిట్ విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రయోగశాలలు లేవు. వెసులుబాటును బట్టి వాసవీ ఇంజనీరింగు కళాశాలల్లో ఉన్న వాటిలో ప్రయోగాలు చేస్తున్నారు. మెటలాజీ, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగు కోర్సులు ఇక్కడ లేనందున ఈ ప్రయోగాలకు విద్యార్థులను వరంగల్ నిట్‌కు తరలిస్తున్నారు. ఇప్పుడున్న వసతిగృహాలు నిట్‌కు దాదాపు 20కి.మీ. దూరంలో ఉన్నందున విద్యార్థులు బస్సుల్లో క్యాంపస్‌కు వస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి అదనంగా ఖర్చవుతోంది. వసతి, భోజనాలకు వరంగల్‌లో రూ. 36 వేలు వసూలు చేస్తుండగా ఇక్కడేమో రూ. 48వేలు కట్టించుకుంటున్నారు. తాడేపల్లిగూడెం నిట్‌కు రెండున్నరేళ్లు గడిచినా రెగ్యులర్ డైరెక్టరు లేరు.

కొన్ని భవనాల నిర్మాణం జరుగుతాయి

ఇప్పటికే శాశ్వతభవనాల నిర్మాణానికి టెండర్లుపిలిచారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఇంకా సమయం ఉంది. ఈ వ్యవధిలో కొన్ని భవనాల నిర్మాణం పూర్తవుతుంది.

– శ్రీనివాసరావు, రెసిడెంట్ సమన్వయకర్త, ఏపీనిట్



ఇదేంటి.. రోడ్డు మీదుగా రైలుబండి పరుగు తీస్తుందనుకుంటే పొరపడినట్లే..! రహదారిపైకి రైలు రావడం వాస్తవమైనా.. 108 చక్రాలతో కూడిన లారీని ఎక్కింది. ఈ రైలు ఇంజినును కర్ణాటక రాజధాని బెంగళూర్ నుంచి ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్నారు. శుక్రవారం విజయనగరం జిల్లా భోగాపురం మండలం లింగాలవలసగ్రామం వద్ద ఈ దృశ్యం కెమేరాకు చిక్కింది. – న్యూస్‌టుడే, భోగాపురం

రైలుబండికి చూడు.. టైరు బండి తోడు

త్వరలోనే ఆర్టీసీ లాభాల బాట: ఎండీ మాలకొండయ్య

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో త్వరలోనే రాష్ట్ర రవాణా సంస్థ(రారసం) లాభాల బాటలో పయనిస్తుందని డీజీపీ, రారసం ఎండీ మాలకొండయ్య వెల్లడించారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళా సదస్సుకు డీజీపీ మాలకొండయ్య, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ... సంస్థలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని.. దాదాపు 5వేల మంది పనిచేస్తున్నట్లు తెలిపారు. గతేడాది ప్రభుత్వం ఇచ్చిన నిధులతో రుణాలు తీర్చినందువల్ల ఈ ఏడాది కొంతమేర నష్టాలు తగ్గాయన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే లాభాల బాట పడుతుందని తెలిపారు. సంస్థలో ఎంతో మంది కష్టపడి పనిచేస్తున్నారని, అలాంటి వారిని వేధించడం సరికాదని నన్నపనేని రాజకుమారి అన్నారు. వేర్వేరు డిపోలలో పనిచేస్తున్న భార్యభర్తలకు ఒకే ప్రాంతంలో పనిచేసే అవకాశం కల్పించాలని ఎండీని కోరారు. మహిళా ఉద్యోగినులు రాత్రిళ్లు ఎక్కువ సమయం విధుల్లో లేకుండా చూడాలన్నారు. ఎన్ఎంయూ స్థాపించిన తర్వాత ఇంత పెద్ద మహిళా సదస్సు నిర్వహించడం ఇదే తొలిసారని నేషనల్ మజ్దూర్ ఛైర్మన్ ఆర్‌వీవీఎస్‌డీ ప్రసాదరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు మంగమ్మ, చల్లా చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాల్‌మనీ కేసులో ఎట్టకేలకు అభియోగ పత్రాలు!

ఈనాడు, విజయవాడ: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాల్‌మనీ, సెక్స్ రాకెట్ (అధిక వడ్డీ, లైంగిక వేధింపు) కేసులో పోలీసులు దర్యాప్తు ముగించారు. దీనిపై కేసు నమోదైన రెండేళ్ల తర్వాత ఎట్టకేలకు పోలీసులు శుక్రవారం విజయవాడలోని ఒకటో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ న్యాయస్థానంలో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిందితులు ఏడుగురిని న్యాయస్థానానికి హాజరుపర్చారు. తదుపరి విచారణ కేసును ఈనెల 20వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. విజయవాడలో అధిక వడ్డీలకు అప్పులిచ్చి వేధించాలని ఒత్తిడి చేసి.. మహిళలపై కొందరు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు లోగడ ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు అప్పట్లో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో విద్యుత్తు డీఈతోపాటు ప్రజాప్రతినిధి అనుచరుడిగా చెప్పుకున్న వ్యక్తి ఒకరు ఉన్నారు. రాజకీయ నాయకుడి బంధువు కూడా ఉన్నారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలి

రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి ప్రైవేటు సభ్యుల బిల్లు

ఈనాడు, దిల్లీ: బీసీలకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి శుక్రవారం రాజ్యసభలో ప్రైవేటు సభ్యుల బిల్లు ప్రవేశపెట్టారు. వారికి ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో కూడా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని మరో బిల్లు ప్రవేశపెట్టారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల జోలికి వెళ్లకుండా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన బిల్లులో కోరారు. రాష్ట్రంలోని 28వేల రేషన్‌షాపుల్లో 6500 షాపులను మాల్స్‌గా మార్చి ఫ్యూచర్ గ్రూప్, రిలయన్స్ రిటైల్‌కు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిందని విజయసాయిరెడ్డి తెలిపారు. పౌరసరఫరాల పంపిణీ వ్యవస్థలో కేంద్రానికి పాత్ర ఉండదని కేంద్రం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో 2016లో 804 మంది రైతులు, కార్మికుల ఆత్మహత్యలు చేసుకున్నారని వెల్లడించింది. ఈ ధోరణి తగ్గాలంటే రైతుల ఆదాయం రెట్టింపు చేయడం ఒక్కటే మార్గమని పేర్కొంది. ఆయన అడిగిన ప్రశ్నకు లిఖిత సమాధానమిచ్చింది. ద.మ. రైల్వేలో 10వేలు, పోస్టల్ శాఖ ఏపీ సర్కిల్‌లో 1922 ఖాళీలు ఉన్నాయని కేంద్రం రాజ్యసభలో వెల్లడించింది.

ఆర్టీసీ మహిళా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆర్టీసీ మహిళా సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారిని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కోరింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్షులు సి.చంద్రయ్య, రమణారెడ్డి శుక్రవారం లేఖ రాశారు. మహిళలకు ప్రతి నెలా మూడు రోజులు సెలవు ఇవ్వాలనే ఆదేశాలున్నా అమలు కావడం లేదని పేర్కొన్నారు.

కలుషిత ఆహారం తిని 20 మంది అస్వస్థత

ఒకరు మృతి. మరో ఇద్దరి పరిస్థితి విషమం


మృతుడు సామ్రాట్

నెక్కల్లు(తుళ్లూరు), న్యూస్‌టుడే: కలుషిత ఆహారం తీసుకున్న సంఘటనలో ఒకరు మరణించగా, 20 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రాజధాని అమరావతిలోని నెక్కల్లు-అనంతవరం మధ్య భూగర్భ కేబుల్ పనులు చేసేందుకు పశ్చిమ బంగా రాష్ట్రం నుంచి రెండు వారాల క్రితం 25 మంది కార్మికులు వచ్చారు. వీరంతా స్థానిక పొలాల్లో షెడ్లు వేసుకుని ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వండిన చేపల కూరతో గురువారం భోజనం చేశారు. అదే కూరను శుక్రవారం ఉదయం కూడా తిన్నారు. దీనికి తోడు పరిశుభ్రంగా లేని నీటిని తాగారు. దీంతో 20మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే గుత్తేదారు సంస్థ బాధితులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. వీరిలో సామ్రాట్(22) అనే యువకుడు మరణించగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. మిగతా వారంతా చికిత్స పొందుతున్నారు.

రైల్వేకు రూ. 1,46,500 కోట్ల మూలధన వ్యయం

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన 2018-19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రైల్వేశాఖకు మూలధన వ్యయంగా రూ. 1,46,500 కోట్లను కేటాయించింది. శుక్రవారం సంచికలో ప్రచురితమైన 'భద్రతకు పెద్దపీట' కథనంలో పొరపాటుగా 'రూ.1,46,500 కోట్లతో రైల్వే బడ్జెట్' అని ఉపశీర్షిక వచ్చింది. దీనిని పాఠకులు గమనించగలరు.

కోరలు చాస్తున్న కల్తీ మాఫియా!

- ఖరీదైన మద్యం సీసాలు చీప్ లిక్కర్‌తో భర్తీ
- నకిలీ మూతలు బిగించి కొత్తవిగా విక్రయం
- సొంతంగానే మద్యం తయారు చేస్తున్న ముఠాలు
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు దర్యాప్తులో వెలుగులోకి

ఈనాడు - అమరావతి


కల్తీ మద్యం ముఠా సభ్యులను చూపిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగం డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్‌లో కల్తీ మద్యం మాఫియా కోరలు చాస్తోంది. వినియోగించి వదిలేసిన ఖరీదైన మద్యం సీసాల్లో చౌకరకం (చీప్ లిక్కర్)ను నింపేసి దాన్నే బ్రాండెడ్ మద్యం ముసుగులో విక్రయిస్తోంది. రాష్ట్రంలోని ఏజెన్సీ, సముద్ర తీర ప్రాంత గ్రామాలనే లక్ష్యంగా చేసుకుని ఈ కల్తీ వ్యాపారాన్ని భారీగా నిర్వహిస్తోంది. తాజాగా శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం, గుంటూరు జిల్లా రేపల్లె పరిధిలో ఈ తరహా ముఠాల కార్యకలాపాలు వెలుగుచూశాయి. చాలా కాలంగా వ్యవస్థీకృతంగా..సాగుతున్న ఈ దందా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు దర్యాప్తులో వెలుగుచూసింది.

ఖాళీ సీసాల సేకరణతో మొదలు..

అత్యాశపరులైన కొందరు కల్తీ మద్యం తయారీదారులు తొలుత డైరెక్టర్స్ స్పెషల్, ఇంపీరియల్ బ్లూ, ఆఫీసర్స్ ఛాయిస్ తదితర మద్యం బ్రాండ్లకు సంబంధించి వినియోగించి వదిలేసిన ఖాళీ సీసాలను సేకరిస్తారు. ఆ బ్రాండ్లకు సంబంధించిన నకిలీ మూతల తయారీ కోసం హైదరాబాద్‌లోని బాలానగర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న కొన్ని మోసకారి సంస్థలను ఆశ్రయిస్తారు. మూతల తయారీ పూర్తయిన తర్వాత వాటిపై సంబంధిత మద్యం బ్రాండ్ పేర్లను ముద్రించే బాధ్యతలను మరికొన్ని సంస్థలకు అప్పగిస్తారు. ఇలా సిద్ధమైన వాటిని తమ వ్యవస్థీకృత దందాలో భాగస్వాములుగా ఉండే కొన్ని ట్రాన్స్‌పోర్ట్ సంస్థల ద్వారా తాము కోరుకున్న చోటుకు రవాణా చేయిస్తారు.

రూ.100 నుంచి రూ.250 చొప్పున అమ్మకం

తాము సేకరించిన ఖరీదైన మద్యం సీసాలు, ప్రత్యేకంగా తయారు చేయించిన నకిలీ మూతలను ఒక దగ్గరకు చేరుస్తారు. వాటి సంఖ్యకు అనుగుణంగా అతి తక్కువ ధర కలిగిన చౌక రకం మద్యం సీసాలను (180 ఎంఎల్ పరిమాణం) కొనుగోలు చేస్తారు. అందులోని మద్యాన్ని ముందే సేకరించి పెట్టుకున్న ఖరీదైన బ్రాండ్ల ఖాళీ సీసాల్లో నింపుతారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రత్యేకంగా తయారు చేయించిన నకిలీ మూతలను వాటిపైన బిగించి సీల్ వేస్తారు. కొనుగోలుదారులకు అనుమానం రాకుండా ఉండేందుకు చౌకరకం మద్యం సీసాలపై ఉన్న 'హీల్'ను తొలగించి ఖరీదైన బ్రాండ్ల సీసాలపై అతికిస్తారు. ఇలా సిద్ధం చేసిన కల్తీ మద్యం సరకును మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని గొలుసు దుకాణాలకు చేరవేయించి అక్కడ విక్రయిస్తుంటారు. సాధారణంగా 180 ఎంఎల్ పరిమాణం కలిగిన చౌకమద్యం సీసా ధర రూ.50 ఉంటుంది. దీన్నే ఖరీదైన బ్రాండ్ల సీసాల్లో నింపి అంతే పరిమాణం గల మద్యాన్ని దాని ధరను బట్టి రూ.100 నుంచి రూ.250 వరకూ విక్రయిస్తుంటారు.

మహారాష్ట్ర నుంచి ముడిసరకు దిగుమతి

మరో కల్తీ వ్యవహారంలో మహారాష్ట్రలోని యవత్‌మల్ తదితర ప్రాంతాల నుంచి కల్తీ మద్యం తయారీ ముఠాలు ముడి ఆల్కహాలును భారీగా దిగుమతి చేసుకుంటున్నాయి. హైదరాబాద్, ఆదిలాబాద్ మీదుగా ఈ ముడి ఆల్కహాల్ ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు తొలుత చేరుతోంది. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని కొన్ని మారుమూల ప్రాంతాల్లోకి వివిధ మార్గాల ద్వారా రవాణా అవుతోంది. ఆయా చోట్ల షెడ్లు, ఫాంహౌస్‌ల వంటివి అద్దెకు తీసుకుని ఇక్కడే డిస్టిలరీలుగా మార్చేసుకుని ఈ ముడిసరకుతో కల్తీ మద్యాన్ని తయారు చేస్తున్నారు. ఇలా తయారైన మద్యాన్ని ముందే సేకరించి పెట్టుకున్న ఖాళీ మద్యం సీసాల్లో నింపి, వాటికి మూతలను బిగించి సీల్ వేసి గొలుసు దుకాణాలకు తరలిస్తారు. సాధారణంగా వెయ్యి లీటర్ల ముడి ఆల్కహాలును దిగుమతి చేసుకుని మద్యం తయారీ చేసేందుకు, ఇతరత్రా ఖర్చులతో కలిపి రూ.4 లక్షలు ఖర్చవుతుంది. 400 కేసుల మద్యం తయారవుతుంది. దాన్ని అమ్మితే ఖర్చులు పోనూ ముఠాలకు రూ.12 లక్షలు మిగులుతుంది.

కల్తీ మద్యం తయారీ ముఠా అరెస్టు

ఈనాడు, అమరావతి: ఖరీదైన బ్రాండ్లకు సంబంధించిన ఖాళీ మద్యం సీసాల్లో చౌకరకం మద్యాన్ని నింపి వాటిపై నకిలీ మూతలను బిగించి విక్రయిస్తున్న ముఠా సభ్యులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగం శుక్రవారం అరెస్టు చేసింది. రిమాండుకు పంపించింది. ఈ ముఠా కార్యకలాపాలు వారు మోసగిస్తున్న తీరును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగం డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం విజయవాడలోని ఎక్సైజ్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ ముఠాలో శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలానికి చెందిన మీసాల తిరుమలరావు, మీసాల ఈశ్వరరావు, లావేటి వెంకటరమణ, విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం మండలంలోని బాబువైన్స్ యజమాని టంకాల అనంతరామన్ రంగారావు(మూతలు తయారు చేయిస్తాడు), వీరఘట్టంలోని జనతా వైన్స్‌లో పనిచేసే మాచర్ల అనిల్ బాబు, దళారి కామని నాగరాజు, మూతలు తయారు చేసే హైదరాబాద్‌లోని స్వాతి ఇండస్ట్రీస్ అధినేత గంజి శ్రీనివాస్, మూతలను తరలించే లక్ష్మీ రోడ్ వేస్ యజమాని వాడేపల్లి సూర్యనారాయణ, మూతలపై బ్రాండెడ్ కంపెనీల ముద్రలు వేస్తున్న చల్లా చంద్రశేఖర్‌రెడ్డి నిందితులుగా ఉన్నారు.

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించాలి

- రక్త సంతకాలు చేసిన ఉత్తరాంధ్ర చర్చావేదిక సభ్యులు

ఈనాడు, దిల్లీ: విశాఖపట్నం కేంద్రంగా రైల్వేజోన్ తక్షణమే ప్రకటించాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక డిమాండు చేసింది. శుక్రవారమిక్కడ మాజీ మంత్రి కొణతాల, మాజీ ఎంపీ జ్ఞానేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర రైల్వే మంత్రి పీయూష్‌గోయెల్‌కు రక్తంతో సంతకాలు చేసిన వినతి పత్రాన్ని అందజేశారు. లోక్‌సత్తా ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ విశాఖ జోన్ వల్ల రాష్ట్రానికి చేకూరే లాభం కేంద్రమంత్రికి వివరించామన్నారు. విభజన హామీలను కేంద్రం తుంగలో తొక్కిందని జ్ఞానేందర్‌రెడ్డి విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమ, గిరిజన విశ్వవిద్యాలయం విషయంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు.

రాజ్యసభలో కేవీపీ ప్లకార్డు ప్రదర్శన

ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం కోసమే పోరాడుతున్నానని కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు అన్నారు. గురువారం రాజ్యసభలో 'హెల్ప్ ఆంధ్రప్రదేశ్' ప్లకార్డు పట్టుకొని వెల్ వద్ద ఆయన నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించకపోవడంతో సభలో నిరసన తెలిపానన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీద నమ్మకం లేకనే పోలవరం ప్రాజెక్టు సాంకేతిక నిర్వహణను కేంద్రం తనవద్దే ఉంచుకొందన్నారు. కేంద్రం నుంచి బయటకు వస్తామని ఇప్పుడు లీకులిస్తున్నారని, ఎంపీలంటే సరిపోదని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పాలని ఎంపీ కేవీపీ డిమాండు చేశారు.


రాజ్యసభలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీ కేవీపీ

బలం ఉందనే భాజపాకు పొగరు: టీజీ

ప్రభుత్వ ఏర్పాటుకి సరిపడా సొంత బలం ఉందనే భాజపా పొగరుగా ఉందని తెదేపా ఎంపీ టీజీ వెంకటేశ్ విమర్శించారు. ఆయనిక్కడ మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో ప్రతిపక్షాలతో కలిసి చక్రం తిప్పే సామర్థ్యం సీఎం చంద్రబాబుకి ఉందన్నారు. భాజపాకు వ్యతిరేకంగా చంద్రబాబు నిలబడితే విపక్షాలన్నీ అంగీకరిస్తాయన్నారు. ''కేంద్రంతో యుద్ధం ప్రకటన చేసే దిశగా వెళ్తున్నాం. అంచెలంచెలుగా యుద్ధం ఉంటుంది. ఈ యుద్ధంలో చివరి దశలో తెగతెంపులు ఉంటాయి. అప్పుడున్నంత బలం భాజపాకు ఇప్పుడు లేదు. రాజస్థాన్‌లో ఫలితాలు చూశాం కదా'' అని టీజీ అన్నారు.

రాష్ట్ర ఎంపీలు ప్రధాని ఇంటి ఎదుట ధర్నా చేయాలి

చలసాని శ్రీనివాస్

విజయవాడ, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని, రాష్ట్ర ఎంపీలంతా ప్రధాని ఇంటి ఎదుట ధర్నా చేయాలని ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ తెలుగు రాష్ట్రాలపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలకు రూ.వేల కోట్లు కేటాయించి ఆంధ్రప్రదేశ్‌కు రిక్తహస్తం చూపించారని విమర్శించారు. కర్ణాటక, మహారాష్ట్రలకు ఇచ్చిన ప్రాధాన్యం ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. అన్ని పార్టీల నాయకులు కలిసికట్టుగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికైనా కేంద్రంతో తాడోపేడో తేల్చుకోవాలన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమితి కన్వీనర్ దోనెపూడి శంకర్, విద్యార్థి ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపునకు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థికశాఖ అనుమతితో ఏర్పాటు చేసిన అవుట్‌సోర్సింగ్ సంస్థల ద్వారా పని చేస్తున్న వారికి 50శాతం, లేదా అదే కేటగిరిలో పనిచేస్తున్న టైం స్కేల్ ఉద్యోగులకు 2015లో సవరించిన కనీస వేతనానికి మించకుండా ఈ రెండింటిలో ఏదీ తక్కువైతే దాన్ని చెల్లించాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి హేమ మునివెంకటప్ప ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైరల్ అవుతున్న 'ఐపీఎస్ ప్రతిజ్ఞ'

లఖ్‌నవూ: అయోధ్యలో సాధ్యమైనంత త్వరలో రామమందిర నిర్మాణం జరగాలని ఐపీఎస్ అధికారి, హోమ్‌గార్డ్ డైరక్టర్ జనరల్ సూర్యకుమార్ శుక్లా వివాదానికి తెరతీశారు. లఖ్‌నవూ విశ్వవిద్యాలయంలో రెండురోజుల క్రితం రామమందిరంపై జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించి తీరుతామని ప్రతిన బూనారు. ఆయన మాట్లాడుతున్నప్పుడు తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం చక్కర్లు కొట్టింది.

బడ్జెట్‌పై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి

- తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు

ఈనాడు, అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపులు లేకపోవడంపై పార్టీ శ్రేణులు, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి కళావెంకట్రావు వ్యాఖ్యానించారు. ప్రజల్లో ఉన్న తీవ్ర అసంతృప్తే రాష్ట్ర ప్రభుత్వంలో ఉందని పేర్కొన్నారు. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బడ్జెట్‌లో ముఖ్యంగా రాజధాని, రైల్వేజోన్, రెవెన్యూ లోటు భర్తీ చేసేలా కేటాయింపులు లేకపోవడాన్ని ప్రజలు గమనించారని తెలిపారు. ఏపీకి జరగని కేటాయింపులపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ శుక్రవారం చూస్తాం.. కొనసాగిస్తామని పేర్కొన్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి కాలవ శ్రీనివాసులు, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ పాల్గొన్నారు.

2019 నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణం: 2019 మార్చి నాటికి పట్టణ ప్రాంతాల్లో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ వెల్లడించారు. సచివాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మొత్తం 6,81,000 ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రాజధాని నిర్మాణ అంశంపై కేంద్రానికి డీపీఆర్ పంపలేదనడం అవాస్తవమని పేర్కొన్నారు. రాజధానిలోని నీరుకొండలో ఉన్న కొండపై ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన నాలుగు నమూనాలను మంత్రివర్గ సమావేశంలో పరిశీలించినట్లు తెలిపారు. వీటిపై సీఎం కొన్ని సూచనలు చేశారని పేర్కొన్నారు. మరో దఫా జరిగే మంత్రివర్గ సమావేశంలో వీటిపై చర్చిస్తామన్నారు.

ఈనెల 6న ఎమ్మెల్సీల కమిటీ సమావేశం

విద్యాశాఖలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నియమించిన ఎమ్మెల్సీలు, అధికారులతో కూడిన కమిటీ ఈనెల 6న సమావేశం కానున్నట్లు ఎమ్మెల్సీలు శ్రీనివాసులనాయుడు, కత్తి నరసింహారెడ్డి తెలిపారు. మొత్తం 10అంశాలపై ఈ కమిటీ తన సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించనుంది.

బడ్జెట్‌తో సంబంధం లేకుండానే నిధులొస్తాయి

- ముఖ్యమంత్రి అర్థం చేసుకుంటారు..
- మంత్రి మాణిక్యాలరావు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర అభివృద్ధి విషయంలో తెలుగుదేశం పార్టీ ఎంత నిజాయితీతో పనిచేస్తుందో తామూ అలానే చేస్తున్నామని దేవదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు చెప్పారు. కేంద్ర బడ్జెట్‌పై స్పష్టత రావాల్సి ఉందని, అప్పుడు సమస్యలన్నీ సర్దుకుంటాయని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అర్థం చేసుకుంటారని పేర్కొన్నారు. సచివాలయంలో శుక్రవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. "4వ తేదీ ఎంపీల సమావేశంలో లోపు అన్నీ పరిష్కారమవుతాయి. కేంద్రం ఇచ్చే నిధులకు, బడ్జెట్ కేటాయింపులకు సంబంధం లేదు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక లేకుండానే రాజధానికి కేంద్రం రూ.2,500 కోట్లు ఇచ్చింది. ఐఐటీ కోసం రూ.155 కోట్లతో టెండర్లు పిలిచారు. బడ్జెట్లో లేకుండానే ఈ కేటాయింపులు చేశారు. పోలవరం విషయంలోనూ ఇలాంటి అపోహలే తలెత్తాయి. నాబార్డు నుంచి కేటాయింపులు చేయడంతో సమస్య పరిష్కారమైంది. అన్నీ కొలిక్కివస్తాయి. తెదేపాపై భాజపాలో ఎవరికీ అసంతృప్తిలేదు" అని మంత్రి పేర్కొన్నారు.

5 ఆస్పత్రులకు జిల్లా స్థాయి హోదా!

- నిధులు సమకూర్చాలంటూ ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు

ఈనాడు, అమరావతి: టెక్కలి(శ్రీకాకుళం జిల్లా), హిందూపురం(అనంతపురం), మదనపల్లి(చిత్తూరు), ఆత్మకూరు(నెల్లూరు), మార్కాపురం(ప్రకాశం)లోని ప్రాంతీయ ఆస్పత్రులను జిల్లా ఆసుపత్రులుగా మార్చాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. అవసరమైన నిధులను సమకూర్చాలని కోరుతూ ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపింది. ప్రాంతీయ ఆసుపత్రులు వంద పడకలతో ఉన్నాయి. జిల్లా ఆసుపత్రులుగా మారిస్తే పడకల సంఖ్య రెండింతలయ్యే అవకాశముంది. ప్రస్తుతం ఏడెనిమిదికే పరిమితమైన స్పెషాలిటీ వైద్య సేవలు 11 వరకు పెరుగుతాయి. ఈ ఆస్పత్రుల్లో వైద్యసేవల మెరుగుకు కనీసం రూ.170కోట్లు అవసరమని అంచనా. ఆర్థికశాఖ ఆమోదాన్ని బట్టి ఈ సదుపాయాల కల్పన జరుగుతుంది. సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం అధికారులతో మంత్రి కామినేని సమావేశమై వివిధ అంశాలతో పాటు ఆస్పత్రుల స్థాయి పెంపు పైనా చర్చించారు. త్వరలో రాష్ట్ర క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని, వెంటనే టెండర్లను ఆహ్వానించాలని నిర్ణయించారు. ఆయుష్ ఆస్పత్రుల బలోపేత చర్యల్లో భాగంగా వైద్యులు, సిబ్బందికి బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిచేయాలని ఆదేశించారు. నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో సీనియర్ రెసిడెంట్ వైద్యులకు వేతనాలను వెంటనే చెల్లించేలా ట్రెజరీ అధికారులతో మాట్లాడాలని డీఎంఈ అధికారులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ ఆస్పత్రుల భవనాలను వెంటనే తొలగించాలని మంత్రి ఆదేశించారు.

21న అంతర్జాతీయ యోగ దినోత్సవం!

ఈ ఏడాది జూన్ 21న జరిగే 4వ అంతర్జాతీయ యోగా దినోత్సవాలను ఆంధ్రప్రదేశ్‌లో జరిపేందుకు కేంద్రం సుముఖత ప్రకటించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖకు అధికారిక సమాచారాన్ని పంపింది. విశాఖ లేదా మరోచోట ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

నాటకం సమాజానికి స్ఫూర్తి కలిగించే సాధనం


- తెనాలిలో నంది నాటకోత్సవాలు ప్రారంభం

తెనాలి(మారీస్‌పేట), న్యూస్‌టుడే: సమాజానికి మంచిని ప్రేరేపించే, స్ఫూర్తిని కలిగించే సాధనంగా నాటకం ఉపయోగపడుతుందని శాసనసభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఏపీ ప్రభుత్వం, చలనచిత్ర, టి.వి.నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి మార్చి 10 వరకు గుంటూరు జిల్లా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తోన్న నంది నాటకోత్సవాలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆలపాటి మాట్లాడుతూ.. తెనాలిలో 38 రోజులపాటు 184 నాటక, నాటికల ప్రదర్శనలు చేయడం ద్వారా కళల కాణాచిగా పేరున్న తెనాలి కళాకారులకు, విద్యార్థులకు మంచి అవకాశాన్ని కల్పించారన్నారు. నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. విజ్ఞానమంటే నాలుగు గోడల మధ్య నేర్చుకునే చదువు ఒక్కటే కాదని, లలిత కళల్లో నైపుణ్యం సాధించడం ద్వారా ప్రపంచస్థాయిలో గుర్తింపు సాధించడానికి అవకాశం దక్కుతుందన్నారు. కూచిపూడి నాట్యకళ అభివృద్ధి కోసం రూ.100కోట్ల నిధులిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ఏప్రిల్ 16న కందుకూరి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసే తెలుగు నాటక రంగ దినోత్సవాన 68 మంది కళా ప్రముఖులకు అవార్డులు అందజేయనున్నట్లు చెప్పారు.


నంది నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేంద్రప్రసాద్, రాష్ట్ర నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు

తితిదే వద్ద 45 టన్నుల విదేశీ నాణేలు

- ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడి



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామివారికి కానుకల రూపంలో సమర్పించిన విదేశీ నాణేలు భారీగా ఉన్నాయని దేవస్థానం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. వీటి మార్పిడికి చర్యలు చేపట్టామని చెప్పారు. మే నెల కోటా కింద శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు 61,858 విడుదల చేశామని వెల్లడించారు. తిరుమల నుంచి డయల్ తితిదే ఈవో కార్యక్రమంలో శుక్రవారం భక్తుల ఫోన్ కాల్స్‌కు సింఘాల్ సమాధానాలిచ్చారు.

- తితిదే వద్ద 45 టన్నుల విదేశీ నాణేలున్నాయి. ఇందులో 18 టన్నులు మలేసియావి. బ్యాంకులతో చర్చించి వీటి మార్పిడికి ఒప్పందం చేసుకున్నాం. మన 25 పైసల నాణేలు కూడా భారీగా నిల్వ ఉన్నాయి. వీటి మార్పిడికి చర్యలు తీసుకుంటాం.
- ఆనంద నిలయం.. అనంత స్వర్ణమయం పథకం కింద బంగారు, నగదు విరాళాలు సమర్పించిన భక్తులకు వారి కోరిక మేరకు తిరిగి చెల్లిస్తున్నాం. ఈ పథకం కింద 116 కిలోల బంగారం, రూ.6 కోట్ల నగదు విరాళాలుగా వచ్చాయి. ఈ పథకాన్ని రద్దు చేయడంతో కొందరు దాతలు వెనక్కి తీసుకుంటున్నారు.
- ఈ నెల 13, 20 తేదీల్లో వయోవృద్ధులు, దివ్యాంగులను; 14, 21 తేదీల్లో ఐదేళ్లలోపు పిల్లలతో పాటు తల్లిదండ్రులను సుపథం మార్గంలో శ్రీవారి ఆలయానికి అధిక సంఖ్యలో అనుమతిస్తాం.
- శ్రీనివాస మంగాపురం ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 6 నుంచి 15 వరకు నిర్వహిస్తున్నాం.
- మేనెల కోటా శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లలో ఆన్‌లైన్ డిప్ కింద 10,913 టికెట్లు విడుదల చేశాం. ఇందులో సుప్రభాతం టికెట్లు 8,013; తోమాల 150, అర్చన 150, అష్టదళ పాద పద్మారాధన సేవ 300, నిజపాద దర్శనం టికెట్లు 2,300 ఉన్నాయి. ఆన్‌లైన్ జనరల్ కేటగిరీ కింద 50,945 టికెట్లు విడుదల చేశాం. వీటిలో విశేషపూజ 1,500; కల్యాణోత్సవం 11,625; ఊంజలసేవ 3,100; ఆర్జిత బ్రహ్మోత్సవం 6,665; వసంతోత్సవం 13,330; సహస్రదీపాలంకరణ సేవ టికెట్లు 14,725 ఉన్నాయి.

గురుకులాల్లో అతిథి ఉపాధ్యాయుల సమ్మె

వేతనాలు పెంచాలంటూ విధుల బహిష్కరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని అతిథి ఉపాధ్యాయులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. వేతనాలను పెంచాలని డిమాండు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం కూడా విధులను బహిష్కరించారు. రూ.14,500 వేతనాన్ని ఇవ్వాలని కోరుతూ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి కల్నల్ రాములకు సంఘ నాయకులు వినతి పత్రమిచ్చారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అతిథి ఉపాధ్యాయుల సమ్మెతో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనకు అవరోధం ఏర్పడుతోంది.

మా చిరునామా: విజేత,
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512

ముద్దు.. ముచ్చట

అభిమాన ప్రదర్శన అనేక రకాలు! ఇష్టమైన జట్లను, బాగా ఇష్టపడే ఆటగాళ్లను ప్రోత్సహిస్తూ మైదానాల్లో అభిమానులు విచిత్ర విన్యాసాలు చేస్తారు. వీటిని ఒడిసి పట్టడానికి ఇప్పుడైతే టీవీ కెమేరాలున్నాయిగానీ ఒకప్పుడైతే రేడియో ప్రత్యక్ష వ్యాఖ్యానాలు, పత్రికల ప్రత్యేక కథనాలే గతి! ఆ రోజుల నాటి ముద్దు ముచ్చట్లివి!

1960.. జనవరి మొదటి వారం.. భారత, ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడో టెస్టు మ్యాచ్ బొంబాయి బ్రాబౌర్న్ స్టేడియంలో జరుగుతోంది. ఈ సిరీస్‌లో మొదటి మ్యాచ్ (దిల్లీ)లో ఇన్నింగ్స్ పరాభవాన్ని చవిచూసిన భారత జట్టు రెండో మ్యాచ్ (కాన్పూర్)లో జాసు పటేల్ స్పిన్ మంత్రంతో పగ సాధించింది. సిరీస్ సమం కావడంతో మూడో టెస్టు (బొంబాయి)పై ఆసక్తి పెరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో 98 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించిన ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌పై ఒత్తిడి పెంచాలని చూసింది. కానీ సొగసైన హైదరాబాదీ అబ్బాస్ అలీబేగ్ ఆస్ట్రేలియా ఉత్సాహానికి అడ్డుకట్టలు వేశాడు. మొదటి ఇన్నింగ్స్‌లో అర్ధ శతకాన్ని సాధించడంతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో సైతం మరో అర్ధశతకంతో భారత్‌ను గట్టెక్కించాడు. ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య పెవిలియన్‌కు తిరిగి వస్తున్న బేగ్‌ను నార్త్ స్టాండ్స్ నుంచి దూసుకొచ్చిన ఓ మెరుపు తీగ గబుక్కున వాటేసుకుని చటుక్కున ముద్దాడింది.

కామెంటేటర్ బాక్స్ నుంచి ఆ దృశ్యాన్ని చూసిన అప్పటి మాజీ ఆటగాడు విజయ్ మర్చంట్ నేను గతంలో సెంచరీలు చేసినప్పుడు అమ్మాయిలంతా ఎక్కడున్నారు? అని చెణుకులతో నిట్టూర్చాడట!

సరిగ్గా అలాంటి అనుభవమే కర్ణాటక ఆటగాడు బ్రిజేష్ పటేల్‌కు ఎదురైంది. 1974-75లో క్లైవ్ లాయిడ్ సారథ్యంలోని వెస్టిండీస్ జట్టుకు, పటౌడీ నేతృత్వంలోని భారత జట్టుకు మధ్య బొంబాయిలోని వాంఖడే స్టేడియంలో నిర్ణాయక మ్యాచ్ (ఆరు రోజులపాటు) జరిగింది. ఆ స్టేడియంకు అది ప్రారంభ మ్యాచ్ కూడా. మొదటి ఇన్నింగ్స్‌లో 400 గడిని దాటిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 202 పరుగులకే కుప్పకూలి పరాభవాన్ని మూటగట్టుకుంది. జట్టు సహచరులు చేతులెత్తేసిన తరుణంలో బౌలర్లపై విరుచుకుపడి 73 పరుగులతో నాటౌట్‌గా పెవిలియన్‌కు వస్తున్న బ్రిజేష్ పటేల్‌కు ఓ యువతి ముద్దుల కానుక ఇచ్చుకుంది. విచిత్రం ఏంటంటే అటు అబ్బాస్ అలీబేగ్‌కుగానీ, ఇటు బ్రిజేష్ పటేల్‌కుగానీ అవి కెరీర్ పరంగా కలిసి రాలేదు.

- భాను


అలీబేగ్


బ్రిజేష్ పటేల్



కోహ్లి సేనా.. కాసుఖో!

కొత్త నీరు రావాల్సిందే.. పాత నీరు పోవాల్సిందే! కానీ దానికి ఒక నిర్దిష్ట సమయం ఉంటుంది. కానీ భారత క్రికెట్లో మాత్రం ఈ సమయం కొంచెం త్వరగానే వచ్చేలా ఉంది! ఇంతకుముందులా సీనియర్లు ఏళ్లకు ఏళ్లు భారత జట్టులో నిలబడిపోయే పరిస్థితి ఎంతమాత్రం కనిపించడం లేదిప్పుడు! కోహ్లి తరానికి ఖో చెప్పడానికి పరుగు పరుగున వచ్చేస్తోంది యువతరం!

కోహ్లీసేన దక్షిణాఫ్రికా పర్యటనలో ఉందిప్పుడు. భారత క్రికెట్ ప్రియుల చర్చలన్నీ ఆ జట్టు గురించే సాగుతుండాలి. కానీ ఇప్పుడు శుభ్‌మన్ గిల్ ఆడిన షాట్ల గురించి.. పృథ్వీ షా స్లిప్‌లో పట్టిన క్యాచ్‌ల గురించి.. నాగర్‌కోటి, శివమ్ మావిల బౌలింగ్ వేగం గురించే మాట్లాడుకుంటున్నారు. అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో మన కుర్రాళ్ల జోరు అలా ఇలా లేదు మరి. ఏదో ఒక ధనాధన్ ఇన్నింగ్స్ ఆడటమో.. మెరుపు బౌలింగ్ ప్రదర్శన చేయడమో కాదు.. నిలకడగా సత్తా చాటుతూ.. అంతర్జాతీయ స్థాయికి ఏమాత్రం తగ్గని ప్రతిభ చాటుతూ.. అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు, దిగ్గజాల దృష్టిని ఆకర్షిస్తున్నారు ఈ కుర్రాళ్లు.

అప్పుడే కోట్లకు కోట్లు

పాకిస్థాన్‌తో సెమీఫైనల్. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ కొంత తడబడింది. ఆ స్థితిలో శుభ్‌మన్ గిల్ ఒకవైపు నిలబడిపోయాడు. చివరిదాకా ఆడి సెంచరీతో అజేయంగా నిలిచాడు. ఆ ఇన్నింగ్స్ చూస్తే ఈ కుర్రాడిలో ఓ ప్రపంచ స్థాయి బ్యాట్స్‌మన్ ఉన్నాడని ఒప్పుకోవాల్సిందే. అందుకే గిల్‌ను గంగూలీ లారాతో పోల్చాడు. ఇక పృథ్వీ షా గురించి కొత్తగా చెప్పేదేముంది? రెండేళ్ల కిందటే ఫస్ట్ క్లాస్ అరంగేట్రం చేసి.. ఈ సీజన్లో ముంబయి తరఫున రంజీ ట్రోఫీలో మెరుపులు మెరిపించాడు. పృథ్వీ ఫుట్‌వర్క్, అతడి బ్యాటింగ్ శైలి, షాట్ల గురించి వ్యాఖ్యాతలు ప్రతి మ్యాచ్‌లోనూ మాట్లాడుతూనే ఉన్నారు. అతడికి తోడుగా ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తున్న కల్రా కూడా తక్కువవాడేమీ కాదు. యువరాజ్‌లా అందంగా షాట్లు ఆడే ఎడమచేతి వాటం బ్యాట్స్‌మనంటూ కితాబందుకున్నాడు. ఇక బౌలర్లు నాగర్‌కోటి, శివమ్ మావిల సత్తా ఏంటో.. ఐపీఎల్ వేలంలో వాళ్లకు పలికిన రేటే చెప్పేస్తుంది. నాగర్‌కోటి రూ.3.2 కోట్లకు, మావి రూ.3 కోట్లకు అమ్ముడయ్యారు. వీళ్లు అంత బలంగా కనిపించరు, ఎక్కువ ఎత్తూ లేరు. కానీ నిలకడగా 145 కిలోమీటర్ల వేగంతో బంతులేస్తూ ఆశ్చర్యానికి గురి చేశారు. ఇంకా అనుకుల్ రాయ్, అభిషేక్ శర్మ, పోరెల్ లాంటి కుర్రాళ్లూ మెరుపులు మెరిపించారు. అండర్-19 జట్టులోని ఏడుగురు ఐపీఎల్ వేలంలో అమ్ముడుబోవడం, నలుగురికి కోట్లల్లో ధర పలకడం విశేషం.

వాళ్లకు వీళ్లకు అదే తేడా..

ప్రస్తుత భారత కెప్టెన్ కోహ్లితో పాటు ఎంతో మంది స్టార్ క్రికెటర్లు అండర్-19 ప్రపంచకప్‌లో సత్తా చాటి.. తర్వాత టీమ్‌ఇండియాలోకి వచ్చిన వాళ్లే. ఐతే గతంలోని అండర్-19 జట్లకు, ప్రస్తుత బృందానిక తేడా స్పష్టం. ఈ వయసులో ప్రపంచ వేదికపై ఆడేటపుడు కనిపించే బెదురు, ఒత్తిడి ఎంతమాత్రం ఈ కుర్రాళ్లలో లేవు! ఐపీఎల్ యుగంలో క్రికెట్ ఆడటం మొదలుపెట్టిన ఈ కుర్రాళ్లు.. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు అవసరమైన దృక్పథాన్ని అలవరుచుకున్నారు. బ్యాట్స్‌మెన్ టెక్నిక్, బౌలర్ల వేగం.. మైదానంలో కుర్రాళ్ల కదలికలు, వారి దేహభాష్యం, సంయమనం.. పరిస్థితులకు తగ్గట్లుగా ఆటను మార్చుకునే తీరు.. ఇలా ప్రతి విషయంలోనూ ఒక స్థాయి కనిపిస్తోంది. వరుస విజయాలు సాధిస్తున్నా అతి విశ్వాసానికి పోకుండా.. ఏ మ్యాచ్‌లోనూ తీవ్రత తగ్గించకుండా.. మధ్యలో ఐపీఎల్ వేలం మాయలోనూ పడిపోకుండా కుర్రాళ్లు చూపించిన ఏకాగ్రత వారి ప్రత్యేకతను చాటిచెబుతుంది.

విరాట్ అందుకే అన్నాడు

2008లో అండర్-19 ప్రపంచకప్ గెలిచిన తమ జట్టు కంటే ఇప్పటి జట్టు మరింత ఆత్మవిశ్వాసంతో ఉందని, చాలా బాగా ఆడుతోందని కోహ్లీనే స్వయంగా కితాబిచ్చాడంటే ఈ జట్టు ప్రత్యేకతేంటో అర్థం చేసుకోవచ్చు. ముందు అండర్-19 స్థాయిలో మెరిసి.. ఆపై కొన్నేళ్లు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడి.. ఆ తర్వాత భారత జట్టు తలుపులు తట్టే పాత తరం క్రికెటర్లలా లేరు ఇప్పటి కుర్రాళ్లు. నేరుగా భారత జట్టు తరఫున దించినా ఆత్మవిశ్వాసంతో ఆడేసే స్థాయి వీళ్లలో కనిపిస్తోంది. కాబట్టే ఈ యువ కిశోరాలు భారత జట్టులోకి రావడానికి ఎంతో కాలం పట్టకపోవచ్చని.. ఇప్పుడు టీమ్‌ఇండియాలో ఉన్న సీనియర్లకు వీళ్లు త్వరలోనే చెక్ పెట్టే అవకాశాలు లేకపోలేదని విశ్లేషకుల అంచనా.


ఆ క్యాచ్‌లు చూశారా?

సాధారణంగా ఫాస్ట్‌బౌలర్ల ఫీల్డింగ్ ఏమంత గొప్పగా ఉండదు. కానీ అండర్-19 జట్టు ప్రధాన పేసర్లలో ఒకడైన శివమ్ మావి పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో బౌండరీ వద్ద పట్టిన ఒక క్యాచ్ చూస్తే షాకవ్వాల్సిందే. క్యాచ్ అందుకున్నాక అడుగు బౌండరీ అవతల పడేలా ఉంటే.. బంతిని గాల్లోకి విసిరి మళ్లీ వెనక్కి వచ్చి అందుకున్నాడతను. అండర్-19 జట్టు ఫీల్డింగ్ ప్రమాణాలెలా ఉన్నాయో చెప్పడానికి ఇదొక ఉదాహరణ. అదే మ్యాచ్‌లో స్లిప్‌లో షా అందుకున్న క్యాచ్‌లు.. గిల్ వెనక్కి పరుగెడుతూ పట్టిన మరో క్యాచ్ కళ్లు చెదిరిపోయేలా చేసేవే. అండర్-19 జట్టును ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా తయారు చేస్తారు. ఇలాంటి జట్టులో ఇంతటి సమష్టితత్వం, ఫీల్డింగ్ ప్రమాణాలుండటం ఆశ్చర్యం కలిగించే విషయం.


వాళ్ల వెనుక అతడు..

వయసు 19 లోపే అయినా.. అనుభవజ్ఞుల్లో కనిపించే పరిణతి ఉంది. ఈ తరానికి తగ్గ దూకుడూ ఉంది.. అలాగే టెక్నిక్కూ ఉంది. టెస్టు క్రికెట్లోనూ సత్తా చాటగల ఓపిక, నైపుణ్యాలూ కనిపిస్తున్నాయి. మరి కుర్రాళ్లలో అప్పుడే అంత పరిణతి, ఈ సమతూకం ఎలా సాధ్యం అంటే.. సమాధానం రాహుల్ ద్రవిడ్! సీనియర్ జట్టు కోచ్ పదవి చేపట్టే అవకాశం లభించినా వద్దనుకుని కుర్రాళ్లను తీర్చిదిద్దే బాధ్యతే తీసుకున్న ద్రవిడ్.. క్రికెటర్‌గా కొనసాగినప్పట్లాగే నిబద్ధతతో, చడీచప్పుడు లేకుండా తన పని చేసుకుపోతున్నాడు. కుర్రాళ్ల ప్రతిభను, దూకుడును సరైన దారిలో పెట్టి వారిని టీమ్‌ఇండియా వైపు నడిపిస్తున్నాడు. గత రెండు మూడేళ్లలో అండర్-19, ఇండియా-ఎ జట్ల నుంచి రెండంకెల సంఖ్యలో కుర్రాళ్లు భారత జట్టులోకి వచ్చారంటే అది రాహుల్ ఘనతే. ఇప్పుడు ప్రపంచకప్ ఆడుతున్న జట్టును కొన్ని నెలల కిందటే తన చేతికి తీసుకుని వారిని తీర్చిదిద్దాడు రాహుల్.


ప్రపంచకప్‌లో ఎవరెలా?




శుభ్‌మన్	
మ్యాచ్‌లు	5
పరుగులు	341
సగటు	170.5



పృథ్వీ షా	
మ్యాచ్‌లు	5
పరుగులు	232
సగటు	77.33



కల్రా	
మ్యాచ్‌లు	5
పరుగులు	151
సగటు	50.33



నాగర్ కోటి	
మ్యాచ్‌లు	5
వికెట్లు	7
సగటు	15.14




శివమ్ మావి	
మ్యాచ్‌లు	5
వికెట్లు	8
సగటు	15.5



అనుకుల్ రాయ్	
మ్యాచ్‌లు	5
వికెట్లు	12
సగటు	7.91

అతనికి తెలుస్తోంది... శకునాలన్నీ అలాగే కనబడుతున్నాయి..
ఒంట్లో సత్తువ తగ్గిపోతుందా.. రాకెట్ విడిచిపెట్టే గడియ సమీపించిందా.. ఏవేవో అనుమానాలు.. ఇంకేవో భయాలు!
ఇంతటి సంకట స్థితిలో అతని తోడే అండగా నిలిచింది.
ఆ ఒక్క స్ఫూర్తే అతణ్ని మళ్లీ ఆటలో మమేకమయ్యేలా చేసింది.
తిరిగి ఛాంపియన్‌ను చేసింది..
ఆ విజేత రోజర్ ఫెదరర్ అయితే.. అతనికి మద్దతుగా నిలిచింది భార్య మిర్కా..
ఇంకా అతని కుటుంబం...
అందుకే ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన తర్వాత అతనికా కన్నీళ్లు..
కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచి శిఖరాగ్రాన చేరినా
తొలి టైటిల్ సాధించిన టీనేజర్ మాదిరిగా గంతులు!



ఆమే అతడి సైన్యం!

కోర్టులో ఆడుతోంది ఫెదరర్ మాత్రమే.. కానీ అతనికి అడుగడుగునా స్ఫూర్తినిస్తూ.. ఓడితే ఓదారుస్తూ.. ప్రోత్సహిస్తూ.. ప్రతి క్షణం తోడుగా ఉండే ఒక సైన్యమే అతని వెనుకుంది. అందుకే ఐదేళ్ల పాటు ఒక్క టైటిల్ నెగ్గకపోయినా అతను కుంగిపోలేదు. అనామక ఆటగాళ్లు ఓడిస్తున్నా వెనకబడిపోలేదు. భార్య మిర్కా, తల్లి లెనెట, తండ్రి రాబర్ట్.. వీళ్లే కాదు ముద్దులొలికే తన నలుగురు పిల్లలు ఫెదరర్‌కు అతి పెద్ద బలం. అందుకే రోజర్ ఏ పెద్ద టోర్నీ ఆడుతున్నా వీళ్లు అభిమానుల్లో ఉంటారు. ఫెదరర్‌కు మానసిక బలాన్ని ఇస్తూనే ఉంటారు. ఏం అవసరం వచ్చింది ఈ వయసులో అతని తల్లిదండ్రులు ప్రపంచం నలుమూలలకు తిరగడానికి... ఏం అవసరం వచ్చింది మిర్కాకు నలుగురు పిల్లల బాధ్యతను మోస్తూ కూడా ఫెదరర్ ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్లడానికి! వాళ్లందరికీ తెలుసు.. ఫెదరర్‌లో ఛాంపియన్ ఇంకా ఉన్నాడని.. అతనికి మానసికంగా శక్తినిస్తే.. చెలరేగిపోతాడని!! అదే నిజమైంది. 17 టైటిళ్ల దగ్గరే ఆగిపోతాడు అన్న విమర్శకులను, మీడియాను ఆశ్చర్యపరుస్తూ గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్లో టైటిల్ గెలిచాడు రోజర్. అది ఆరంభం మాత్రమే!!

మిర్కా లేకుంటే..

తన 17 టైటిళ్లకు ఫెదరర్ కనీసం ఒక్క టైటిల్ జత చేసినా చాలా గొప్పే అనుకున్న వాళ్లకు ఇప్పుడతను 20 టైటిళ్లు సాధించడం కలలాగే అనిపిస్తోంది. ముఖ్యంగా 12 నెలల వ్యవధిలో మూడు టైటిళ్లు.. అందులోనూ ఒక టైటిల్‌ను డిఫెండ్ చేసుకోవడం అంటే 36 ఏళ్ల ఫెదరర్ అత్యద్భుతం చేసినట్లే. ఈ అద్భుతం వెనుక అతని భార్య మిర్కా ఉంది. నలుగురు పిల్లలను చూసుకుంటూనే అతనికి మేనేజర్‌గా మారిపోయింది. ఫెదరర్ ఏ టోర్నీ ఆడాలి.. ఏది ఆడకూడదు.. ఎక్కడ బస చేయాలి.. ఎప్పుడు ఎక్కడికి వెళ్లాలి.. ఎవరిని కలవాలి.. ఇవన్నీ చూసుకునేది ఆమెనే. అందుకే ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచాక ఫెదరర్ ఒకే మాట అన్నాడు.. 'మిర్కా మద్దతే లేకుంటే తాను ఎప్పుడో టెన్నిస్ వదిలేసేవాడినని.. ఆమె తన వెంట వచ్చినంత కాలమే తాను టెన్నిస్‌లో కొనసాగుతానని'.

ఈ పయనం ఎందాక!

టెన్నిస్ చరిత్రలో రిటైర్ అయి మళ్లీ రాకెట్ పట్టిన ఆటగాళ్లు ఉన్నారు.. గాయాలు పాలై పునరాగమనంలో టైటిళ్లు కొట్టిన అగస్సీ లాంటి వాళ్లు కూడా ఉన్నారు. కానీ ఒకప్పుడు ఒక్క వెలుగు వెలిగి.. ఆ తర్వాత అనామకుల చేతులోనూ ఓడిపోతూ.. ర్యాంకుల్లో పడిపోయినా మళ్లీ జవసత్వాలు తెచ్చుకుని ఫెదరర్‌లా టైటిళ్లు కొట్టిన వాళ్లు లేరు. అందులోనూ 35 ఏళ్లు దాటాక 12 నెలల వ్యవధిలో మూడు టైటిళ్లు సాధించిన ఆటగాళ్లు లేనేలేరు. అందుకే రోజర్‌ను టెన్నిస్ అందించిన అత్యుత్తమ ఆటగాడని పండితులు కీర్తిస్తున్నారు. ఈ స్విస్ స్టార్ ఇప్పుడు 20 టైటిళ్ల మీద ఉన్నాడు. అతనికి సమీప ప్రత్యర్థి రఫెల్ నాదల్ (16)కు మధ్య తేడా నాలుగు టైటిళ్లు. ఫెదరర్ ఊపు, ప్రస్తుత ఆస్ట్రేలియన్ ఓపెన్ ఇచ్చిన ఉత్సాహం.. ఫిట్‌నెస్ అన్నింటిని దృష్టిలో పెట్టుకుంటే ఈ ఏడాది అతను మరో టైటిల్ కొట్టే అవకాశం లేకపోలేదు. అదీ తన ప్రియమైన వింబుల్డన్‌లో అతనికి మంచి ఛాన్స్ ఉంది. జ్వెరెవ్, చంగ్, ఎడ్మండ్ లాంటి యువ కెరటాలు దూసుకొస్తున్న తరుణంలో నాదల్‌కు మిగిలిన కోర్టుల్లో టైటిల్ కొట్టే అవకాశాలు చాలా తక్కువ. ఇక జకోవిచ్ (12) కూడా ఫెదరర్ కంటే చాలా వెనకబడే ఉన్నాడు. ఈ నేపథ్యంలో అతణ్ని సమీపించడం అతి కష్టం. ఫెదరర్ తన 20 టైటిళ్లకు మరో రెండు టైటిళ్లు జత చేసినా అతణ్ని అందుకోవడం సులభం కాదు. రోజర్ మాత్రం మిర్కా తోడుగా ఉంటే చాలు మరెన్నో అద్భుతాలు చేసేస్తానంటున్నాడు.

ఫెదరర్ కేవలం టెన్నిస్ ఆడే దేశాల్లోనే కాదు ప్రపంచం నలుమూలలా అభిమానుల్ని సంపాదించుకున్న ఆటగాడు. అత్యధిక ఆదాయం సంపాదిస్తున్న క్రీడాకారుల జాబితాలోనూ అతను టాప్-5లో ఉన్నాడు. మిగిలిన ఆటగాళ్లు వేరు.. ఫెదరర్ వేరు. అందుకే ఆర్జించిన దానిలో అతను దాతృత్వ కార్యక్రమాలకు వెచ్చిస్తుంటాడు. 2003లో రోజర్ ఫెదరర్ ఫౌండేషన్ స్థాపించిన అతను.. పేద విద్యార్థులకు విద్య కోసం విరాళాలు అందిస్తున్నాడు. కత్రియా తుపాను, 2004 సునామి, 2010 హైతి భూకంపం లాంటి ప్రకృతి విపత్తులు వచ్చిన సందర్భంలో రోజర్.. తన ఫౌండేషన్ ద్వారా బాధితులను ఆదుకున్నాడు.

కొసమెరుపు: ఫెదరర్, అతని భార్య మిర్కాది టెన్నిస్ బంధం. వీళ్లిద్దరు కలిసి స్విట్జర్లాండ్‌కు మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రాతినిధ్యం వహించారు. తొలిసారి 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో కలిసి ఆడినప్పుడే వీళ్ల మధ్య ప్రేమ చిగురించింది. పాదం గాయం కారణంగా ఆమె 2001 వరకు మాత్రమే టెన్నిస్ ఆడింది. ఆ తర్వాతే ఆమె రోజర్‌కు మేనేజర్‌గా మారింది. 2009లో ఫెదరర్-మిర్కా వివాహం ద్వారా ఒకటయ్యారు.

– దాస్యం వెంకట వంశీకృష్ణ

ఫెదరర్ ముందున్న లక్ష్యాలు

1. ప్రపంచ నంబర్‌వన్ అయిన పెద్ద వయస్కుడిగా అగస్సీ (33 ఏళ్లు) పేరిట ఉన్న రికార్డును అధిగమించడం
2. జిమ్మి కానర్స్ (109 టైటిళ్లు) సాధించిన ఓవరాల్ టైటిళ్ల రికార్డు అధిగమించడం
3. మార్గరేట్ కోర్టు (24, అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు)ను దాటడం
4. ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలవడం



ఆ పిల్లల కోసం..

ఫెదరర్‌కు నలుగురు పిల్లలు. అందరూ కవలలే. 2009లో అమ్మాయిలు మైలా రోజ్, చార్లీ రివా పుడితే.. 2014లో అబ్బాయిలు లియో, లెనె జన్మించారు. తానెంత పెద్ద ఆటగాడు అయినా వీరిని వదిలి రెండు వారాలకు మించి ఉండనని.. వీలైనంత ఎక్కువగా దగ్గరుండి చూసుకుంటూ ఉండడం తనకు ఇష్టమని రోజర్ చెప్పాడు. తనలా తన పిల్లలు టెన్నిస్ ఆడటాన్ని ఇష్టపడనని.. అయితే వారికి పూర్తి స్వేచ్ఛ ఇస్తామని చెప్పాడు. తనలా తన పిల్లలు 25 ఏళ్లు ప్రయాణాల్లోనే గడపడం మాత్రం ఇష్టం లేదనేది రోజర్ మాట.

ఈనాడు సినిమా

అనుభవం అభినయం


అనుష్క

కథానాయిక పాత్రలు ఆడిపాడటానికే పరిమితం అవుతున్నాయనే మాటల్ని వింటూనే ఉంటాం. తెలుగు సినిమాల్లో కథానాయకుడి పాత్రే కీలకం కావడంతో పాటు... ఇక్కడ వాణిజ్య ప్రధానమైన చిత్రాలే ఎక్కువగా తెరకెక్కుతుండడంతో సహజంగానే కథానాయిక పాత్ర ప్రాధాన్యం తగ్గిపోతుంటుంది. అగ్ర కథానాయికలు సైతం పెద్దగా ప్రాధాన్యం లేని పాత్రల్లో మెరుస్తూ అందచందాలతోనూ... డ్యాన్సులతోనూ ఆకట్టుకోవాల్సిన పరిస్థితి. అలాగని తెలుగు కథా నాయికని తక్కువగా అంచనా వేయకూడదు. సరైన అవకాశం లభించిందంటే ఆకాశమే హద్దుగా చెలరేగిపోతుంటారు. అగ్ర కథానాయికలైతే ఆ విషయంలో ఓ అడుగు ముందే ఉన్నారు. తమ అనుభవాన్నంతా రంగరించి క్లిష్టమైన పాత్రల్ని సైతం రక్తికట్టిస్తున్నారు. ఈమధ్య అగ్ర కథానాయికల అనుభవమే పలు చిత్రాలకి ప్రాణం పోసింది. దర్శకరచయితల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాత్రల్లో ఒదిగిపోయి చిత్ర విజయాలకి కారణమవుతున్నారు. తెలుగు సినిమా కథలు కథానాయకుల చుట్టూనే తిరుగుతున్నప్పటికీ, అందులో నాయికకీ తగినంత ప్రాధాన్యం లభిస్తోంది. అందుకే మాకూ బలమైన పాత్రలు లభిస్తున్నాయని ఈమధ్య కథా నాయికలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అందివచ్చిన ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలోనూ వాళ్లు ముందున్నారు. నటిగా పేరు తీసుకొచ్చే పాత్ర అనేసరికి తమ శక్తినంతా ధారపోస్తున్నారు. ఆ ప్రయత్నం దర్శకరచయితలకి మరింత ఉత్సాహాన్నిస్తోంది. మరికొన్ని కొత్త పాత్రల్ని సృష్టించడానికి కారణమవుతోంది.

ఈమధ్యే ప్రేక్షకుల ముందుకొచ్చిన 'భాగమతి'లో అనుష్క రెండు కోణాల్లో సాగే పాత్రలో సందడి చేసింది. ఐఏఎస్ చంచలగా ఎంతో హుందాగా కనిపించిన అనుష్క, భాగమతిగా భయపెడుతూ తన నటనలోని రెండో కోణాన్ని కూడా ప్రదర్శించింది. 'భాగమతి'ని చూస్తే ఆ కథని, పాత్రల్ని అనుష్క స్థాయిలో మరొకరు అర్థం చేసుకోలేరేమో అనిపించింది. అంతగా కథలో ఒదిగిపోయిందామె. సంక్రాంతి సందర్భంగా విడుదలైన 'జై సింహా'లో నయనతార పాత్ర పరిధి తక్కువే. కానీ ఉన్నంతలో ఆ పాత్రని తన అనుభవంతో రక్తికట్టించింది నయనతార. బాలకృష్ణతో కలిసి మంచి కెమిస్ట్రీని పండించింది. గతేడాది విడుదలైన 'నేనే రాజు నేనే మంత్రి'లో కాజల్ నటన కూడా ఆమె అనుభవానికి అద్దం పట్టేదే. రాధ పాత్రలో చక్కటి భావోద్వేగాలు పలికించి చిత్ర విజయంలో కీలక పాత్ర పోషించింది. 'గౌతమీపుత్ర శాతకర్ణి'తో శ్రియ తనలో ఎంత మంచి నటి ఉందో మరోసారి చాటి చెప్పింది. త్వరలో విడుదల కాబోతున్న 'గాయత్రి'తోనూ మరోసారి ఆకట్టుకొంటానని చెబుతోంది. కొంత కాలంగా బలమైన పాత్రలపైనే దృష్టిపెడుతూ ప్రయాణం చేస్తున్న సమంత 'రాజు గారి గది2'తో ఆకట్టుకుంది. అమృతగా ఆమె అభినయం సినిమాకే హైలెట్‌గా నిలిచింది. త్వరలోనే 'రంగస్థలం'తో మురిపించబోతోంది. కథ వాణిజ్య ప్రధానంగా సాగినా... కథానాయిక ప్రాధాన్యంతో కూడుకొన్నదైనా తన ప్రభావాన్ని స్పష్టంగా చాటి చెబుతుంటుంది తమన్నా. ఆమె ప్రస్తుతం 'క్వీన్'లో నటిస్తోంది. వీళ్లందరి ప్రయాణాన్ని గమనిస్తే అనుభవాన్ని ఎంతగా రంగరిస్తున్నారో స్పష్టంగా అర్థమవుతోంది. కొత్త కథానాయికల జోరు పెరిగే కొద్దీ, అగ్ర కథానాయికలు తెర మరుగు కావడం సహజం. కానీ తెలుగు చిత్రసీమలో ఈమధ్య ఆ ధోరణి కనిపించడం లేదు. అగ్ర కథానాయికల అనుభవానికి తగ్గట్టుగా పాత్రలు సిద్ధమవుతుండడంతో వాళ్లు ఆ సవాల్‌ని స్వీకరిస్తూ కెరీర్‌ని మరింత ఉత్సాహంగా ముందుకు తీసుకెళుతున్నారు. అనుభవం వల్ల పాత్రల్ని మరింత బాగా అర్థం చేసుకోగలుగుతున్నామని కథానాయికలు చెబుతున్నారు. "అనుభవానికి మించిన పాఠం మరొకటి లేదు. ప్రతి సినిమా కూడా ఓ కొత్త సవాల్‌ని ముందుంచుతూ కొత్త విషయాల్ని నేర్పిస్తుంటుంది. దాంతో కథ విన్నప్పుడు పాత్రలు ఎంత క్లిష్టంగా అనిపించినప్పటికీ చేయగలననే ఓ ఆత్మవిశ్వాసం కలుగుతుందంటే కారణం అనుభవమే" అని చెప్పుకొచ్చింది అనుష్క.


సమంత


నయనతార


కాజల్


తమన్నా

కలో.. నిజమో!

'జ్ఞాపకాలు చెడ్డవైనా.. మంచివైనా ఎప్పుడూ మనతోనే ఉంటాయి. మోయక తప్పదు' అంటున్నాడు వరుణ్‌తేజ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'తొలి ప్రేమ'. రాశీ ఖన్నా కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ నెల 10న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'కలలా నా జీవితంలోకి వచ్చావు... కలగంటున్నప్పుడు వెళ్లిపోయావ్... మళ్లీ ఇన్నాళ్లకు మెరిశావ్, కలో.. నిజమో అర్థం కావడం లేదు' అంటూ సాగే సంభాషణలు ట్రైలర్‌లో వినిపించాయి. మూడు దశల్లో సాగే ప్రేమకథతో తెరకెక్కిన ఈ చిత్రంలో వరుణ్‌తేజ్ ఆదిత్యగా, రాశీ ఖన్నా వర్షగా కనిపించబోతున్నారు. సంగీతం: తమన్.


రాశీ ఖన్నా, వరుణ్‌తేజ్

అందుకే మోహన్‌బాబు ఇష్టపడ్డారు!

"మంచి సినిమా చేశానా? లేదా? అనేదే నాకు ప్రామాణికం. దర్శకుడిగా ఒక మంచి కథని చెప్పడంపైనే నా దృష్టి. అందుకే ఎప్పుడూ సంఖ్య గురించి ఆలోచించలేదు'' అన్నారు మదన్. రచయితగా, దర్శకుడిగా పలు విజయాల్ని సొంతం చేసుకొన్న ఆయన ఇటీవల 'గాయత్రి' తెరకెక్కించారు. మోహన్‌బాబు ప్రధాన పాత్రధారిగా, మంచు విష్ణు, శ్రియ జంటగా నటించిన ఆ చిత్రం ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మదన్ శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...



● "మహానటులు ఎస్వీఆర్, ఎన్టీఆర్, ఏఎన్నార్, శివాజీ గణేశన్ వరసలో నిలిచే నటుడు మోహన్‌బాబు అనేది 'గాయత్రి'లోని ఆయన నటన ద్వారా మరోసారి స్పష్టమవుతుంది. ప్రతినాయక, కామెడీ పాత్రలు మొదలుకొని హుందాతనంతో కూడిన పలు పాత్రలు పోషించి మెప్పించిన నటుడాయన. ఇందులో రెండు పార్శ్వాలున్న పాత్రని పోషించి కథని మరో స్థాయికి తీసుకెళ్లారు. తండ్రీకూతుళ్ల మధ్య ఆద్యంతం భావోద్వేగభరితంగా సాగే విభిన్నమైన కుటుంబ కథా చిత్రమిది. మోహన్‌బాబు యువకుడిగా ఉన్నప్పటి పాత్రలో విష్ణు కనిపిస్తారు. అభినయ ప్రధానమైన పాత్రను శ్రియ పోషించింది. కథలో అనూహ్య మలుపులున్నాయి. ఆడపిల్ల ప్రాముఖ్యతని ఇందులో చెప్పాం. అమ్మాయి పాత్ర పటిష్టంగా ఉన్నందుకే మోహన్‌బాబు ఇందులో నటించేందుకు ఇష్టపడ్డారు. డైమండ్ రత్నబాబు సిద్ధం చేసిన ఈ కథకి, పరుచూరి బ్రదర్స్ తుదిమెరుగులు దిద్దారు.

● "మోహన్‌బాబుతో సినిమా చేయడం నా అదృష్టం. పనిపట్ల అశ్రద్ధగా ఉండటాన్ని ఆయన ఏమాత్రం సహించరు. ఇది చూసే కొందరు ఆయనకి కోపం ఎక్కువ, ఆయనతో పనిచేయడం కష్టమని అంటుంటారేమో. నేను మాత్రం సులభంగా పనిచేశా. ఆయనకి అన్ని శాఖలపై సమగ్ర అవహన ఉంది. సెట్‌లో చిన్న, పెద్ద అని లేకుండా అందరినీ ఒకే రకంగా చూస్తారు. మంచి సలహా ఎవరు చెప్పినా స్వీకరిస్తారు. మంచి కథతో వస్తే మళ్లీ మనం కలిసి సినిమా చేద్దామని నాతో చెప్పారు. ఆ మాట సినిమా విడుదలకి ముందే గొప్ప విజయాన్ని ఆస్వాదించిన అనుభూతినిచ్చింది. కథతో పాటు, సంభాషణలు, తమన్ సంగీతం, సర్వేష్ మురారి కెమెరా పనితనం సినిమాకి బలాన్నిచ్చింది. ఈ యేడాది నా దర్శకత్వంలో మరో చిత్రం వస్తుంది".

ఇది నా పూర్వ జన్మ సుకృతం


కె.వి. రమణాచారి, అల్లాణి శ్రీధర్, సాయికుమార్, రామసత్యనారాయణ

సాయికుమార్ ప్రధానపాత్రలో అల్లాణి శ్రీధర్ దర్శకత్వంలో ఫిల్మీడియా ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై నిర్మించిన చిత్రం 'శ్రీ చిలుకూరి బాలాజీ'. ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న సందర్భంగా వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో సాయికుమార్ మాట్లాడుతూ "నా తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచి నాకు దేవుని పట్ల భక్తిని, చక్కటి తెలుగును నేర్పించారు. బాలాజీ స్వామి కథాంశంతో రూపొందిన ఈ చిత్రంలో నటించే అవకాశం రావడం నా పూర్వ జన్మ సుకృతం" అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి మాట్లాడుతూ "శ్రీధర్ మంచి సంకల్పంతో సినిమా రూపొందించారు. మన సంస్కృతిని ప్రతిబింబించే ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాల"న్నారు. చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన పూజారి మాట్లాడుతూ "ఈ సినిమాను భావి తరాలకు విలువలు నేర్పే విధంగా రూపొందించడం దేవుని సేవగా భావించవచ్చు"న్నారు. 'ఇందులో సాయికుమార్‌ది భక్తిపాత్రే అయినా అర్థవంతమైన ఆవేశం ఉంది. కె.వి. రమణాచారి ఈ చిత్రానికి ఆక్సిజన్ అందిస్తే.. దిల్‌రాజు, రామసత్యనారాయణ ఎలాంటి లాభాపేక్ష లేకుండా సినిమాను విడుదల చేశారు. స్కూల్ పిల్లలు ఈ సినిమాను విపరీతంగా చూస్తున్నారు. ఇది మాకెంతో ఆనందం కలిగిస్తోంద"న్నారు దర్శకుడు అల్లాణి శ్రీధర్. కార్యక్రమంలో వారణాసి రామచందర్, వంశీరామరాజు, రామసత్యనారాయణ, వడ్డేపల్లి కృష్ణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గీతోపదేశం

బతుకంటే బడి చదువా
అనుకుంటే అతి సులువా
పొరపడినా పడినా
జాలిపడదే కాలం మనలాగా
ఒక నిమిషం కూడా ఆగిపోదే
నువ్వొచ్చేదాకా

గీతం: నీ ప్రశ్నలు నీవే...
చిత్రం: కొత్త బంగారులోకం
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి
- పంపినవారు: కె.వినయ్ కుమార్, కడప

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

ఆకతాయి ప్రేమాయణం


నిత్య నరేష్, మానస్

మానస్, నిత్య నరేష్, కారుణ్య నాయకానాయికలుగా నటించిన చిత్రం 'సోడ గోలీసోడ'. మొత్తం గ్యాసే... అనేది ఉపశీర్షిక. మల్లూరి హరిబాబు దర్శకత్వం వహించారు. భువనగిరి సత్య సింధూజ నిర్మాత. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమలో పడిన ఒక ఆకతాయి అబ్బాయి కథ ఇది. తన మనసు దోచుకొన్న అమ్మాయివల్ల ప్రయోజకుడిగా మారిన వైనాన్ని వినోదాత్మకంగా చూపించాం. ఈ కథలో రైతుల్లో చైతన్యం నింపే నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ఆసక్తికరం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "గోలీ సోడలో అంతా గ్యాసే ఉంటుంది. అలా ఎప్పుడూ లేనిపోని గొప్పలు చెప్పుకొని తిరిగే కుర్రాడి జీవితం చుట్టూ తిరిగే కథ. బ్రహ్మానందం, అలీ, కృష్ణ భగవాన్, గౌతంరాజు, హైపర్ ఆది తదితరులు పండించిన హాస్యం కడుపుబ్బా నవ్విస్తుంది. ఈ నెలలోనే చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. "ఇందులోని నాలుగు పాటలకి భరత్ మధుసూదనన్ ఆహ్లాదకరమైన స్వరాల్ని అందించారు. ప్రేక్షకులకి నచ్చే అంశాలతో సందేశం ఇమిడిన వినోదాత్మక చిత్రంగా దర్శకుడు మలిచార"న్నారు ఎగ్జిక్యూటివ్ నిర్మాత శ్రీనివాసమూర్తి. "ప్రేమలో పడిన తర్వాత మంచివాడిగా మారిన అబ్బాయిగా నటించాను" అన్నారు మానస్.

జిమ్ వదిలేయ్ కత్రినా పెళ్లి చేసుకో ఆలియా


ఆలియాభట్, కత్రినాకైఫ్

కత్రినాకైఫ్, ఆలియా భట్... ఈ ఇద్దరూ బాలీవుడ్‌లో స్టార్ కథానాయికలే. అందం, నటన, హుషారెత్తించే స్టెప్పులతో కత్రినా అభిమానుల్ని ఉర్రూతలూగిస్తుంటే... బబ్లీ గర్ల్ పాత్రల్లో నటిస్తూ యువతరంలో క్రేజ్ సంపాదించుకొంది ఆలియాభట్. అన్నింటి కంటే మించి ఈ ఇద్దరూ మంచి స్నేహితులు. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా వీళ్లు ఇంత క్లోజ్ ఫ్రెండ్స్ ఎలా అయ్యారబ్బా అని చాలామంది బాలీవుడ్ నటులు ఆశ్చర్యపోతుంటారు. ఈ ఇద్దరూ కలిసి ఇటీవల ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ కత్రినా స్టెప్పులతో అదరగొట్టేసిన 'షీలా కీ జవానీ' పాట ప్రస్తావన తీసుకొచ్చింది వ్యాఖ్యాత. అప్పుడు ఆలియా స్పందిస్తూ "కత్రినా చాలా సెక్సీగా ఉంటుంది" అని చెప్పింది. వెంటనే కత్రినా "ఆలియా చాలా చాలా మంచి అమ్మాయి. స్నేహం చేయడంలో ఆమె తర్వాతే ఎవరైనా. ఆమె మనసు బంగారం" అంది. తర్వాత వీళ్ల మధ్య పెళ్లి, ప్రేమ అంశాలొచ్చాయి. అప్పుడు కత్రినాకు ఆలియా ఓ సలహా ఇచ్చింది. 'జిమ్ వదిలేసి కాస్త మగాళ్ల మీద దృష్టిపెట్టు కత్రినా' అంది ఆలియా. దానికి కత్రినా తెలివిగా సమాధానమిచ్చింది. 'నా కంటే ముందు ఆలియా పెళ్లి చేసుకుంటే చూడాలని నా కోరిక' అంది కత్రినా. అలా సరదా సరదాగా వీళ్ల సంభాషణ సాగిపోయింది.

'సీక్రెట్ సూపర్‌స్టార్'.. రూ.500కోట్లు


ఆమీర్ ఖాన్

'పీకె', 'దంగల్' చిత్రాలతో చైనాలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నాడు ఆమీర్‌ఖాన్. అందుకే ఇటీవల కాలంలో ఆయన నటించిన ప్రతి చిత్రాన్ని చైనాలోనూ విడుదల చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆయన నటించిన తాజా చిత్రం 'సీక్రెట్ సూపర్‌స్టార్'నూ ఇటీవలే చైనాలో విడుదల చేశారు. రూ. 24 కోట్లతో తెరకెక్కిన ఈ సినిమా తొలిరోజే రూ. 43 కోట్లు, మొదటి మూడు రోజుల్లో రూ.200 కోట్ల వసూళ్లతో అందరినీ ఆశ్చర్యపరిచింది. చైనాలో ఆమీర్‌ఖాన్‌కున్న క్రేజ్‌ను మరోసారి చాటి చెప్పింది. తాజాగా ఈ చిత్రం రూ.500 కోట్లు వసూళ్లతో మరో మైలురాయిని చేరుకుంది. ఈ సినిమా విడుదలై రెండు వారాలు గడుస్తున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద జోరు మాత్రం తగ్గడం లేదు. 'పీకె', 'దంగల్' చిత్రాలతో చైనాలో రూ.500 కోట్ల మార్కును అందుకున్న ఆమీర్ తాజాగా 'సీక్రెట్ సూపర్‌స్టార్'తో హ్యాట్రిక్ నమోదు చేశాడు.

'గున్న' ప్రాయపు స్నేహం..

సామ్రాట్, ప్రజ్ఞాత్, నిఖిల్, ఆర్మాన్, మెహక్, ఐశ్వర్య నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'గున్న'. కేఎస్వీ సమర్పణలో, సాలగ్రామ్ సినిమా పతాకంపై ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. కె.విప్లవ్ దర్శకులు. ఈ చిత్ర టైటిల్ లోగో, ప్రీ పోస్టర్‌ను దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు చేతుల మీదుగా హైదరాబాద్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "పసి వయసుకు, యుక్త వయసుకు మధ్య ఉండే గున్న ప్రాయంలోని కొందరి స్నేహితుల కథ ఇది. నటీనటుల ఎంపిక దాదాపుగా పూర్తయింది. మార్చి నుంచి షూటింగ్ ప్రారంభిస్తామ"న్నారు.

వారంలోపు చర్చలకి రావల్సిందే!


పి.కిరణ్

అధిక ధరలు వసూలు చేస్తూ నిర్మాతల్ని, పంపిణీదారుల్ని, ప్రదర్శనకారుల్ని దోచుకొంటున్న డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు వారం రోజుల్లో చర్చలకి రాకపోతే మార్చి 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్లు బంద్ చేయాలని నిర్ణయించినట్టు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు పి.కిరణ్ తెలిపారు. సినిమా ప్రదర్శన కోసం డిజిటల్ సర్వీసు ప్రొవైడర్లు వసూలు చేస్తున్న ఛార్జీలను నిరసిస్తూ ఇటీవల హైదరాబాద్‌లోని చలన చిత్ర వాణిజ్య మండలి కార్యాలయంలో తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ చిత్ర పరిశ్రమలకి చెందిన ప్రతినిధులంతా కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. తక్కువ ధరకే డిజిటల్ కంటెంట్‌ని సరఫరా చేసేందుకు కొన్ని సంస్థలు ముందుకొస్తున్నప్పటికీ... వాళ్లని రాకుండా పాత సంస్థలు అడ్డుకొంటున్నాయని చిత్ర పరిశ్రమల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ప్రదర్శనకారులతో కేవలం ఐదేళ్లకి మాత్రమే ఒప్పందం కుదుర్చుకొని యేళ్ల తరబడి అధికంగా ఛార్జీలు వసూలు చేస్తుండడం అన్యాయమని ఆరోపించారు. అందరి ఆమోదం మేరకు డిజిటల్ సర్వీసు ప్రొవైడర్లకి లేఖలు రాశామని, వాళ్లు వెంటనే ధరలు తగ్గించే దిశగా నిర్మాతలతో చర్చలకి రావాలని కిరణ్ కోరారు.

డబ్బున్న కుటుంబాల్లో పుట్టి... విలాసంగా జీవితాలు గడుపుతున్న వారికి ప్రజల సమస్యలు తెలుస్తాయా! సామాన్యుల బతుకు చిత్రంలో బాధలు కనిపిస్తాయా... అంటే అవునంటారు డాక్టర్ కావ్య, పద్మావతి. ఇద్దరి నేపథ్యాలు వేరైనా... స్పందించే గుణం వీరికి ఆభరణం. డాక్టర్ కావ్య... తెలంగాణలోని ఆడపిల్లలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. పద్మావతి విశాఖ జిల్లాలోని ధర్మసాగరం గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి మార్గంలో అడుగులు వేయిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమాలు వారి మాటల్లోనే...

ఒక్కటయ్యారు... చైతన్యం తెచ్చారు!





ఐదువేలమందికి ఉచితంగా...

ఈ ఏడాది నుంచీ తెలంగాణ ప్రభుత్వం కొన్నిప్రాంతాల్లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలూ, గురుకులాల్లో ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందించడానికి సిద్ధమైంది. దీనంతటికీ కారణం కావ్య. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి కూతురామె.

నెలసరి సమయంలో రక్తస్రావం కారణంగా తోటి విద్యార్థులు హేళన చేయడంతో ఓ అమ్మాయి ఆత్మహత్య చేసుకున్న వార్త నన్ను కదిలించింది. నెలసరి మీద సరైన అవగాహన లేక అనేకమంది మధ్యలోనే చదువు మానేయడం కూడా నాకు తెలుసు. నేను వైద్యురాలిని కావడంతో ఈ సమస్య తీవ్రతను ఇంకాస్త దగ్గరినుంచి చూశా. ఉస్మానియా, కాకతీయ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్నప్పుడు అనేక వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయాల్సి వచ్చేది. ఇందులో ఎక్కువ శాతం మహిళల గర్భసంచి వ్యాధులకు సంబంధించినవే. ముఖ్యంగా ఈ సమస్య గ్రామీణ ప్రాంత మహిళల్లో ఎక్కువ. పాఠశాల స్థాయిలోనే బాలికలకు ఈ విషయాలపట్ల పూర్తిగా అవగాహన కల్పించాలనుకున్నా. అందులో భాగంగానే నేను ప్రారంభించిన 'కడియం ఫౌండేషన్' ద్వారా పేద విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందించడం మొదలుపెట్టా.

స్కూళ్లకు వెళ్లేదాన్ని... ఈ కార్యక్రమాన్ని మొదట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలతో ప్రారంభించాం. క్రమంగా ఆదర్శ పాఠశాలలూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లేదాన్ని. అక్కడున్న విద్యార్థులకు నెలసరికి సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించేదాన్ని. వాళ్లకు అమ్మతో, స్నేహితులతో.. ఎలా చెప్పొచ్చో వివరించా. ఇప్పటివరకు ఐదు వేల మంది విద్యార్థినులకు ఒక ఏడాదికి సరిపోయే శానిటరీ న్యాప్‌కిన్లను ఉచితంగా అందించా. వరంగల్‌తో పాటు ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో కూడా ఈ కార్యక్రమాలు చేస్తున్నా.

ప్రభుత్వం కూడా... ఓ వైపు ఆ పనులు చేస్తూనే మా నాన్నకూ చెప్పేదాన్ని. దాంతో ప్రభుత్వం ఈ ఏడాది నుంచీ.. ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందించడానికి ముందుకు వచ్చింది. మహిళల్లో నెలసరి సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారం గురించీ అవగాహన కల్పిస్తున్నా. స్కాట్లాండ్ ప్రభుత్వం అక్కడి మహిళలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లను అందించడం మొదలుపెట్టింది. మన దగ్గరా అలాంటి మార్పు రావాలి. ఇక, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూనే రొమ్ము క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవడానికి ఏం చేయాలనేదీ వివరించేందుకు స్వచ్ఛంద సంస్థలతో కలిసి సదస్సులు నిర్వహించబోతున్నా. ఇకపైనా వీలైనంత ఎక్కువ మందికి నెలసరి మీద అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తూనే ఉంటా.

- జీవన్ కుమార్, న్యూస్‌టుడే వరంగల్ రూరల్





'స్వచ్ఛ' గ్రామం... ధర్మసాగరం!

ఆ గ్రామం పచ్చదనాల హారం. ఇంటింటికీ మరుగుదొడ్డీ సౌకర్యం, గ్రామంలోని అన్ని దారులను కలుపుతూ సిమెంట్ రోడ్లూ, ఎల్ఈడీ వెలుగులు.. ఇలా అన్నీ ప్రత్యేకతలే. ఇదంతా విశాఖ జిల్లాకు చెందిన ధర్మసాగరం సొంతం.

విశాఖపట్నం జిల్లా నర్సీపట్నానికి అయిదు కిలోమీటర్ల దూరంలోని ధర్మసాగరంలో 801 కుటుంబాలు ఉన్నాయి. దానికి ఇంకో ప్రత్యేకత కూడా ఉంది. అక్కడ సర్పంచితోపాటూ మిగతా వార్డు సభ్యులూ మహిళలే. జనాభా 2069. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామాల దత్తతకు పిలుపునిచ్చిన సందర్భంలో... రోడ్లు, భవనాల శాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలోని ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలని ఆయన కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నారు. మంత్రి సతీమణి పద్మావతి ధర్మసాగరాన్ని ఎంచుకున్నారు. దత్తత తీసుకున్నదే తడవుగా గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 164 మంది విద్యార్థులు ఉంటే.. వీరి కోసం డిజిటల్ తరగతులూ, శుద్ధజల ప్లాంటు ఏర్పాటు చేయించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత కింద ఎన్టీఆర్ సుజల కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. రెండు రూపాయల నాణెం వేస్తే 20 లీటర్ల నీళ్లొస్తాయి. ఊరంతా ఎల్ఈడీ దీపాలే!

పల్లె ప్రత్యేకతలు...! భర్త సహకారంతో, ప్రభుత్వ నిధులతో గ్రామంలో ప్రతి వీధికీ రోడ్డు వేయించారు. వాటికి ఇరువైపులా రెండువేలకు పైగా మొక్కలు పెంచారు. ప్రతి ఇంటికీ మరుగు దొడ్డి ఉంది. బహిరంగ మల విసర్జన రహిత గ్రామం (ఓడీఎఫ్)గా ఇది గుర్తింపు పొందింది. ఈ స్థాయికి తీసుకురావడానికి పద్మావతి అనేకసార్లు గ్రామంలో పర్యటించి ప్రజలను చైతన్యం చేశారు. అన్ని కుటుంబాలకు వంటగ్యాస్ సదుపాయం కల్పించారు. వంద ఎకరాలు విస్తీర్ణం కలిగిన పెద్దచెరువులో నీరు-చెట్టు కింద రూ.30 లక్షలతో పూడిక తీయించారు. నగదు రహిత లావాదేవీల్లో తొలుత స్పందించింది కూడా ఈ ఊరే! ఏడు దుకాణాలకు, రేషన్ డిపోతో పాటు ఆటోలకు ఈ-పాస్ పరికరాలు సమకూర్చారు. 487 మందికి కార్డులు ఉన్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకునేది కూడా ఈ గ్రామమే! ఇప్పటివరకు రూ. 7.80 కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేశారు.

వార్డు సభ్యులంతా మహిళలే... నర్సీపట్నం మండల పరిషత్ అధ్యక్షురాలు సుకల రమణమ్మదీ ఈ ఊరే. ఆమె తన సొంత నిధుల నుంచి రూ.2.50 లక్షలను వెచ్చించి ఊరంతా మైకులు ఏర్పాటు చేయించారు. ఏ సమాచారమైనా ఊరంతా తెలిసేలా ఈ మైకుల ద్వారా ప్రచారం చేస్తారు. స్కూల్లోని పిల్లలందరూ ఏ ఆటంకం లేకుండా చదువుకునేందుకు ఉచిత పుస్తకాలు ప్రతిఏటా అందిస్తారు. ఈ గ్రామ సర్పంచి నల్లబిల్లి సత్యవతితో పాటు ఎనిమిది మంది వార్డు సభ్యులు మహిళలే కావడం విశేషం.

ముఖ్యమంత్రి మెచ్చిన ఊరు... 'ఈ ఊరుచూస్తే ముచ్చటేస్తోంది. ఇక్కడే ఉండిపోవాలనిపిస్తోంది.' జన్మభూమి సందర్భంగా గతనెల ధర్మసాగరంలో నిర్వహించిన గ్రామ సభకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న మాటలివి. ముఖ్యమంత్రే ఈ గ్రామాన్ని చూసి ముగ్ధులయ్యారంటే ఈ గ్రామం ఏ మేరకు అభివృద్ధి చెందిందో సులభంగా అర్థం చేసుకోవచ్చు. నెల్లూరు జిల్లాలో నిర్వహించిన జన్మభూమి సభలోనూ సీఎం ధర్మసాగరాన్ని గుర్తుచేసుకోవడం విశేషం.

- సీహెచ్ రాము, ఈనాడు నర్సీపట్నం.

ఫ్యాషన్ పొరపాట్లు దిద్దుకుందామా..



మారుతున్న ట్రెండ్‌ని చెప్పేదే ఫ్యాషన్ అని మనకు తెలుసు. కానీ మనకు తెలియకుండానే దుస్తుల ఎంపిక నుంచీ చిన్నచిన్న పొరపాట్లు చేస్తుంటాం. అదే మన ఆహార్యంపై ప్రభావం చూపిస్తుంది. మరి వాటినీ సరిదిద్దుకుందామా...

- క్రీడలకూ, జిమ్‌కు వాడే బూట్లు సౌకర్యంగా ఉంటాయి కానీ.. అవి జీన్స్, స్కర్టులపై పనికిరావు. మిగతా సమయాల్లో ఆయా దుస్తులకూ, సందర్భానికి తగ్గట్లు చెప్పుల్ని మారుస్తూ ఉండాలి. బూట్లే వేసుకోవాలనుకుంటే.. రకరకాల డిజైన్లలో దొరికే వాటిని ఎంచుకోవచ్చు.
- నగల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న చిన్న సందర్భాలకు నగలు అతిగా వేసుకోకపోవడమే మంచిది. వీలైనంత సింపుల్‌గా ఉండాలి. అదే వివాహాది కార్యక్రమాలకు వెళ్లేటట్లయితే కాస్త ఎక్కువ వేసుకున్నా ఏ ఇబ్బందీ ఉండదు.
- ఫ్యాషన్ పేరుతో వదులుగా ఉండే దుస్తులు వేసుకోవడం వల్ల అందం పెరగకపోగా ఎబ్బెట్టుగా ఉంటుంది. అలాగని ఒంటికి పట్టినట్లుగా కూడా ఉండకూడదు. శరీరాకృతికి అతికినట్లు కాస్త వదులుగా ఉంటే చాలు.
- చిరుగుల జీన్స్ ఫ్యాషనే కానీ.. అన్ని సందర్భాలకు అది బాగోదు. స్నేహితులతో వెళ్లే పార్టీలకు అయితేనే నప్పుతుంది. అలాగే స్కిన్‌టైట్ జీన్స్‌కీ ఇదే వర్తిస్తుంది. అందరూ దాన్ని వేసుకోవాలనుకోవడం సరికాదు. బాగా సన్నగా ఉన్నవారికే అది నప్పుతుంది. మిగిలినవారు తమ శరీరాకృతీ, వయసును దృష్టిలో పెట్టుకుని జీన్స్ ఎంచుకోవాలి.
- దుస్తుల ఎంపికలో మ్యాచింగ్ ముఖ్యం. దాంతోపాటూ వాటికి మ్యాచింగ్‌గా వేసే చెప్పులు, హ్యాండ్‌బ్యాగు తదితర అలంకరణవస్తువులు కూడా మీకు నప్పుతాయో లేదో గుర్తించగలగాలి. దుస్తుల రంగులు ముదురువర్ణంలో ఉంటే, హ్యాండ్‌బ్యాగు లేత రంగులో ఉండాలి. లేతరంగు దుస్తులకు బ్యాగు ముదురు రంగులో ఉంటే సరిగ్గా నప్పుతుంది.

బంగారం వెండి

2 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,500	31,450	30,100	30,150
ఆర్నమెంట్	29,420	29,300	28,800	28,900
వెండి (కిలో)	40,380	40,500	40,800	41,000
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,100	30,850	31,180	30,930
ఆర్నమెంట్	28,800	28,550	29,180	28,930
వెండి (కిలో)	40,500	40,500	39,800	39,700
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	31,450	30,930	-------	-------
ఆర్నమెంట్	29,250	28,770	2,918	2,893 గ్రా
వెండి (కిలో)	41,500	41,500	42.50	42.40 గ్రా

క్యాన్సర్ అంటున్నారు... భయంగా ఉంది!

? నా వయసు నలభై. ఆరునెలలుగా మలంలో రక్తం కనిపిస్తోంది. మొదట పైల్స్ అని తేలిగ్గా తీసుకున్నా కానీ.. ఎంతకీ తగ్గకపోయేసరికి డాక్టర్ దగ్గరకు వెళ్లా. పరీక్షలు చేసి పెద్దపేగు క్యాన్సర్ అనీ, శస్త్రచికిత్స చేయించుకోవాలని చెబుతున్నారు. నాకేమో భయంగా ఉంది. **- ఓ సోదరి**

✔ కొందరు మీలానే నిర్లక్ష్యం చేసి, క్యాన్సర్ చివరిదశలో ఉన్నప్పుడు డాక్టర్ దగ్గరకు వస్తుంటారు. పెద్దపేగు క్యాన్సర్ అంటున్నారు కాబట్టి.. అది పెద్దపేగులోని ఏ భాగంలో ఉందనేది తెలుసుకోవాలి. ఇందుకోసం వైద్యులు కొలనోస్కోపీ చేస్తారు. దాన్ని బట్టి క్యాన్సర్ గడ్డ ఎన్ని సెంటీమీటర్లు ఉందీ.. అదీ అడుగునా, పైనా అనేది నిర్ధరిస్తారు. ఆ తరువాత శస్త్రచికిత్సతో దాన్ని తొలగించి, రెండువైపులా ఉండే టిష్యూలను కూడా తీసేసి, పెద్దపేగును సరి చేస్తారు. అయితే ఆ తరువాత కీమో, రేడియో థెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా మలంలో రక్తం పడినా, మలబద్ధకం సమస్య విపరీతంగా ఉన్నా, మలవిసర్జనలో తేడా కనిపించినా... నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి.

డియర్ వసుంధర



డా॥ గీతానాగశ్రీ
క్యాన్సర్ శస్త్రచికిత్సా నిపుణురాలు

నజరానా

కప్పు గోరు వెచ్చని నీళ్లలో మూడు లేదా నాలుగు చుక్కల లవంగం నూనెను కలపాలి. రోజుకు నాలుగు సార్లు నోట్లో వేసుకుని పుక్కిలిస్తే నాలుకపై వచ్చిన పుండ్లు తగ్గుముఖం పడతాయి.

మిలినియల్స్ పాస్‌వర్డ్ సులభం

లైట్ తీస్కొకు



అవును మిలినియల్స్ పాస్‌వర్డ్‌లు కఠినంగా పెట్టుకోవడానికి ఇష్టపడటం లేదట. బయోమెట్రిక్ వచ్చాక దానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న వీరు పాస్‌వర్డ్‌లు సులభంగా పెడుతున్నారని, ఇది సైబర్ నేరగాళ్లకు ఒక రకంగా వరంగా మారిందని ఐబీఎం సెక్యూరిటీ నిర్వహించిన ఫ్యూచర్ ఐడెంటిటీ స్టడీలో వెల్లడైంది. 75 శాతం మంది యువత బయోమెట్రిక్ (వేలిముద్ర పాస్‌వర్డ్)కు మొగ్గుచూపుతున్నారని ఈ సర్వే తెలిపింది. 50 శాతం కంటే తక్కువ మందే కఠినంగా పాస్‌వర్డ్‌లు క్రియేట్ చేస్తున్నారని తేల్చారు.

దావోస్‌లో తెలుగు తేజాలు

స్విట్జర్లాండ్‌లోని దావోస్.. అక్కడ ఇటీవలే జరిగిన ప్రపంచ ఆర్థికసదస్సుకు మహామహులు తరలివచ్చారు.. అందులో అందర్నీ ఆకర్షించిన ముగ్గురు యువతేజాలు మన తెలుగువాళ్లే! ఒకరు ప్లాస్టిక్‌వ్యర్థాలను పునర్వినియోగంలోకి తీసుకొచ్చే ప్రక్రియను వివరించారు. ఇంకొకరు పరిశ్రమలకు సరఫరా చేసే సహా ఉత్పత్తులు ఎంత కీలకమో చెప్పుకొచ్చారు. మూడో వ్యక్తి.. నరకప్రాయం అవుతున్న నగరజీవితాలను ఎలా బాగుచేసుకోవాలో సలహాలు అందించారు. దావోస్‌కు వెళ్లిన ఆ ముగ్గురే వీరు..



బస్సుల్లోనో రైల్లోనో వెళుతూ ఒక బాటిల్ నీళ్లు కొనుక్కుంటాం. దప్పిక తీర్చుకుని ఖాళీ బాటిల్ రోడ్డుపక్కన పడేస్తాం. ఒకటి రెండు కాదు. లక్షల బాటిళ్లు కాలుష్యానికి కారణం అవుతున్నాయి. కంప్యూటర్, ల్యాప్‌టాప్, ప్లాస్టిక్ పైపులు, గృహసామగ్రి, కుర్చీలు, బిందెలు.. ఒక్కటేమిటి? మన దైనందిన జీవితం మొత్తం ప్లాస్టిక్‌తోనే ముడిపడి ఉంది. టన్నుల కొద్దీ గుట్టలుగా పేరుకుపోతోంది. అలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలను మళ్లీ రీసైక్లింగ్ చేసి.. పునర్వినియోగంలోకి తీసుకొస్తోంది బన్‌యన్ నేషన్. హైదరాబాద్‌కు చెందిన ఈ సంస్థ సహవ్యవస్థాపకుల్లో ఒకరు మని వాజ్‌పేయ్. వరంగల్‌లోని ఎన్ఐటిలో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పట్టభద్రుడైన ఈయన సాంకేతికతను అందిపుచ్చుకున్న నైపుణ్యవంతుడు. భవిష్యత్తును ముందే అంచనావేసి.. ప్లాస్టిక్‌వ్యర్థాలతో కుస్తీపట్టే సంస్థకు ప్రాణం పోశాడు. డెలివేర్ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ డిగ్రీ పూర్తి చేశాడు. యుసి బార్క్‌లీ, కొలంబియా బిజినెస్ స్కూల్‌లలో డ్యూయల్ ఎంబీఏ పూర్తి చేశాడు. ప్రముఖ ఐటీ సంస్థ క్వాల్‌కం ఇంక్‌లో కొంత కాలం పనిచేశాడీయన. డిజైన్, డెవలప్‌మెంట్, టెస్టింగ్, మొబైల్ టెక్నాలజీలలో అనుభవజ్ఞుడు. అనంతరం పర్యావరణహిత సంస్థను పెట్టాలన్న ఆలోచనతో 'బన్‌యన్ నేషన్' నెలకొల్పాడు. ఈ సంస్థ ప్రపంచ ఆర్థిక సదస్సులో డెల్ పీపుల్స్ చాయిస్ అవార్డును అందుకున్న తొలి భారతీయ సంస్థ. ప్లాస్టిక్ వ్యర్థాల్లోని రంగు, ఇంక్, కోటింగ్, ఇతర రసాయనాలను తొలగించి.. తిరిగి వినియోగించుకునే శుద్ధ ప్లాస్టిక్‌ను తయారుచేస్తుందీ సంస్థ. దావోస్‌లో అవార్డును అందుకోవడం భారతీయ సంస్థలకు ప్రోత్సాహాన్ని అందించినట్లయిందని చెప్పాడు వాజ్‌పేయ్.

మేము సైతం



ప్రపంచ ప్రగతికి కొత్త ఆలోచనలు కావాలి. ప్రైవేటు సంస్థలు, ప్రభుత్వాలు, మేధావులు కలిస్తేనే ఆ ఉజ్వల భవిష్యత్తు సాధ్యం అవుతుంది అంటున్నారు హర్షవర్ధన గౌరినేని. అమరరాజ గ్రూప్ సంస్థల వ్యాపార కుటుంబంలో పుట్టిన హర్ష కెరీర్‌లో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. అతను పర్డ్యు విశ్వవిద్యాలయంలో సైకాలజీ చదువుకున్నాడు. ఆరోగ్య సంరక్షణ, వైద్య పరికరాలు, ఉత్పత్తి నిర్వహణలతోపాటు ఫిట్‌నెస్ రంగంలోనూ కృషి చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్, తిరుపతిల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న మంగల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. దావోస్‌లో నిర్వహించిన ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనే అవకాశం రావడం అరుదైనది. అంతర్జాతీయస్థాయి మేథోవర్గాలను కలుసుకునేందుకు అదో చక్కటి వేదిక అన్నారు. మంగల్ సంస్థ పర్యావరణహితాన్ని దృష్టిలో పెట్టుకుని వస్తువులను ఉత్పత్తి చేస్తోంది. నట్లు, బోల్టులు, షీట్‌మెటల్స్, ప్లాస్టిక్ ఉత్పత్తిలో సత్తా చాటుతోంది.



ప్రపంచవ్యాప్తంగా నగరాలన్నీ నరకకూపాల్లా మారుతున్నాయి. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, తీవ్ర కాలుష్యం.. ఇవన్నీ సగటు ఆయుఃప్రమాణాలను దెబ్బతీస్తుండటం దారుణం. నగరజీవుల నాణ్యమైన జీవితం కోసం స్థానిక సంస్థలు, ప్రభుత్వాలు ఏం చేయాలన్న చర్చ ప్రపంచవ్యాప్తంగా నడుస్తోంది. ఇప్పుడు అదే చర్చను దావోస్‌లోనూ లేవనెత్తారు మన తెలుగు అమ్మాయి దీపిక ప్రసాద్. హైదరాబాద్‌కు చెందిన ఈ సివిక్ ఎంటర్‌ప్రెన్యూర్ బిగ్‌ఐడియాస్ పేరుతో జరిగిన చర్చలో మాట్లాడారు. 'భారతదేశంలో ప్రతి గంటకు 1800 మంది నగరాలకు వలస వస్తున్నారు. వీళ్లందరూ మెరుగైన ఉపాధి అవకాశాల కోసం వస్తున్న వాళ్లే! అయితే నగరాల్లో నాణ్యమైన జీవితానికి దూరం అవుతున్నారు. దిల్లి, బెంగళూరు వంటి నగరాల్లో అయితే జీవితం సంక్లిష్టంగా మారింది' అన్నది దీపిక అభిప్రాయం. నివాసయోగ్యమైన నగర నిర్మాణాల కోసం కృషి చేస్తున్నారీమె. లకీర్ అనే సంస్థ సహ వ్యవస్థాపకులుగా వివిధ వేదికల మీద తన ఆలోచనలను పంచుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో సానుకూల మార్పునకు దోహదం చేస్తున్న గ్లోబల్ షేపర్స్ కమ్యూనిటీలోను సభ్యురాలు. ఇందులో 150 దేశాలకు చెందిన 7 వేల మంది యువ సభ్యులు ఉన్నారు.

మనసులోమాట

..కానీ, మాట్లాడు సౌమ్యా!

ఆ రోజు సాయంత్రం ఆరుగంటలు. నా బెస్ట్‌ఫ్రెండ్ సోదరి దేవి నుంచి ఓ మెసేజ్ వచ్చింది.. 'మా ఇంటికి వచ్చిందే ఆ అమ్మాయి ఎలా ఉంది?' అని. నిన్ననే వాళ్లింటికి వెళ్లొచ్చాను. బంధువుల అమ్మాయి వచ్చింది. మాటల్లో వర్ణించలేనంత అందంగా ఉంది. మా ఇద్దరి తొలిచూపులు కలిశాయేమో అన్నంతగా డిస్టర్బ్ అయ్యాను. నేను దేవికి రిప్లయి ఇస్తూ 'అదేం ప్రశ్న. నువ్వు అలా అడక్కూడదు' అని మెసేజ్ ద్వారా చెప్పాను. 'చెప్పు ఫర్లేదు' అంది మళ్లీ. 'మనమిలా మెసేజ్‌లతో అమ్మాయి మీద కామెంట్లు చేసుకుని.. డిస్టర్బ్ చేయడం సరికాదు' అన్నాను. ఆఖర్న 'యువార్ గుడ్ బాయ్' అంది. అంతలోపే 'దీసీజ్ నాట్ దేవి.. ఐ యామ్ సౌమ్య. ఇందాక జరిగిన స్టోరీ అంతా నాదే!' అంటూ పెద్ద జలక్ ఇచ్చింది. 'అవునా, హాయ్ ఎలా ఉన్నారు' అంటూ పలకరించా. 'దేవి పేరుతో మీరెందుకు నాకు మెసేజ్‌లు పెట్టారు' అనడిగాను. 'ఏం లేదు.. నా పట్ల నీ క్యారెక్టర్ ఎలా ఉందో తెలుసుకుందామని' అంటూ చెప్పింది. కించిత్ కోపం కలిగింది. 'నా క్యారెక్టర్ నువ్వు డిసైడ్ చేయడమేంటి' అన్నాను. నాతో ఎందుకిలా ఆడుకుందంటూ.. మరో మిత్రుడితో మెసేజ్‌ల ద్వారా బాధను పంచుకున్నాను. కొత్తగా వచ్చిన అమ్మాయికి



పడిపోతానని.. ఇలా చేసిందేమో అనుకున్నాను. సౌమ్య మంచిది కాదని భ్రమపడ్డా. ఆ తరువాత రోజు కలిసి మాట్లాడుకున్నాం. 'ఏంటి అలా మెసేజ్‌లు చేయొచ్చా. అందులో అమ్మాయివి' అన్నాను. ఏం మాట్లాడలేదు. 'సెల్‌ఫోన్ మెసేజ్‌లతో ఒక వ్యక్తిలోని మంచిచెడ్డలను నిర్ణయించలేం' అన్నాను. 'అవును, నువ్వు చెప్పింది నిజమే'నని ఒప్పుకుంది. ఆమె క్యారెక్టర్ ఏమంత మంచిది కాదని నా ఫ్రెండ్‌కు మెసేజ్‌లు పంపుతూనే ఉన్నాను. మరోవైపు సౌమ్యతో ఎంగేజ్ చేస్తూనే ఉన్నాను. రాత్రింబవళ్లు మా ఇద్దరి ఫోన్లు బిజీ బిజీ. అప్పుడప్పుడు దేవితో కలిసి తను మా ఇంటికి వచ్చేది. ఒక రోజు 'నేను నీకు నచ్చానా.. నా నుంచి ఏం కోరుకుంటున్నావు' అంది. నేను వేరేలా అనుకుని.. 'డియర్, నాకు ఒక ముద్దు కావాలి' అనడిగేశా. అటు నుంచి సమాధానం లేదు. కాసేపు భయమేసింది. వెంటనే క్షమించమన్నా. చాలా ఫీల్ అయ్యింది. తప్పుగా భావించానేమోనని నాలో నేనే పశ్చాత్తాపడ్డాను. అప్పటి వరకు ఆమె మీదున్న అభిప్రాయం మారింది. నా ఫ్రెండ్‌కు నెగిటివ్ మెసేజ్‌లకు బదులు పాజిటివ్ మెసేజ్‌లు పంపడం మొదలుపెట్టాను. ఒకరికి ఒకరం ప్రేమ తెలియపరచక ముందే విడిపోయే కాలం వచ్చింది. 'రేపు మా ఊరికి వెళుతున్నాను. నా మీద నీ అభిప్రాయం చెప్పు' అంది. 'సరే, రేపు ఉదయం మాట్లాడదాం' అంటూ పొద్దున్నే వెళ్లి కలిశాను. మాటల్లో సరదాగా నా సెల్ లాక్కుంది. తన గురించి నా ఫ్రెండ్‌కు పంపిన నెగిటివ్ మెసేజ్‌లన్నీ చూసింది. 'నన్ను ఇంత చెడుగా భావించావా? ఈ మెసేజ్‌లు చాలా నీచంగా ఉన్నాయి. నిన్ను ప్రేమిస్తే నా జీవితం నాశనం అయ్యేది. ఛీ.. ఛీ..' అంటూ వెళ్లిపోయింది. నా గుండె బద్దలైంది. తనను మోసం చేయాలనుకోలేదు. చెడు మెసేజ్‌లను డిలీట్ చేసినా సరిపోయేది. అంతటితో ఇద్దరం దూరమయ్యాం. దేవిని బతిమాలి సౌమ్య ఫోన్‌నెంబర్ తీసుకున్నాను. ఎన్నిసార్లు ఫోన్ చేసినా వినలేదు. తనకంటే నేనే ఎక్కువ బాధపడ్డా. ఎంత కుమిలిపోతున్నానో ఆ దేవునికే తెలియాలి. తను నన్ను ప్రేమించకున్నా ఫరవాలేదు. నా గోడు వింటే చాలని ఆరాటపడ్డాను. సమయాన్ని వెనక్కి తిప్పాలి అనిపించేది. రెండేళ్లు అవుతోంది. నరకం చూస్తున్నా. కనీసం ఇది చూసైనా నీ గుండె కరిగితే చాలు.. ప్లీజ్ సౌమ్యా.. తప్పు నాదే! కానీ, ఉద్దేశ్యపూర్వకంగా చేయలేదు. ఏదో కోపంలో అలా జరిగిపోయింది. నీ దగ్గర నా ప్రవర్తనలో మార్పు లేదు కదా! అదైనా గమనించు. ప్రేమించడం తప్పు కాదు.. ప్రేమించగలగడం గొప్ప. శిక్షించు.. వీలైతే క్షమించు.. కానీ, మాట్లాడు సౌమ్యా!

–వెంకేష్, నాగసముద్రం, మంచిర్యాల



ఆకలి అంచుల నుంచి మొదలైన ప్రయాణం... అతన్ని అత్యున్నత శిఖరాలకు చేర్చింది. పరిశోధనకు అతను పడిన కష్టం... తలరాతను మార్చడమే కాదు అతన్ని ఉన్నత స్థానంలో నిలిపింది. ఆన్‌లైన్ వ్యాసాల ప్రచురణ... అతన్నో వ్యాపారిగా మార్చింది. ఆ ఆలోచనేంటి? ఆయనెవరు.. ఎలా ఎదిగారు?

కాలే కడుపుతో కోట్లకు అధిపతి

బడికి వెళ్లాలంటే ప్రతి రోజు రానుపోను పదిహేను కిలోమీటర్ల దూరం నడవాలి. దారిలో ఏరు పొంగితే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆ ఏరు దాటాలి. పోని డబ్బున్న కుటుంబమా అంటే.. నెలనెలా అతనికొచ్చే ఉపకార వేతనమే అతని ఆధారం. ఇది శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం అల్లెనకు చెందిన గేదెల శ్రీనుబాబు నేపథ్యం. అయిదో తరగతి వరకు అన్ని కష్టాలూ పడి చదువుకున్నాడు. ఓ పక్కన పేదరికం ఎన్ని కష్టాలు పెడుతున్నా తట్టుకుని విశాఖ వర్సిటీలోనే బీఫార్మసీ చేశాడు. ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి ఇచ్చే రూ.700 ఉపకారవేతనంతో నెట్టుకొచ్చేవాడు. ఆ డబ్బుతోనే బయోటెక్నాలజీలో ఎం.టెక్ చేశాడు. అతని జీవితం మలుపు తిరిగింది మాత్రం.. మధుమేహాన్ని ముందే కనుక్కోవచ్చా? అనే ఆలోచనతోనే. ఈ అంశంపై అతను పీహెచ్‌డీ పరిశోధన మొదలెట్టాడు. ఆరోగ్యంగా ఉండే వ్యక్తి నుంచి రక్త నమూనా తీసుకుని.. ఆ ప్రొటీన్లలో వచ్చే మార్పులు అంచనావేసి భవిష్యత్తులో ఆ వ్యక్తికి మధుమేహం వచ్చే అవకాశం ఉందో, లేదో చెప్పొచ్చు. ఇదే శ్రీను పరిశోధన అంశం. ఈ క్రమంలో అతనిచ్చిన సూచనలు విలువైనవి కావడంతో యువ శాస్త్రవేత్త అవార్డు వచ్చింది. 2017లో దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఈ అవార్డు అందుకున్నాడు శ్రీనుబాబు.

అవస్థ నుంచే అవకాశం...

పీహెచ్‌డీ చేస్తున్నప్పుడు పరిశోధనాత్మక సమాచారం కోసం అతను చేయని ప్రయత్నం లేదు. ఎందుకంటే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆ సమాచారం అందుబాటులో ఉండేది కాదు. దాంతో హైదరాబాదులోని సెంటర్ ఫర్ సెల్యులర్ మాలిక్యులర్ బయోలజీ (సీసీఎంబీ), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లకు వెళ్లి.. తీసుకోవాల్సి వచ్చేది. అయితే ఇది తన సమస్య మాత్రమే కాదని యువశాస్త్రవేత్త అవార్డు అందుకోవడానికి సియోల్ వెళ్లినప్పుడు తెలుసుకున్నాడు. అభివృద్ధి చెందిన దేశాల నుంచి వచ్చిన విద్యార్థులు, యువ శాస్త్రవేత్తలది కూడా ఇదే సమస్య అని తెలుసుకున్నాడు. ఉన్నా... ఎంతో కొంత డబ్బు చెల్లించి వైద్య పత్రికల నుంచి తీసుకోవాల్సి వచ్చేది. ఒక వ్యాసం కావాలంటే సుమారుగా రూ.4-5 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇది పేద విద్యార్థులకు పెద్ద విషయమే. ఎవరైనా.. ఎక్కడి నుంచైనా సరే ఉచితంగా ఎందుకు సమాచారం డౌన్‌లోడ్ చేసుకోకూడదనే ఆలోచన అప్పుడే వచ్చింది శ్రీనుబాబుకి. అది తర్వాతి కాలంలో వ్యాపారంగా రూపు దాల్చింది.

2007లో మొదలు...

'జర్నల్ ఆఫ్ ప్రొటియోం' అంటే హ్యూమన్ ప్రొటీన్స్ అంతటినీ అధ్యయనం చేసే సబ్జెక్టు. మన శరీరంలోని ప్రతి కదలికకు ప్రొటీన్సే కీలక పాత్ర పోషిస్తాయి. ఈ అంశంతోనే 2007 ఫిబ్రవరిలో డిజిటల్ జర్నల్‌ని శ్రీనుబాబు ఆరంభించారు. తొలి సంచిక పది వ్యాసాలతో తీసుకొచ్చాడు. ఆర్టికల్స్ అన్నీ పీడీఎఫ్‌లో పెట్టారు. దీన్ని వెయ్యి మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ విజయం అందించిన ఉత్సాహంతో శ్రీను మరో పరిశోధనకు శ్రీకారం చుట్టారు. కనీసం నాలుగేళ్లకు ముందే క్యాన్సర్‌ను గుర్తించే అవకాశం ఉందా? అనేది పరిశోధనాంశం. మరో పక్క వర్సిటీ సహకారంతో క్యాన్సర్, డయాబెటీస్, ఫార్మసీ.. ఇలా పదులకొద్దీ వైద్య పత్రికలని ఆన్‌లైన్‌లో పెట్టారు. వేలాది మంది వీటిని డౌన్‌లోడ్ చేసుకునేవారు. నెఫ్రాలజీ, కార్డియాలజీ, ఆప్తల్మాలజి వంటి అనుబంధ రోగాలకూ తన పరిశోధనా పత్రికల ప్రచురణను విస్తరించారు. క్యాన్సర్‌పై నలభై రకాల జర్నల్స్ తెచ్చారు. అలా వీటి సంఖ్యని వెయ్యికి పెంచారు. ఏటా 50 వేల డిజిటల్ వ్యాసాలని ప్రచురిస్తూ వచ్చారు. ప్రస్తుతం వీటిని చదివే పాఠకుల సంఖ్య 50 లక్షలకు చేరుకోవడం విశేషం.

– అడ్డాల రామకృష్ణ, ఈనాడు, శ్రీకాకుళం

> భారత్‌లో జీవశాస్త్రాలను చదువుకున్న పోస్టుగ్రాడ్యుయేషన్ విద్యార్థులు తెలుగు రాష్ట్రాల నుంచే వస్తున్నారు. ఐటీ వాళ్లకు వస్తున్నట్లుగా వీరికి బహుళజాతి సంస్థల్లో ఎక్కువ ఉద్యోగాలు రావడం లేదు. తగిన నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణం. దాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నా. జీవశాస్త్ర, సాంకేతిక నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని విశాఖలో నెలకొల్పుతున్నాను. మా ఊరిలో అల్లెన డెవలప్‌మెంటు సంఘాన్ని స్థాపించా. మురుగునీటిపారుదల వ్యవస్థకు రూ.50లక్షలు సమకూర్చా. రూ.25 లక్షలతో రామాలయాన్ని నిర్మించాను. నేను చదివిన పాఠశాలలో పిల్లలు తినడానికి, ఇతరత్రా అవసరాల కోసం రూ.25 లక్షలతో భవనాలు నిర్మిస్తున్నా. విశాఖపట్నాన్ని హుదూద్ కుదిపేసినప్పుడు నావంతుగా రూ.పాతిక లక్షల వరకు విరాళం ఇచ్చాను.
>
> **గేదెల శ్రీనుబాబు**



పల్‌సస్.కాం ప్రారంభం

ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూరోపియన్ మాలిక్యులర్ బయాలజీ ల్యాబొరేటరీ (ఈఎంబీఎల్) వంటి సంస్థలు పరిశోధనలకు నిధులు సమకూరుస్తాయి. ఈ క్రమంలో పరిశోధకుల ఆర్టికల్స్‌ను పబ్లిష్ చేసినందుకు ఆ ఏజెన్సీలు డబ్బు చెల్లించేవి. ఒక ఆర్టికల్‌కు 900 డాలర్లు చెల్లించేవారు. ఒమిక్.ఓఆర్జీ పేరుతో వ్యాసాలు ప్రచురించారు. ఫండింగు ఏజెన్సీ నుంచి వచ్చిన ఆర్టికల్సే వేసేవారు. ఒక వ్యాసం ప్రచురితమయ్యాక ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫ్రీ యాక్సెస్ కావడంతో ప్రపంచంలో పాఠకుల సంఖ్య పెరగడంతో శాస్త్రవేత్తలంతా రావడం మొదలెట్టారు. హైదరాబాదులో హైటెక్‌సిటీ, మైండ్‌స్పేస్, దివ్యశ్రీఎన్ఎస్ఎల్‌సెజ్‌ల్లోనే సంస్థలు నెలకొల్పి పల్‌సస్.కాం పేరుతో వ్యాపారాన్ని విస్తరించారు. ప్రస్తుతం 3,500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. పల్‌సస్ ద్వారా ఏటా 40 దేశాల్లో మూడువేల కాన్ఫరెన్సులను నిర్వహిస్తున్నారు. అక్కడ పరిశోధకులతోనే వారి పరిశోధనలు ప్రదర్శింప చేస్తున్నారు. ఫార్మా సంస్థలు, మెడికల్ డివైజెస్ సంస్థలు వారి కొత్త ఉత్పత్తులను ఈ కాన్ఫరెన్సుల్లోనే ప్రారంభించేందుకు ముందుకొస్తున్నారు. దీనివల్ల అదనపు ఆదాయం వస్తోంది. క్లినికల్ ట్రయల్స్‌పై నివేదికలను పల్‌సస్ గ్రూపు కింద అధ్యయనం చేస్తున్నారు. దేశ విదేశాల్లో టర్నోవర్ రూ.వెయ్యి కోట్లకు చేరింది. చెన్నైలో పల్‌సస్ హెల్త్‌టెక్‌ను ఇటీవలే ప్రారంభించారు.

నయాహవా

డేటింగ్ యాప్స్‌కు క్రేజ్

ప్రపంచవ్యాప్తంగా డేటింగ్ యాప్స్‌కు ఆదరణ అంతకంతకు పెరుగుతోంది. కాఫీషాపుల్లో అమ్మాయిలు, అబ్బాయిలు కబుర్లు చెప్పుకునేంత బిజీగా ఉన్నాయవి. పద్దెనిమిది నుంచి ముప్పయి ఏళ్ల మధ్యనున్న యువత డేటింగ్ యాప్స్‌ను అమితంగా ఇష్టపడుతోందని బడో.కామ్ పరిశీలనలో తేలింది. సామాజిక మాధ్యమాల్లో స్నేహసంబంధాలను ఇష్టపడుతున్న యువత.. డేటింగ్‌యాప్స్‌తోను అనుబంధాలను పెంచుకుంటోంది. ఒకరికొకరు అభిరుచులు తెలుసుకుని.. భవిష్యత్తు ప్రణాళికలను చెప్పుకున్న తరువాత ప్రేమించడానికి సిద్ధపడుతున్నారు. ఒక్కో యూజర్ రోజుకు 85 నిమిషాల సమయాన్ని డేటింగ్ యాప్స్ కోసం కేటాయిస్తున్నారని సర్వే పేర్కొంది. రోజుకు పదిసార్లు యాప్‌ను ఓపెన్ చేస్తున్నట్లు పరిశీలకులు చెప్పారు.



ఫిట్‌నెస్ మంత్ర

పాతటైర్లతో ఫటాఫట్!

కథానాయకులు.. కండలవీరులు.. పాతటైర్లను ఎత్తే సన్నివేశాలను సినిమాల్లోనే చూస్తుంటాం. లేదంటే వ్యాయామశాలల్లో టైర్లతో వ్యాయామం చేసే వాళ్లు కనిపిస్తుంటారు. చూసేవాళ్లకు ఇదంతా స్టయిల్ కోసం చేస్తున్నట్లే అనిపిస్తుంది. కేవలం టైర్లే కదా.. ఎవరైనా ఎత్తిపడేయొచ్చు అనుకుంటాం. అయితే ఈ పాతటైర్లతో వ్యాయామం చక్కటి ఫలితాన్ని ఇస్తుంది అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. టైర్లతో ఇరవై నిమిషాలు వర్కవుట్లు చేస్తే కచ్చితంగా నాలుగువందల క్యాలరీలు ఖర్చు అవుతాయట. అయితే కండరాల్లో పటుత్వం ఉన్నవాళ్లే టైర్లతో ఎక్సర్‌సైజ్‌లు చేయాలన్నది నిపుణుల సూచన. దీని కోసం ముందుగా కారు టైర్లను మాత్రమే ఎంచుకోవాలి. వాటితో ప్రాక్టీస్ మొదలుపెట్టాక.. ట్రాక్టర్, లారీ టైర్లను వాడొచ్చు. నిపుణుల పర్యవేక్షణలోనే టైర్లతో ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. లేదంటే గాయాలపాలయ్యే ప్రమాదం ఉంది. ఒకవైపు నుంచి టైర్లను ఎత్తడం, దొర్లించడం, తాడుతోకట్టి లాగడం.. వంటివన్నీ చేయొచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ క్యాలరీలను కరిగించే శక్తి వీటికుంది.





మార్స్ మ్యాజిక్... 24కే 'మ్యూజిక్'

గ్రామీ గాగా

అమెరికాలో మైకల్‌జాక్సన్ అంటే సంగీతప్రియులకు ప్రాణం. ఆయన డ్యాన్స్‌లను చూస్తే చాలు పూనకం వచ్చినట్లు ఊగిపోతాడు బ్రోనోమార్స్. చిన్నప్పటి నుంచి ఆయనే స్ఫూర్తి. అందుకే సంగీతాన్నే కెరీర్‌గా ఎంచుకున్నాడు. ఏకంగా మూడు విభాగాల్లో గ్రామీ అవార్డులు సొంతం చేసుకున్నాడు. హవాయి రాష్ట్రంలో జన్మించిన మార్స్‌ది సంగీత నేపథ్యమున్న కుటుంబం. తల్లిదండ్రులిద్దరికీ సంగీత, నృత్యాల్లో ప్రావీణ్యం అపారం. దాంతో మార్స్ కూడా ఎలక్ట్రిక్ గిటార్, బాస్, పియానో, కీబోర్డ్, డ్రమ్స్...ఇలా భిన్నరకాల వాయిద్యాలు నేర్చుకున్నాడు. నృత్యంలోనూ ప్రవేశం పొందాడు. ఇక, కలం తీసుకుంటే చాలు. పాటలు సైతం చకచకా రాసేస్తాడు. ఇలా సంగీత, సాహిత్యాల్లో ప్రతిభ చూపుతూ 2010లో మొట్టమొదటి ఆల్బమ్ విడుదల చేశాడీ కుర్రాడు. 2016లో చేసిన 24కే మ్యాజిక్ ఆల్బమ్ సంచలనాలు నమోదు చేసింది. అది 130 మిలియన్ల కాపీలు అమ్ముడుపోయింది. ఈ ఆల్బమే ఇప్పుడు మూడు గ్రామీ అవార్డులు సొంతం చేసుకొనేలా చేసింది. బెస్ట్ ఆల్బమ్, రికార్డు, సాంగ్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాలు దక్కించుకుంది. ఇప్పటి వరకూ 11 గ్రామీ అవార్డులు, 3 బ్రిట్ పురస్కారాలు, 3 గిన్నిస్ రికార్డులు మార్స్ ఖాతాలో చేరాయి. టైమ్స్ విడుదల చేసే 100 మంది అత్యంత ప్రభావిత వ్యక్తుల జాబితా-2011లోనే స్థానం సంపాదించిన మార్స్, ముప్పై ఏళ్ల లోపు వారి ఫోర్బ్స్ జాబితా-2013లోనూ మొదటి స్థానాన్ని పొందాడీ యువ సంగీత తరంగం. ది స్మీజింగ్‌టన్స్ పేరుతో సొంత ప్రొడక్షన్ ప్రారంభించి సంగీత సామ్రాజ్యాన్ని ఏలుతున్నాడు.



ఆగస్టు నుంచే ఆయుష్మాన్!

ఈనాడు - దిల్లీ

వైద్యం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర చికిత్సలు నిరుపేదలకు అందని ద్రాక్ష పండే అవుతోంది. మధ్య తరగతి ప్రజలు సైతం కుటుంబ సభ్యులకు అనూహ్యమైన ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆ ఖర్చులను భరించటానికి తలతాకట్టు పెట్టాల్సి వస్తోంది. దేశంలో సాలీనా ఆరోగ్య సేవల కోసం రూ.5లక్షల కోట్లు ఖర్చవుతోంది. 60% మందికిపైగా ప్రజలు చికిత్సల కోసం సొంతంగానే డబ్బు ఖర్చుచేస్తున్నారు. ప్రపంచంలో ఇంత పెద్దస్థాయిలో ప్రజలు ఎక్కడా ఆరోగ్య సేవల కోసం ఖర్చు చేయడంలేదు. ఈ పరిస్థితి నుంచి ప్రజలను రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య భద్రత పథకాన్ని తీసుకొస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆర్ఎస్‌బీఐ, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఉచిత ఆరోగ్య బీమా పథకాలను పరిశీలించిన అనంతరం కేంద్రం 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని ప్రవేశపెట్టడానికి సిద్ధమైందని నీతిఆయోగ్ సభ్యుడు వినోద్‌పాల్, సీఈఓ అమితాబ్ కాంత్‌లు వెల్లడించారు. ఈ పథకం భారత ఆరోగ్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. తొలి దశలో 50 కోట్ల మందితో ప్రారంభించి అంతిమంగా 130 కోట్ల మందికి దీన్ని విస్తరించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

అర్హులు ఏ రాష్ట్రంలో ఉన్నా సేవలు పొందవచ్చు!

ఆరోగ్య పథకంలో పేరు నమోదుచేసుకున్న లబ్ధిదారులు దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా ఉచిత వైద్యసేవలు పొందొచ్చు. ఆంధ్రప్రదేశ్ వారు తెలంగాణలో, తెలంగాణ వారు ఆంధ్రప్రదేశ్‌లో లేదంటే సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, తమిళనాడుల్లో ఎక్కడైనా పథకం పరిధిలో ఉన్న ఆసుపత్రుల్లో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యసేవలు పొందొచ్చు. మొబైల్ ఫోన్లకు నెంబర్ పోర్టబిలిటీ ఉన్నట్లుగానే ఈ సేవలకు రాష్ట్ర పోర్టబిలిటీ ఉంటుంది. ఒక రాష్ట్రంలో చిరునామా ఉన్న వ్యక్తి పనిమీద దేశంలో ఏదైనా ప్రాంతానికి వెళ్లి అనారోగ్యానికి గురయితే అక్కడే వైద్యసేవలు పొందే వెసలుబాటు కల్పిస్తున్నారు. అందుకయ్యే ఖర్చును అతని సొంత రాష్ట్రం చెల్లిస్తుంది. ఈ పథకంతో ఆధార్‌ను అనుసంధానం చేస్తున్నా దాన్ని తప్పనిసరి చేయడంలేదు.

అమలు బాధ్యత ఎవరిది?

ఇదో కేంద్ర ప్రాయోజిత పథకం. అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. ఈ పథకాన్ని బీమా కంపెనీ ద్వారాకానీ, ట్రస్ట్ విధానంలోకానీ అమలు చేసే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుంది. తెలుగురాష్ట్రాల్లో ఈ తరహా పథకాన్ని ట్రస్ట్ ద్వారా అమలుచేస్తున్నారు. దాన్ని అలాగే కొనసాగించవచ్చు. దేశంలోని కొన్నిరాష్ట్రాలు రూ.2 లక్షలు, మరికొన్ని రూ.3 లక్షల వరకు బీమా కల్పిస్తున్నాయి. రూ.5లక్షల ప్రయోజనం కల్పించడం దేశంలో ఇదే మొదటిసారి.

ఎంత ఖర్చవుతుంది?

పది కోట్ల కుటుంబాలకు ఈ పథకం ఒకేసారి అమలుచేయాలంటే దాదాపు రూ.10వేల కోట్ల నుంచి రూ.12వేల కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయని అంచనా. ఒక్కో కుటుంబానికి ప్రీమియం రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు అవుతుందని భావించి ఈ అంచనాకు వచ్చారు. తొలి ఏడాది గరిష్ఠంగా 50% కుటుంబాలు ఇందులో చేరే అవకాశం ఉన్నట్లు అంచనా. అందువల్ల తొలి ఏడాది రూ.5-6వేల కోట్లు నిధులు కేటాయించాల్సి వస్తుంది. దీనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా 60:40 నిష్పత్తిలో ఉంటుంది కాబట్టి కేంద్రం తన వాటా కింద గరిష్ఠంగా రూ.3,600 కోట్లు సమకూర్చాల్సి వస్తుంది.

నిధులు ఎలా?

2018-19 బడ్జెట్‌లో రాష్ట్రీయ స్వాస్థ్‌బీమా యోజన, నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ స్కీంలకు కలిపి రూ.2వేల కోట్లు కేటాయించారు. ఇప్పుడు విధించే 1% వైద్య సుంకం వల్ల రూ.11వేల కోట్లు సమకూరుతాయని అంచనా. భవిష్యత్తులో పన్ను పరిధి పెరిగే కొద్దీ ఈ సుంకం వసూళ్లు అధికమవుతాయి కాబట్టి నిధుల సమస్య ఉండదు. ప్రస్తుతం ఈ పథకానికి బడ్జెట్‌లో ఎలాంటి నిధి పెట్టకపోయినా విధివిధానాలన్నీ ఖరారైన తర్వాత అనుబంధ నిధుల రూపంలో పొందుపరచడానికి అవకాశం ఉంది. గత ఏడాది వైద్యఆరోగ్యశాఖకు బడ్జెట్‌లో రూ.47వేల కోట్లు కేటాయించినా అంచనాల సవరణ నాటికి అది రూ.52వేల కోట్లకు చేరింది. అంటే సుమారు రూ.5వేల కోట్ల బడ్జెట్‌ను అనుబంధ నిధుల (సప్లిమెంటరీ డిమాండ్ ఆన్ గ్రాంట్స్) రూపంలో పెంచారు. అందువల్ల ఈ పథకానికీ ఆర్థిక సంవత్సరం మధ్యలో నిధులు కేటాయించడానికి అవకాశం ఉంటుందనేది నీతి ఆయోగ్ వాదన. ఇదివరకెప్పుడూ ఇలా వైద్యం కోసం సుంకం విధించిన సందర్భం లేదు.

ఎంత వరకు సిద్ధం?

'ఆయుష్మాన్ భారత్' పథకం అమలుకోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రాథమిక కసరత్తు పూర్తిచేసింది. ప్యాకేజీలు, పథకం పరిధిలో చేరే ఆస్పత్రుల అర్హతలు, ఐటీసాఫ్ట్‌వేర్ సిద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలతో ఇప్పటికే చాలారోజుల నుంచి చర్చలు నడుస్తున్నాయి. ఇప్పటికే వాటి అనుభవాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ పథకం కింద అర్హులెవరు? అనర్హులెవరన్నది ఎస్ఈసీసీ డేటా చూసుకొని ఎవరికి వారు నిర్ధారించుకోవచ్చు. పథకం అమలు తేదీ ప్రకటించిన వెంటనే పైసా చెల్లించకుండానే గ్రామ పంచాయతీల్లోనే పేర్లు నమోదుచేసుకోవచ్చు.

ప్రైవేటు రంగానికి మేలా?

'ఆయుష్మాన్ భారత్' పథకం వల్ల ప్రైవేటురంగానికి ఎక్కువ లబ్ధిచేకూరి ప్రభుత్వ వైద్య రంగం బలహీనపడుతుందన్న వాదన ఉంది. అయితే దీన్ని కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంలేదు. కేరళలో ఇలాంటి వైద్యఆరోగ్య పథకం అమలు ద్వారా వెళ్లే డబ్బులో 55% ప్రభుత్వ ఆసుపత్రులకే వెళ్తున్నట్లు ఉదహరిస్తోంది. ఇక్కడ ప్రైవేటు, పబ్లిక్ అన్న తేడా లేదని ఎక్కడ మెరుగైన వైద్యసేవలు అందితే రోగి అక్కడి వెళ్తాడని, రోగి వెళ్లిన ఆసుపత్రికే డబ్బు వెళ్తుందని పేర్కొంది. దీనివల్ల ప్రభుత్వరంగం కూడా తన శక్తిసామర్థ్యాలను పెంచుకొని ప్రైవేటుతో పోటీపడే పరిస్థితి వస్తుందని విశ్వసిస్తోంది. ప్రస్తుతం దేశంలో మూడొంతుల జనాభా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నా మూడొంతుల డాక్టర్లు మాత్రం పట్టణాల్లోనే ఉంటున్నారు. ఇప్పుడు ఈ పథకం వల్ల రోగులు అధికంగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లోకీ వైద్యరంగం విస్తరిస్తుందని ప్రభుత్వం చెబుతోంది.

అర్హులు ఎవరు? ఎంపిక ఎలా?

'ఆయుష్మాన్ భారత్'ను తొలి దశలో దేశంలోని పది కోట్ల నిరుపేద కుటుంబాలకు చెందిన 50 కోట్ల మందికి వర్తింపజేస్తారు. అర్హుల ఎంపికకు 2011 నాటి సామాజిక ఆర్థిక కుల జనాభా గణన (ఎస్ఈసీసీ) ఆధారం. ఈ గణనలో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి వివరాలు పక్కాగా ఉన్నాయన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకం అమలుకు ఆ సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఈ ఎస్ఈసీసీ లెక్కలతో విభేదిస్తున్నందున అలాంటి రాష్ట్రాలతో కేంద్రం సంప్రదింపులు జరిపి ఒక ప్రామాణిక డేటాను ఖరారు చేస్తుంది. దాని ఆధారంగా పథకాన్ని అమలుచేస్తారు. ప్రతి కుటుంబానికి రూ.5లక్షల వార్షిక వైద్య ఖర్చులు చెల్లిస్తారు. కుటుంబ సభ్యుల గరిష్ఠ సంఖ్యపై పరిమితి లేదు. ఎంతమంది అయినా ఉండొచ్చు. కుటుంబం మొత్తానికి రూ.5 లక్షలయినా, లేదంటే ఒకే వ్యక్తికి రూ.5 లక్షలయినా ఉపయోగించుకోవచ్చు.

ఆరోగ్య రక్ష పథకం అమలుకు ఇదీ షెడ్యూల్

వివరం	గడువు
పథకం ఆమోదం	మార్చి
భాగస్వాములతో సంప్రదింపులు	మార్చి
డేటా తయారీ	ఏప్రిల్
ప్యాకేజీ ధరల రివిజన్	ఏప్రిల్
మార్గదర్శకాలు, దస్తావేజుల తయారీ	ఏప్రిల్
ఐటీ వ్యవస్థ సంసిద్ధత	జూన్
జాతీయ, రాష్ట్రస్థాయిలో సంస్థాగత వ్యవస్థల ఏర్పాటు	జూన్
రాష్ట్రాల సమాయత్తత, టెండర్ల పిలుపు	జులై

ప్రాథమిక వైద్య కేంద్రాల ఏర్పాటు లక్ష్యం ఎలా..?

సంవత్సరం	ఉపకేంద్రాలు	ప్రాథమిక కేంద్రాలు
2018-19	15,000	-
2019-20	25,000	12,500
2020-21	30,000	12,500
2021-22	40,000	-
2022 డిసెంబర్ 31	26,000	-
మొత్తం	1,36,000	25,000


ప్రాథమిక ఆరోగ్యసేవలు అందించడానికి హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు

ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రజలకు ప్రాథమిక ఆరోగ్యసేవలు అందించడానికి 2022 నాటికి దేశవ్యాప్తంగా 1.50 లక్షల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. ప్రాథమిక దశలోనే వైద్యసేవలు, పరీక్షలు అందుబాటులోకి తేవడంవల్ల తీవ్రమైన జబ్బులను తొలి దశలోనే నిర్మూలించవచ్చన్న ఉద్దేశంతో ఈ పథకానికి శ్రీకారం చుడుతోంది. ఆయుష్మాన్ భారత్ పథకంతోపాటు దీన్నీ ఒకేసారి అమల్లోకి వెస్తుంది. ప్రతి 5వేల మంది జనాభాకు ఒకటి చొప్పున ఈ కేంద్రాలను ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకొంది. వైద్యుల ద్వారా ప్రాథమిక వైద్యసేవలు అందించడం అసాధ్యం కాబట్టి ఇందుకోసం మధ్యస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చి వైద్యసేవలు అందిస్తారు. బీడీఎస్ డాక్టర్లు, నర్సులు, ఆయుర్వేద ప్రాక్టీషనర్స్, మల్టీ పర్పస్ వర్కర్స్, ఆషా వర్కర్లకు ప్రాథమిక వైద్యంలో శిక్షణ ఇచ్చి ఇందుకోసం ఉపయోగించుకుంటారు. ఇక్కడ మందులు, వైద్యం అంతా ఉచితంగా అందిస్తారు. 12 రకాల అత్యవసర సేవలను ప్యాకేజీ రూపంలో అందిస్తారు. వీటి నిర్మాణానికి ఎంపీల్యాడ్స్, గ్రామీణ ఉపాధి హామీ నిధులు, దాతలు అందించే విరాళాలు, సీఎస్ఆర్ నిధులను ఉపయోగించుకుంటారు. కుటుంబ ఆరోగ్య భద్రతకు ఇదో పునాది.

ఆయుష్మాన్‌భవకు..

ముందు ఆరోగ్యశ్రీ!

దేశవ్యాప్తంగా వైద్యబీమా సంరంభం మొదలవుతోంది. దేశంలోని 50 కోట్ల మంది పేదలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు తాజా బడ్జెట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం భారీస్థాయిలో 'జాతీయ ఆరోగ్య బీమా' పథకాన్ని తెర మీదికి తెచ్చింది. వాస్తవానికి ఇదే తరహా పథకం మన తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ, ఎన్టీఆర్ వైద్యసేవ పేరిట గత 11 ఏళ్లుగా అమలవుతోంది. ఇలా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉచిత ఆరోగ్య బీమా పథకాలను పరిశీలించాకే తాము కేంద్ర పథకానికి రూపకల్పన చేసినట్టు నీతిఆయోగ్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో మన రాష్ట్రాల్లో ఈ వైద్య బీమా సేవలపై సర్వత్రా ఆసక్తికర చర్చ నడుస్తోంది.



అదనంగా అవసరమైతే..

పథకం ప్రారంభమైన దగ్గర్నించి ఇప్పటి వరకూ గరిష్ఠ పరిమితి కంటే అదనంగా వ్యయానికి అనుమతులు కోరినవి తెలంగాణలో సుమారు 100 లోపే.

- తెలంగాణలో గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలకు గరిష్ఠ పరిమితిని సడలించారు. వీటికి చికిత్సను బట్టి రూ.10.5 లక్షలకు పైనే ఇస్తున్నారు.
- ఆంధ్రప్రదేశ్‌లోనూ గుండె, మూత్రపిండాలు తదితర మార్పిడి శస్త్రచికిత్సలకు గరిష్ఠ పరిమితిని సడలించి ఇస్తున్నారు.

ఈనాడు, హైదరాబాద్

	తెలంగాణలో	ఆంధ్రప్రదేశ్‌లో
లబ్ధిపొందే కుటుంబాలు	77.19 లక్షలు	1.49 కోట్లు
పథకం కింది ఆసుపత్రులు	273	400

లబ్ధి ఎందరికి? 2014 జూన్ 2 నుంచి 2018 ఫిబ్రవరి 2 వరకూ

	తెలంగాణలో	ఆంధ్రప్రదేశ్‌లో
ఓపీలో రోగులు	17,83,303	14,06,761
ఆసుపత్రుల్లో చేరింది	10,64,382	16,15,065
మొత్తం చికిత్స/సర్జరీలు	10,24,204	15,09,674
చెల్లింపులు రూ. కోట్లలో...		
మొత్తం	2686.92	4248.20
ప్రభుత్వ ఆసుపత్రులకు	796.70	1038.90
ప్రైవేటు ఆసుపత్రులకు	1890.23	3209.30
సగటున ఏటా వ్యయం	800	1000 పైనే

మాటలు నేర్చిన తిమింగలం



పారిస్: ఫ్రాన్స్‌లోని ఆంటిబెస్ నగరంలో గల మరీన్‌ల్యాండ్ అక్వేరియంలో బందీగా ఉంచిన వికీ అనే కిల్లర్ తిమింగలం(ఓర్కా) మాటలు నేర్చింది. ఇప్పటికే కాపీ, డూ దట్ అనే పదాలను పలుకుతున్న వికీకి పరిశోధకులు మరిన్ని మాటలు నేర్పారు. హలో, అమీ, బైబై అనే పదాలతో పాటు అనేక పదాలను అలవోకగా నేర్చేసుకుంది. చిలుకలు, మైనాలు కొన్ని పదాలను, సంభాషణను అనుకరిస్తాయనే సంగతి తెలిసిందే. దక్షిణకొరియాలోని జంతు-ప్రదర్శనశాలలో ఉంచిన ఒక ఏనుగు కూడా ఇలాగే అనుకరించడం చూసి శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోయారు. తాజాగా అంతకు ముందు వినని పదాలను వికీకి నేర్పడానికి ప్రయత్నిస్తే, గరిష్ఠంగా 17 సార్లు పలికేసరికి నేర్చేసుకుందని 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది రాయల్ సొసైటీ బీ' అనే జర్నల్‌లో వ్యాసం ప్రచురితమైంది. హలో, ఒన్, టు, త్రీ అనే పదాలను ఒక్కసారి ఉచ్చరించగానే తిరిగి పలికిందని 'వాషింగ్టన్ పోస్ట్' కథనం రాసింది.

రద్దు నాటి ఊపు లేదు

డిజిడల్ చెల్లింపులు!

డిజిటల్ చెల్లింపుల్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ఎప్పటికప్పుడు లక్ష్యాలను నిర్దేశించుకుంటూ పోతోంది. రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. డిజిటల్ చెల్లింపులు పెంచాల్సిన ఆవశ్యకతను తాజా బడ్జెట్‌లోనూ నొక్కిచెప్పింది. ఇన్ని చర్యలు చేపడుతున్నా..ఇవి అనుకున్నంత ఊపందుకోలేదు. ఏడాదికాలంగా జరిగిన డిజిటల్ చెల్లింపులే దీనికి ఉదాహరణ. 2016 నవంబరు 8న పెద్దనోట్ల రద్దు తర్వాత దేశంలో తీవ్ర నగదు కొరత ఏర్పడి.. ఓ నాలుగైదు నెలల పాటు డిజిటల్ లావాదేవీలు బాగానే పెరిగాయి. కానీ కరెన్సీ కష్టాలు తీరుతున్న కొద్దీ జనం మళ్లీ నోట్ల చెల్లింపుల వైపు వెళ్లిపోయారు.



మొత్తమ్మీద ఏడాదిలో డిజిటల్ లావాదేవీలు పెరిగింది: 13%

డిజిటల్ లావాదేవీలు

నోట్ల రద్దుకు ముందు

2016 నవంబరులో: రూ.94 లక్షల కోట్లు



నోట్ల రద్దు తర్వాత..

2017
- మార్చిలో: రూ.149 లక్షల కోట్లు
- జులైలో: రూ.107 లక్షల కోట్లు
- ఆగస్టులో: రూ.109 లక్షల కోట్లు
- అక్టోబరులో: రూ.99.28 లక్షల కోట్లు

లావాదేవీల సంఖ్య

2016 డిసెంబరులో: 95.75 కోట్లు

2017 అక్టోబరులో: 86.39 కోట్లు



మొబైల్ వ్యాలెట్ల ద్వారా జరిగిన లావాదేవీలు

ఎప్పుడు	లావాదేవీల సంఖ్య	లావాదేవీల మొత్తం
2016 అక్టోబరులో	9.96 కోట్లు	రూ.3,385 కోట్లు
2017 మార్చిలో	26.17 కోట్లు	రూ.8353 కోట్లు
2017 ఆగస్టులో	22.54 కోట్లు	రూ.7262 కోట్లు

'డిజిటల్'తో ప్రయోజనాలు: వాడటం సులువు, సమయం ఆదా, చెల్లింపు సౌలభ్యం, నగదు తస్కరణ భయం ఉండదు, ఖర్చుపై నియంత్రణ, రాయితీలు పొందే అవకాశం.

డెబిట్/క్రెడిట్ కార్డుల చెల్లింపులూ అంతంతే..

దేశంలోని ప్రతి ఇంటికీ డెబిట్ లేదా క్రెడిట్ కార్డు ఉన్నప్పటికీ.. డిజిటల్ చెల్లింపులు మాత్రం అరకొరే. ఎక్కువమంది డెబిట్ కార్డును ఏటీఎం కోసమే వాడుతున్నారు.

డెబిట్ కార్డుల ద్వారా

2016 ఆగస్టులో
- చెల్లింపులు రూ. 2,38,013 కోట్లు
- లావాదేవీలు 88.72 కోట్లు

2017 ఆగస్టులో
- చెల్లింపులు రూ.2,70,609 కోట్లు
- లావాదేవీలు 98.18 కోట్లు



మొత్తం డెబిట్ కార్డులు 80 కోట్లు

క్రెడిట్ కార్డులు 30 కోట్లు

దేశవ్యాప్తంగా పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) మిషన్లను రెట్టింపు (15 లక్షల నుంచి 30 లక్షలకు) చేసినప్పటికీ.. డిజిటల్ లావాదేవీల్లో తిరోగమనమే కనిపించింది. డిజిటల్ ప్లాట్‌ఫాంల వినియోగం క్రమంగా తగ్గుతూ వస్తోందనే అర్థమవుతోంది.

• భారత జాతీయ చెల్లింపుల కార్పొరేషన్(ఎన్‌పీసీఐ) గణాంకాల ప్రకారం

పథకాలు ఘనం.. ఇచ్చింది అరకొర

ఈనాడు - అమరావతి

> ఆఖరి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి న్యాయం జరగకపోతే ఎలా? అసలు వాళ్లేమనుకుంటున్నారు. మిత్రపక్షంగా మనమెంతో సామరస్యంగా, నమ్మకంగా ఉంటున్నాం. ప్రధానిని, కేంద్ర మంత్రుల్ని కలసి న్యాయం చేయమని అడుగుతున్నాం. చట్ట ప్రకారం కేంద్రం ఇచ్చిన హామీల మేరకు మనకు రావలసిందే అడుగుతున్నాం తప్ప గొంతెమ్మ కోర్కెలేమీ కోరడం లేదు. అయినా ఎందుకిలా చేస్తున్నారు?
>
> **- మంత్రివర్గ సమావేశంలో మంత్రుల ఆవేదన**

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించిన ప్రాధాన్య ప్రాజెక్టులకు కేటాయింపులేమీ లేకపోగా... కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకూ కేటాయింపులు తక్కువగా ఉండటంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పెదవి విరిచింది. దీనివల్ల రాష్ట్రానికి వచ్చే నిధులు తగ్గుతాయని అధికారులు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరకు కేటాయింపులు తగ్గించడం, 50 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని చెబుతున్న ఆరోగ్య బీమా పథకానికి రూ.2 వేల కోట్లే కేటాయించడం వల్ల ప్రయోజనం ఏంటన్న భావన సమావేశంలో వ్యక్తమైంది. రాష్ట్రంలోని తెల్ల రేషన్‌కార్డులు ఉన్నవారందరికీ చౌకధరల దుకాణాల ద్వారా మార్చి నుంచి ప్రతి నెలా కిలో కందిపప్పు, అరకిలో చక్కెర రాయితీ ధరలపై ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. కందిపప్పుని కిలో రూ.40 చొప్పున అందజేయనున్నారు. గత సంవత్సరం మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించిన కందుల్ని మరపట్టించి సరఫరా చేస్తారు. గిరిజన ప్రాంతాల్లో కిరోసిన్ కూడా అందజేయాలని మంత్రి ఆనందబాబు కోరగా, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో ఆత్మహత్య చేసుకున్న, ఆకస్మిక మరణం చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. మొత్తం 96 కుటుంబాలకు ఈ నెల 12న ముఖ్యమంత్రి చేతుల మీదుగా చెక్కులు అందజేస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 7 సాయంత్రం దుబాయి వెళుతున్నారు. 8న ఆయన దుబాయిలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌తో అవగాహన ఒప్పందం చేసుకోనున్నారు. విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకి దుబాయిలోని పారిశ్రామికవేత్తల్ని ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రోడ్‌షోలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. రాష్ట్ర బడ్జెట్‌ను మార్చి 5న ప్రవేశపెట్టాలని, దానికి రెండు మూడు రోజులు ముందుగా సమావేశాలు ప్రారంభించాలని ప్రాథమికంగా మంత్రిమండలి భావించినట్లు తెలియవచ్చింది.

నాలుగేళ్ల నుంచి అదే మాట...

మంత్రివర్గం అజెండాలోని అంశాలు ముగిసిన తర్వాత... కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఒక జాతీయ టెలివిజన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పడం గురించి కొందరు ప్రస్తావించారు. నాలుగేళ్ల నుంచి అదే మాట చెబుతున్నారని, తీరా కేటాయింపులకు వచ్చేసరికి మొండిచెయ్యే ఎదురవుతోందని కొందరు సభ్యులు వ్యాఖ్యానించారు. విశాఖపట్నం పెద్ద నగరమే కదా, అక్కడైనా మెట్రో ప్రాజెక్టుకి నిధులిచ్చి ఉంటే బాగుండేదని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. "విశాఖ పెద్ద నగరమైనా, బడ్జెట్‌లో చిన్నచూపు చూశారు. అహ్మదాబాద్ మెట్రోకి నిధులు కేటాయించారు" అని ముఖ్యమంత్రి అన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన తీవ్ర అన్యాయంపై మన ఆగ్రహాన్ని, ఆవేదనను కేంద్రానికి ఏ విధంగా తెలియజేయాలన్న అంశంపై ఆదివారం జరిగే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఒక నిర్ణయానికి రావాలన్న అభిప్రాయం వ్యక్తమైంది.

మద్దతు ధర ప్రకటనలో స్పష్టత లేదు...

వ్యవసాయ ఉత్పత్తుల పెట్టుబడికి 50 శాతం అదనంగా మద్దతు ధర ఇస్తామన్న కేంద్ర ప్రకటనలో స్పష్టత లేదని మంత్రివర్గం అభిప్రాయపడింది. ఎలాంటి వ్యవసాయ ఖర్చుల్ని పరిగణనలోకి తీసుకుంటారో చెప్పలేదని, పైగా ఎంఎస్‌పీకి కేటాయింపుల్ని రూ.3,500 కోట్ల నుంచి రూ.1,500 కోట్లకు తగ్గించారని, దీని వల్ల గతంలో కంటే మద్దతు ధరలు తగ్గే అవకాశం ఉందని చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తోందని, ఒక రాష్ట్ర ప్రభుత్వమే ఒక ప్రాజెక్టుపై అంత వెచ్చిస్తుంటే... 50 కోట్ల మందికి మేలు చేస్తుందని చెబుతున్న ఆరోగ్యబీమా పథకానికి రూ.2 వేల కోట్లు కేటాయిస్తే ఏం ప్రయోజనం ఉంటుందన్న భావన వ్యక్తమైంది. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.40 చొప్పున వెచ్చించినట్టవుతుందని అధికారులు వివరించారు.

ఎంత తెచ్చుకోగలమో చూడండి..!

కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు, రాష్ట్రానికి వచ్చేందుకు అవకాశమున్న నిధుల వంటి అంశాలపై ఆర్థిక శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్ర ప్రజంటేషన్ ఇచ్చారు. 2017-18 బడ్జెట్‌లో ఏ శాఖకు ఎన్ని నిధులు వచ్చాయి? వాటిలో ఎన్ని ఖర్చు చేశారు? పెండింగ్‌లో ఉన్న పనులేంటి? వంటి సమగ్ర వివరాలతో తనకు వెంటనే నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. చేపట్టాల్సిన పనులేమైనా పెండింగ్‌లో ఉంటే, నామినేషన్ ప్రాతిపదికనైనా కేటాయించి ఒకటిన్నర నెలల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 2018-19 బడ్జెట్‌లో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చేదెంత? మనం ఏ మేరకు అదనంగా తెచ్చుకోగలం వంటి అంశాలపై చర్చించారు. అవసరమైన నివేదికలు, ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేయాలని, రాష్ట్రానికి గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలని సీఎం తెలిపారు. రాష్ట్రంలో మరిన్ని ఆర్థిక నగరాల ఏర్పాటుపై కూడా మంత్రివర్గంలో చర్చించగా నిర్ణయాన్ని వాయిదా వేశారు. త్వరలో అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున అప్పుడు నిర్ణయిద్దామని పెండింగ్‌లో ఉంచారు.

రాములోరి గుడికి హంగులు

ఈనాడు, హైదరాబాద్ : శ్రీ సీతారామస్వామి ఆలయ అభివృద్ధి పథకంలో భాగంగా తొలిదశ పనులను శ్రీరామ నవమిలోపు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్కిటెక్ట్ ఆనంద సాయి నేతృత్వంలో రూపొందించిన మూడు నమూనాలపై చర్చించారు. చినజీయర్ స్వామి నమూనాలపై సంతృప్తి వ్యకం చేయడంతో మిగిలిన పనులపై యంత్రాంగం దృష్టిసారించింది. దీనికితోడు ఆలయం చుట్టూ పలు నిర్మాణాలకు భూమి అవసరమని గుర్తించారు. ఈ మేరకు భూసేకరణతో అందుబాటులోకి వచ్చే 65 ఎకరాల్లో పలు ఆకృతులను నిర్మించనున్నారు. ఆలయ ప్రాకారానికి సంబంధించిన నిర్మాణాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం భద్రాద్రి ఆలయ అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షించారు.


రూ. 54 లక్షలు దారిమళ్లాయా?

- **ఆసుపత్రుల నుంచి వచ్చిన డీడీలను ప్రభుత్వ ఖాతాలో జమచేయని సిబ్బంది**
- **రాష్ట్ర వైద్యవిద్య సంచాలక కార్యాలయంలో చర్చ**

ఈనాడు, అమరావతి: అనుమతుల పునరుద్ధరణ కోసం ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి డీడీల రూపంలో వసూలుచేసిన రూ.54 లక్షలను ప్రభుత్వ ఖాతాలో జమచేయకపోవడం రాష్ట్ర వైద్య విద్య సంచాలక కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. 2014 నుంచి నాలుగేళ్లపాటు వైద్య విద్య సంచాలక కార్యాలయంలో జరిగిన లావాదేవీలపై ఏజీ ఆడిటింగ్ జరిగింది. ఉద్యోగులకు వైద్య సేవలు అందించే ఆసుపత్రులకు వైద్య విద్య సంచాలక కార్యాలయం అనుమతులు ఇస్తుంది. ఏటా ఈ అనుమతులను పునరుద్ధరిస్తుంది. ఇందుకు సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలు రూ.35వేలను డీడీల రూపంలో చెల్లించాలి. ఇలా తీసుకున్న 172 డీడీలను నిర్ణీత వ్యవధిలో ప్రభుత్వ ఖాతాకు జమ అయ్యేలా చర్యలు తీసుకోకపోవడాన్ని ఆడిటింగ్‌లో గుర్తించారు. రూ.54 లక్షల విలువ కలిగిన డీడీల విషయంలో సంబంధిత అధికారులు తగిన శ్రద్ధ తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ఈ విషయమై అధికారిక వర్గాలు స్పందిస్తూ..."డీడీలు ఇచ్చినప్పటికీ సంబంధిత ధ్రువపత్రాలను ఇవ్వనందున వెంటనే ప్రభుత్వ ఖాతాలోకి జమచేయలేదు. వాటిని తిరిగి జమచేసేందుకు కాలవ్యవధిని పెంచాలని బ్యాంకులను కోరాం" అని తెలిపాయి.

అవినీతి ఉద్యోగి వెనక్కు

వైద్య విద్య సంచాలక కార్యాలయంపరిధిలో పనిచేసే ఓ వైద్యుడిని సరెండర్‌చేసిన తర్వాత వేరేచోట పోస్టింగ్ ఇచ్చేందుకు ఉత్తర్వుల జారీ విషయంలో రూ.వేలు తీసుకున్న ఉద్యోగిని మాతృశాఖకు సరెండర్ చేశారు. వాస్తవానికి తొలుత ఈ వ్యవహారంలో వివిధ రకాల విజ్ఞప్తులు రావడంతో అధికారులు కొనసాగించారు. అయినప్పటికీ ఆయన ఏమాత్రం మారలేదు. మరో ఉదంతంలోనూ అలాగే వ్యవహరించారు. దీంతో.. ఆ డబ్బును వెనక్కు ఇప్పించిన అధికారులు సంబంధిత ఉద్యోగిని మాతృశాఖకు పంపినట్లు సమాచారం.





తమిళనాడులోని మదుర మీనాక్షి ఆలయం తూర్పుగోపురం వద్ద భారీ అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశంలో గుమికూడిన జనాలు ■ అగ్నికి దగ్ధమవుతున్న దుకాణాలు



మూడేళ్లలో మూడోది

మోదీ ప్రభుత్వం 2014లో కొలువు తీరాక సెన్సెక్స్‌కు వచ్చిన ఒక రోజు నష్టాల్లో మూడో అత్యధిక నష్టం ఇది. అంతక్రితం ఆగస్టు 24, 2015న 1624.51 పాయింట్లు; జనవరి 6, 2015న 869.65 పాయింట్లు చొప్పున సెన్సెక్స్ పతనమైంది. అయితే ఆ సమయంలో అంతర్జాతీయ కారణాల వల్ల అవి వాటిల్లాయి. తాజా నష్టం మాత్రం కేవలం బడ్జెట్ నిర్ణయాల వల్ల కలిగిందే కావడం గమనార్హం. అయితే మోదీ గద్దెనెక్కిన తర్వాత సెన్సెక్స్ 24,000 పాయింట్ల నుంచి 35,000 పాయింట్ల స్థాయికి చేరడం చూస్తే ఏకంగా 11,000 పాయింట్ల లాభం వచ్చింది. అంటే దాదాపు 50 శాతం ప్రతిఫలాలను కేవలం మూడున్నరేళ్లకు పైగా వ్యవధిలో అందించిందన్నమాట.

సెన్సెక్స్ అతిపెద్ద భారీ పతనాలు

తేదీ	నష్టం(పాయింట్లలో)
ఆగస్టు 24, 2015	1624.51
జనవరి 21, 2008	1408.35
అక్టోబరు 24, 2008	1070.63
మార్చి 17, 2008	951.03
మార్చి 3, 2008	900.84
జనవరి 22, 2008	875.41
జులై 6, 2009	869.65
జనవరి 6, 2015	854.86
ఫిబ్రవరి 2, 2018	839.91
ఫిబ్రవరి 11, 2008	833.98

ఈనాడు బిజినెస్

సెన్సెక్స్ 35066 ▼840

నిఫ్టీ 10760 ▼256

అత్యధిక నష్టాల్లో..

కంపెనీ	2న ముగింపు	1న ముగింపు	మార్పు (రూ.లలో)
పీసీ జువెలర్	364.25	484.30	120.05 (-24.79%)
జిందాల్ సా	131.00	151.75	20.75 (-13.67%)
బాంబే డైయింగ్	191.75	221.55	29.80 (-13.45%)
ఇండియా గ్లైకాల్స్	455.40	524.55	68.55(-13.13%)
సియట్	1647.45	1884.95	237.50(-12.60%)
జస్ట్ డయల్	449.15	512.15	63.00 (-12.30%)
బీఈఎంఎల్	1283.05	1455.75	172.70(-11.86%)
జెట్ ఎయిర్‌వేస్	686.60	769.15	83.55 (-10.86%)
రిలయన్స్ కేపిటల్	436.75	486.20	49.45 (-10.17%)
వక్రంజీ	262.65	291.80	29.15 (-9.99%)

బుల్ పరుగుకు 'లాభాల పన్ను' అడ్డేనా?

ప్రస్తుత బుల్ పరుగు ఇప్పటిది కాదు. 2013లో విదేశీ సంస్థాగత మదుపర్ల కారణంగా ఇది మొదలైందని చెప్పవచ్చు. 2016లో పెద్ద నోట్ల రద్దు అనంతరం మార్కెట్‌కు పట్టపగ్గాలు లేకుండా పరుగులు తీసింది. చాలా వరకు గృహస్తులు ఫండ్‌ల లోకి తమ పెట్టుబడులు తరలించడం ఇందుకు దారితీసింది. మరి ఈ పరుగుకు గురువారం ప్రకటించిన బడ్జెట్ ప్రతిపాదన అయిన దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను అడ్డుకట్ట వేస్తుందా?

ఎందుకు విధించారంటే..

2017–18లోనే రూ.3.67 లక్షల కోట్ల మూలధన లాభాలు వచ్చాయి. ఇందులో ఎక్కువ భాగం సాధారణ మదుపర్లది కాదు.. కేవలం కంపెనీలదేనని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టీకరించారు. అందుకే ఈ పన్నును 14 ఏళ్ల అనంతరం తిరిగి ప్రవేశపెట్టినట్లు వివరించారు కూడా. కంపెనీలకు లాభాలొస్తే మంచిదే కదా అనుకోవచ్చు.. కానీ కంపెనీలనేవి తయారీలో పెట్టుబడులు పెడుతుంటూనే వృద్ధికి ఊతం లభిస్తుంది. కానీ అవి తమ అదనపు నిధులను ఇలా స్టాక్ మార్కెట్లలో పెడుతున్నాయని అందుకే ఈ లాభాలపై 10 శాతం పన్నును విధిస్తున్నట్లు తెలిపారు.

పెద్ద నోట్ల రద్దు తర్వాత చాలా వరకు కంపెనీలు తన అదనపు నిధులను మూలధన వ్యయాలు చేసి ఆర్థిక వృద్ధికి సహకరించకుండా.. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడానికే మొగ్గుచూపాయన్నది వాస్తవం. ఈ విషయాన్ని యాంఫీ గణాంకాలు నిజమని రూఢి చేస్తున్నాయి. పెద్ద నోట్ల రద్దు అనంతరం మ్యూచువల్ ఫండ్‌లలో కంపెనీల పెట్టుబడులు ఏకంగా 21 శాతం పెరిగి రూ.9.4 లక్షల కోట్లకు పెరిగాయి.

దేశీయ పెట్టుబడులకు అడ్డంకి కాదు..

గత రెండేళ్లుగా దేశీయ సంస్థాగత మదుపర్లు భారత మార్కెట్లలో పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఈ విశ్వాసం ఇకపైనా కొనసాగొచ్చు. దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను విధించినంత మాత్రన అది దేశీయ పెట్టుబడులకు అడ్డుకాబోదని విశ్లేషకులు అంచనా కడుతున్నారు. కార్పొరేట్ ఆదాయాలకు ఊతమిచ్చే విధంగా ప్రభుత్వం సామాజిక, మౌలిక రంగాలపై వచ్చే ఆర్థిక సంవత్సరం భారీగా పెట్టుబడులు పెడుతోంది. గ్రామీణ మౌలిక వసతులపై 2018-19కి రూ.14.3 లక్షల కోట్లను కేటాయించింది. మొత్తం కేటాయింపుల్లో ఇవి 58.6 శాతానికి సమానం. వీటి కారణంగా కంపెనీల ఫలితాలు బాగుండి.. ఈక్విటీ ప్రతిఫలాలు రాణిస్తే ఈ 10 శాతం పన్ను అనేది పెద్దగా ప్రభావం చూపదని కోటక్ సెక్యూరిటీస్ సీఈఓ ఎండీ కమలేశ్‌రావు అంటున్నారు.

సిప్‌లే ఎక్కువ

మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో ఎక్కువగా క్రమానుగత పెట్టుబడుల పథకాలే(సిప్) ఉంటాయి. వీటిలో పెట్టుబడులు పెట్టేవారు అంత త్వరగా వాటిని బయటకు తీయరు. కేవలం పన్ను విషయంగా వారు వాటిని చూడరు. ద్రవ్యోల్బణాన్ని అధిగమించి మరీ ప్రతిఫలాలు రావాలంటే అవే మార్గమని వారికి బాగా తెలుసు. కాబట్టి 10 శాతం పన్నును పెద్దగా పట్టించుకోరని ఓ బ్రోకరేజీ సంస్థకు చెందిన అధిపతి అంటున్నారు. దీర్ఘకాల మూలధన లాభాల పన్ను స్వల్పకాలంలో మాత్రమే ప్రతికూలతలను తెచ్చిపెట్టవచ్చని అంచనా వేస్తున్నారు. చాలా కొద్ది మంది మాత్రం ఏప్రిల్‌కు ముందు పన్నును తప్పించుకోవడానికి కొంత మేర విక్రయాలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

సంపన్నులకు సమయం

జనవరి 31కి ముందు వచ్చిన మూలధన లాభాలపై పన్ను మినహాయింపు(గ్రాండ్‌ఫాదరింగ్) ఉండడం; ఏప్రిల్ 1 నుంచి పన్ను అమలు ఉన్న నేపథ్యంలో ఎక్కువ పెట్టుబడులు పెట్టే సంపన్నులు(హెచ్‌ఎన్‌ఐ)లు లాభాలు స్వీకరించి.. పన్ను తగ్గించుకోవడానికి కొంత వెసలుబాటు కలిగినట్లయింది.

తొక్కి పడేసింది..!

బేర్ దెబ్బకు మార్కెట్లు బెంబేల్

● బడ్జెట్లో మదుపర్లపై పన్ను ప్రతిపాదన ప్రభావం

● రూ.4.5 లక్షల కోట్ల మార్కెట్ సంపద ఆవిరి

బీభత్సం.. భయావహం.. శుక్రవారం మదుపర్ల ముఖచిత్రమిది.

యుద్ధం జరిగిన అనంతరం కుప్పకూలిన శత్రు సైనికుల్లాగా కనిపించారు.

వేగంగా వెళుతున్న బస్సులో ప్రశాంతంగా నిద్రిస్తున్న ప్రయాణికులకు ఒక్క కుదుపుతో లోయలో పడినట్లయింది.

ఇంకా చెప్పాలంటే.. సరదాగా ఆడుకుంటున్న పిల్లల చేతి నుంచి బొమ్మలను లాక్కున్నట్లుగా మార్కెట్ మదుపర్ల చేతి నుంచి లాభాలను కసిగా లాగేసుకుంది.

ఎందుకిలా జరిగిందంటే.. ఒకటే కారణం. మదుపర్లపై బడ్జెట్‌లో ప్రతిపాదించిన పన్ను పోటే.. ఈ నష్టాల పాట్లకు దారితీసింది. ఒకే ఒక్క రోజు.. ఒకే ఒక్క నిర్ణయం.. ఆ మరుసటి రోజు మదుపర్ల కలను చెల్లాచెదరు చేసింది. జారుడు బల్లను తలపించిన ఆ నష్టాలు మళ్లీ రాకూడదని కోరుకునేలా వచ్చాయి. రెండేళ్లలోనే అత్యధిక నష్టాలను సెన్సెక్స్ చవిచూసింది. దీంతో మదుపర్ల సెంటిమెంటు డీలా పడింది. ఏకంగా రూ.4.5 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఎండ తగిలిన మంచులా కరిగిపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 840 పాయింట్లు; నిఫ్టీ 250కి పైగా పాయింట్లను పోగొట్టుకోవడం ఇందుకు నేపథ్యం.

ఇవీ దోహదం చేశాయ్..

దీర్ఘకాల మూలధన లాభాలపై 10 శాతం పన్ను ప్రతిపాదన మాత్రమే మదుపర్లకు భయం కలిగించలేదు. పలు ఇతరత్రా కారణాలు అగ్నికి ఆజ్యం పోశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటును అంతక్రితం అంచనా వేసిన 3.2 శాతం నుంచి 3.5 శాతానికి పెంచడం కూడా మదుపర్ల విశ్వాసాన్ని సమ్మెటతో దెబ్బకొట్టినట్లయింది. ఇక శుక్రవారం ఫిచ్ రేటింగ్స్ సంస్థ వ్యాఖ్యలూ ఒక కారణమయ్యాయి. భారత రేటింగ్‌ను పెంచడానికి ప్రభుత్వ రుణ భారం అడ్డంకిగా మారుతుందనడం కూడా విక్రయాలకు దారి తీసింది. దీంతో ఆగస్టు 24, 2015 తర్వాత సెన్సెక్స్ అత్యధిక ఒక రోజు నష్టాలను కొనితెచ్చుకుంది.

ఇలా సాగింది ట్రేడింగ్..: మొదలే నష్టాల పాట వినిపించింది. 35707.60 వద్ద సెన్సెక్స్ ప్రారంభమైంది. అది అంతక్రితం రోజు ముగింపు(35906.66)తో పోలిస్తే అప్పటికే 200 పాయింట్ల నష్టం. బడ్జెట్ ప్రభావం కాస్త పడకుండా ఉంటుందా అనుకున్నారు మదుపర్లు. అయితే అంతర్లీనంగా ఉన్న భయం కొద్ది సేపటికి తెలిసింది. ఆ తర్వాత పూర్తిగా తెలిసింది. అప్పటికే జరగాల్సిన 'నష్టం' జరిగింది. ఒక దశలో ఏకంగా 900 పాయింట్ల నష్టాలకు దగ్గరగా వెళ్లింది. అది కూడా చివర్లోనే. అంటే మొదటి నుంచీ చివరి దాకా పతనం కొనసాగిందన్నమాట. చివరకు సెన్సెక్స్ 839.91 పాయింట్లు(2.34%) కోల్పోయి 35,066.75 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ కూడా నష్టాల్లో డబుల్ సెంచరీ కొట్టింది. 256.30 పాయింట్లు(2.33%) కుప్పకూలి 10,760.60 వద్ద స్థిరపడింది. వారం వారీగా చూస్తే సెన్సెక్స్ 983.69 పాయింట్లు; నిఫ్టీ 309.05 పాయింట్లు కోల్పోయింది. దీంతో ఎనిమిది వారాల లాభాలకు తెరపడినట్లయింది.


వీటికి నష్టాలు

- ✦ గత నెల రోజులుగా రూ.9000 స్థాయిపైన ట్రేడవుతున్న మారుతీ సుజుకీ తొలి సారిగా ఆ స్థాయి దిగువకు వచ్చింది. ఇంట్రా డేలో రూ.8969కి చేరింది. చివరకు మాత్రం రూ.402.65(4.28%) నష్టంతో రూ.9000.30 వద్ద స్థిరపడింది.
- ✦ యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా స్టీల్, ఎం అండ్ ఎం, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, హీరో మోటోకార్ప్, కోటక్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, ఎస్‌బీఐ, టాటా మోటార్స్, యెస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు 4.28 శాతం దాకా నష్టపోయాయి.
- ✦ సూచీల విషయానికొస్తే స్థిరాస్తి అత్యధికంగా 6.28% కోల్పోయింది. మౌలిక(4.03%), విద్యుత్(3.47%), యంత్ర పరికరాలు(3.59%), వాహన(3.47%), మన్నికైన వినిమయ వస్తువులు(3.37%), ఆర్థిక(3.23%), పీఎస్‌యూ(3.11%), చమురు(3.04%) సూచీలూ డీలా పడ్డాయి.
- ✦ చిన్న స్థాయి షేర్ల సూచీ 4.65%; మధ్య స్థాయి షేర్ల సూచీ 4.03% చొప్పున పడ్డాయి.
- ✦ సెన్సెక్స్ 30 షేర్లలో 27 నేలచూపులు చూశాయి. బీఎస్ఈలో మొత్తం 2527 షేర్లకు నష్టాలు తప్పలేదు. కేవలం 310 మాత్రమే ఫర్వాలేదనిపించాయి.

రూ.4.5 లక్షల కోట్లు మాయం!

మదుపర్ల వెన్నులో వణుకు పుట్టింది. బడ్జెట్ ప్రసంగం మరుసటి రోజే ఏకంగా రూ.4.5 లక్షల కోట్లు పోగొట్టుకున్నారు. బీఎస్ఈలోని మొత్తం నమోదైన కంపెనీల మార్కెట్ విలువ రూ.4.5 లక్షల కోట్లు తగ్గి రూ.148.4 లక్షల కోట్లకు పరిమితమైంది. ఏకంగా 2500 షేర్లు నేలచూపులు చూస్తే.. 300 షేర్లు మాత్రం ఫర్వాలేదనిపించుకోగలిగాయి. సాధారణంగా విక్రయాలు జరిగితే అవి చిన్న, మధ్య స్థాయి షేర్లకే పరిమితమవుతుంటుంది. కానీ శుక్రవారం అవీ.. ఇవీ కాదు.. అన్నీ కుదేలవడంతో మార్కెట్ విలువ భారీగా పతనమైంది.

కలవరమాయె మదుపరి మదిలో..



బడ్జెట్ విశ్లేషకులు

దీర్ఘకాల మూలధన లాభాల పన్నును తిరిగి ప్రవేశపెట్టడంతో మదుపర్లకు గురువారం నిద్రలేని రాత్రి అయింది. శుక్రవారం మార్కెట్ భారీ నష్టాలే అందుకు నిదర్శనం. వాళ్లు ఎంతలా భయపడి తెగనమ్ముకున్నారో అర్థమవుతోంది. అయితే ఇదొక్కటే కాదు మరిన్ని ప్రతికూలతలూ నిన్న ప్రకటించిన బడ్జెట్‌లో ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. విశ్లేషకులకూ కంటి మీద కునుకు లేకుండా చేసిన ఆ ప్రతికూలతలేమిటంటే..

1 ఆరోగ్య పథకం.. పది కోట్ల మంది పేద కుటుంబాలకు ఆలంబనగా ప్రకటించిన పథకం ఇది. ఆశయం మంచిదే కానీ.. అంత భారీ పథకానికి ప్రభుత్వం నిధులు ఎక్కడి నుంచి తెస్తుందన్నది అసలు ప్రశ్న. బ్యాంక్ ఆఫ్ అమెరికా-మెరిల్ లించ్(బీఓఏ-ఎమ్ఎల్) నివేదిక ప్రకారం.. 5 శాతం మంది లబ్ధిదారులు సగం మొత్తానికి క్లెయిము చేసుకున్నా.. 20 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.1,30,000 కోట్లు)కు చేరుతుంది. ఇది ఎంత భారీ మొత్తమో తెలిసిందే కదా అంటోంది.

2 జీఎస్‌టీ, ఆదాయ వసూళ్ల విషయంలోనూ సవాళ్లు ఉన్నాయి. ఇవి జీడీపీలో 2 శాతంగానే ఉన్నాయి. వచ్చే ఏడాది ఇవి 4 శాతానికి చేరతాయని అంచనా. అయితే జీఎస్‌టీ అమలు విషయంలో ఇంకా కొన్ని సవాళ్లు ఉన్నాయి. ఆదాయ వసూళ్లు స్థిరంగా ముందుకు వెళ్లడం లేదు. అయితే కొంత కాలానికి ఇది స్థిమితమవుతుందనే అంచనాలున్నాయి.

3 ఆహార, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులపై మొత్తం సబ్సిడీని 15 శాతం పెంచి రూ.2.64 లక్షల కోట్లకు పెంచినప్పటికీ.. అందులో ఇంధన సబ్సిడీని 2017-18 స్థాయిలోనే ఉంచారు. మూడు నెలల్లో బ్రెంట్ ముడి చమురు బారెల్ ధర 75 డాలర్లకు; ఆరు నెలల్లో 82.50 డాలర్లకు చేరుతుందన్న గోల్డ్‌మాన్ శాక్స్ అంచనాల ప్రకారమే అదనంగా రూ.25,000-30,000 కోట్ల భారం పడుతుంది.

4 పరోక్ష పన్నులు 19.1 శాతం మేర పెరుగుతాయని బడ్జెట్ చెప్పడం కొంత అతిశయోక్తిగా ఉందని బ్రోకరేజీ సంస్థలు చెబుతున్నాయి. అలాగే స్థూల పన్నులు కూడా జీడీపీలో 12 శాతానికి మించి పెరుగుతాయని చెప్పడం అలాంటిదేనంటున్నారు.

5 ద్రవ్యోల్బణంపై ఎమ్ఎస్‌పీ ప్రభావం: ఇక కనీస మద్దతు ధర(ఎమ్ఎస్‌పీ)లను పెంచిన నేపథ్యంలో అది ద్రవ్యోల్బణంపై ప్రభావాన్ని చూపుతుంది. ద్రవ్యోల్బణం ఆధారంగా అడుగులు వేస్తున్న ఆర్‌బీఐ వచ్చే పరపతి విధాన సమీక్ష(7న)లో కచ్చితంగా కఠిన వైఖరే అవలంబిస్తుంది. ఇది తక్కువ వడ్డీ రేట్ల కోసం ఎదురుచూస్తున్న పరిశ్రమలకు నిరాశ కలిగించే పరిణామం.

పీసీ జువెలర్ మదుపరి లబోదిబో

దిల్లీ: పీసీ జువెలర్ మదుపరి లబోదిబో మన్నాడు. ఇంట్రాడేలో ఈ షేరు 60 శాతం పతనమైంది. అయితే ఆ తర్వాత స్వల్పంగా కోలుకొని నష్టాన్ని 25 శాతానికి పరిమితమైంది. ఉదయం బీఎస్ఈలో రూ.468 వద్ద ప్రారంభమైన షేరు కొద్ది సేపట్లోనే తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనై రూ.195.10కి దిగివచ్చింది. అనంతరం కొద్దిగా కోలుకున్నప్పటికీ భారీ నష్టాలు కొనసాగాయి. చివరకు 24.40 శాతం క్షీణతతో రూ.365.65 వద్ద ముగిసింది.

ఇదీ కారణం: ఈ నెల ప్రారంభంలో పీసీ జువెలర్ షేర్లను వక్రంజీ కొనుగోలు చేసింది. అయితే షేర్ల విషయంలో అవకతవకలకు పాల్పడిందన్న ఆరోపణలపై వక్రంజీపై సెబీ దర్యాప్తు నిర్వహిస్తోందంటూ వార్తలు రావడంతో ఈ కంపెనీ షేరు పతనమైంది. ఆ ప్రభావం పీసీ జువెలర్ షేర్లపైనా పడింది. అయితే కంపెనీ మూలాలు పటిష్ఠంగా ఉన్నాయంటూ యాజమాన్యం ప్రకటించిన అనంతరం పీసీ జువెలర్ షేర్లకు నష్టాలు తగ్గాయి. 'మా ప్రమోటర్లు ఎవరికీ షేర్లను విక్రయించలేదు. సెకండరీ మార్కెట్లో వక్రంజీ షేర్లను కొంటే మేం ఎలా ఆపుతాం. అయినా మా కంపెనీ మూలాలు పటిష్ఠంగా ఉన్నాయ'ని పీసీ జువెలర్ ఎండీ బలరామ్ గార్గ్ తెలిపారు. పీసీ జువెల్లర్స్‌లో వక్రంజీ వాటా అర శాతం కంటే తక్కువగానే ఉంది. వక్రంజీ షేరు గత ఐదు రోజులుగా నష్టాలను చవిచూస్తోంది.

బిట్‌కాయిన్ కొని, అమ్మిన వారికి నోటీసులు

● లక్షల మందికి ఐటీ తాఖీదులు

● సీబీడీటీ ఛైర్మన్ సుశీల్ చంద్ర

దిల్లీ: బిట్‌కాయిన్లు కొని, విక్రయించిన వారికి ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం నోటీసులు జారీ చేసింది. ఆ పెట్టుబడులకు సంబంధించి పన్నులు వసూలు చేయడమే ధ్యేయమని కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) ఛైర్మన్ సుశీల్ చంద్ర పేర్కొన్నారు. బిట్‌కాయిన్ వంటి క్రిప్టో (ఊహాజనిత) కరెన్సీలపై పెట్టుబడులు పెట్టిన వారు, ఆర్జించిన లాభాలపై ముందస్తు పన్ను చెల్లించలేదని, కొందరు తమ ఐటీ రిటర్నులలో కూడా చూపలేదని తెలిపారు. క్రిప్టో కరెన్సీ లావాదేవీలు నిర్వహించిన ఎక్స్ఛేంజీలపై, సెక్షన్



133 ఏ ఆధారంగా గత డిసెంబరులో దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించామని గుర్తు చేశారు. వాటిల్లో వెలుగుచూసిన లావాదేవీలు, బ్యాంక్ ఖాతాల సమాచారం ఆధారంగా కొన్ని లక్షల మంది మదుపర్లు, ట్రేడర్లకు నోటీసులు జారీచేశామని, వారిలో పలువురు పన్నులు చెల్లించేందుకు సుముఖత చూపారని సుశీల్ చంద్ర వెల్లడించారు. ఈ లావాదేవీలపై సమాచారం ఇవ్వని వారి నుంచి కచ్చితంగా పన్నులు వసూలు చేస్తామని స్పష్టం చేశారు.

ప్రత్యక్ష పన్నుల లక్ష్యాన్ని అధిగమిస్తాం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరడమే కాదు, అధిగమిస్తామనే ధీమాను సీబీడీటీ ఛైర్మన్ వ్యక్తం చేశారు. ఆర్థిక వృద్ధి బాగుందని, మూడో త్రైమాసికానికి వసూలైన ముందస్తు వసూళ్ల కంటే నాలుగో త్రైమాసికం వసూళ్లు మరింత అధికంగా ఉన్నాయని తెలిపారు. వృద్ధి ఇదే తీరులో సాగితే, జీడీపీ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. వృద్ధి ఇదే తీరులో కొనసాగితే, ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో లక్ష్యాన్ని దాటతామని వివరించారు.

✦ 2017-18లో ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యం. రూ.9.8 లక్షల కోట్లు.

అయిదేళ్లలో రూ.500 కోట్లు

హీరో ఎలక్ట్రిక్ విస్తరణ ప్రణాళికలు

దిల్లీ: తయారీ సామర్థ్యం పెంపు, పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) విభాగ విస్తరణ కోసం వచ్చే అయిదేళ్లలో రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు హీరో ఎలక్ట్రిక్ వెల్లడించింది. ఈ ఏడాదిలో దక్షిణాదిలో కొత్త తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కంపెనీ సన్నాహాలు చేస్తోంది. దీంతో పాటు వచ్చే ఏడాది లూధియానా ప్లాంట్ తయారీ సామర్థ్యం పెంచేందుకు సైతం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం ఈ ప్లాంట్ వార్షిక సామర్థ్యం 40,000 వాహనాలుగా ఉంది. 2016-17లో 15,000 వాహనాలు విక్రయించిన సంస్థ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.26,000 ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను విక్రయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం 75,000 వాహనాల అమ్మకాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముంజాల్ వివరించారు. 3 కొత్త బైకులను శుక్రవారం కంపెనీ విడుదల చేసింది. ఏఎక్స్ఎల్‌హెచ్ఈ- 20 హైస్పీడ్ ఇ-బైకు గరిష్ఠ వేగం గంటకు 85 కి.మీ కావడం విశేషం. ఒక్కసారి ఛార్జింగ్ చేసుకుంటే 110 కి.మీ ప్రయాణించొచ్చని కంపెనీ తెలిపింది.



అమెరికా విపణిలోకి డాక్టర్ రెడ్డీస్ ఔషధం

ఈనాడు, హైదరాబాద్: నాడీ కణాల రుగ్మత హంటింగ్‌టన్స్ చికిత్సకు వినియోగించే ఔషధాన్ని అమెరికా విపణిలోకి డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ విడుదల చేసింది. 'టెట్రాబెనాజైన్' జనరిక్ ఔషధం బిళ్లలను విక్రయించడానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి అనుమతి లభించిందని, ఇందుకు అనుగుణంగా బిళ్లలను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టామని కంపెనీ వెల్లడించింది. వాలియన్ ఫార్మాస్యూటికల్స్ లగ్జెంబర్గ్ ఎస్ఏఆర్ఎల్ కంపెనీ, 'జినాజైన్' బ్రాండ్‌తో ఈ ఔషధాన్ని విక్రయిస్తుంది. దీనికి డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఔషధం జనరిక్. 2017, నవంబరుతో ముగిసిన 12 నెలలకు జినాజైన్, దాని జనరిక్ ఔషధాల విక్రయాలు అమెరికాలో 32.2 కోట్ల డాలర్లు ఉన్నట్లు అంచనా.

నవంబరులోనూ జియో వేగమే అధికం: ట్రాయ్

దిల్లీ: 4జీ బ్రాడ్‌బ్యాండ్ వేగంలో వరుసగా 11వ నెలా రిలయన్స్ జియోనే అగ్రస్థానంలో కొనసాగింది. గత నవంబరులో జియో డేటా డౌన్‌లోడ్ సగటు వేగం 25.6 ఎంబీపీఎస్‌గా నమోదైందని, టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ తెలిపింది. వొడాఫోన్ 10 ఎంబీపీఎస్, భారతీ ఎయిర్‌టెల్ 9.8 ఎంబీపీఎస్, ఐడియా సెల్యులార్ 7 ఎంబీపీఎస్ వేగాన్ని నమోదు చేశాయి. 2017 అక్టోబరులో సగటు డౌన్‌లోడ్ వేగం 21.8 ఎంబీపీఎస్‌తో జియోనే అగ్రస్థానంలో నిలిచిన సంగతి విదితమే. డేటా అప్‌లోడ్ వేగానికి సంబంధించి 6.9 ఎంబీపీఎస్‌తో వొడాఫోన్ అగ్రస్థానంలో నిలిచింది. ఐడియా 6.6 ఎంబీపీఎస్, జియో 4.9 ఎంబీపీఎస్, ఎయిర్‌టెల్ 4 ఎంబీపీఎస్ వేగంతో తరవాత స్థానాల్లో నిలిచాయి.

శంషాబాద్ విమానాశ్రయంలో

జీఎంఆర్‌కు మరింత వాటా

- 'మలేషియా ఎయిర్‌పోర్ట్స్' వాటా కొనుగోలుకు ఒప్పందం
- 11% వాటా విలువ రూ.484 కోట్లు
- ఏప్రిల్ 30 నాటికి ప్రక్రియ పూర్తి!

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (శంషాబాద్)లో వాటాను జీఎంఆర్ గ్రూప్ పెంచుకోనుంది. ఈ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీహెచ్ఐఏఎల్)లో అనుబంధ సంస్థ అయిన జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్) ద్వారా జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు వాటా ఉంది. మలేషియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్ బెర్హార్డ్ (ఎంఏహెచ్‌బీ), దాని అనుబంధ సంస్థ ఎంఏహెచ్‌బీ (మారిషస్)కు చెందిన 11 శాతం వాటాకు సమానమైన 4,15,80,000 షేర్ల (ముఖ విలువ రూ.10)ను కొనుగోలు చేయడానికి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఒప్పందం కుదుర్చుకుందని జీఎంఆర్ ఇన్‌ఫ్రా వెల్లడించింది. చట్ట ప్రకారం తీసుకోవాల్సిన అనుమతులకు అనుగుణంగా ఈ వాటా కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుంది. 11 శాతం వాటాను 7.6 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.484 కోట్లు) జీఎంఆర్ గ్రూప్ సొంతం చేసుకుంటోంది. దీని ప్రకారం విమానాశ్రయం విలువ (100 శాతం ఈక్విటీ విలువ) రూ.4,400 కోట్లవుతుంది. హైదరాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి నిర్వహించడానికి ప్రత్యేక కంపెనీగా జీహెచ్ఐఏఎల్‌ను ఏర్పాటు చేశారు. 2008, మార్చి నుంచి 30 ఏళ్లపాటు శంషాబాద్ విమానాశ్రయాన్ని జీఎంఆర్ గ్రూప్ నిర్వహించడానికి వీలుగా కన్సెషనల్ ఒప్పందం కుదిరింది. దీన్ని మరో 30 ఏళ్లు పొడిగించుకునే వెసులుబాటు ఉంది. ప్రారంభించిన నాటి నుంచి ఈ విమానాశ్రయం నుంచి ప్రయాణికుల వృద్ధిరేటు



పెరుగుతున్నందున విమానాశ్రయం సామర్థ్యాన్ని విస్తరించే కార్యక్రమాన్ని జీఎంఆర్ చేపట్టింది. ఈ ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. విస్తరణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి, రుణ భారాన్ని తగ్గించుకోవడానికి ఈ విమానాశ్రయంలో తనకున్న వాటాలో కొంత భాగాన్ని విక్రయించే అంశాన్ని జీఎంఆర్ పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో మలేషియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్‌కు ఉన్న వాటాను జీఎంఆర్ కొనుగోలు చేయడం విశేషం. 1,000 ఎకరాల్లో ఎయిర్‌పోర్ట్ సిటీ (ఏరోట్రోపోలిస్) అభివృద్ధి చేయాలని కూడా జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదించింది. ప్రస్తుతం జీహెచ్ఐఏఎల్‌లో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు 63 శాతం, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు 13 శాతం, తెలంగాణ ప్రభుత్వానికి 13 శాతం, మలేషియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్‌కు 11 శాతం వాటా ఉంది. ఈ కంపెనీ వాటా జీఎంఆర్ గ్రూప్ చేతికి వస్తే.. శంషాబాద్ విమానాశ్రయంలో జీఎంఆర్‌కు 74 శాతం వాటా ఉంటుంది.

22% పెరిగిన ప్రయాణికులు

గత ఆర్థిక సంవత్సరంలో (2016-17) హైదరాబాద్ విమానాశ్రయం నుంచి 1,52,40,068 (1.52 కోట్లు) మంది ప్రయాణికులు రాకపోకలు నిర్వహించారు. ఇందులో దేశీయ గమ్యస్థానాలకు రాకపోకలు నిర్వహించిన వారు 1,19,36,975 (రూ.1.19 కోట్లు) మంది కాగా.. విదేశాల నుంచి వచ్చిన వారు, వెళ్లిన వారు 33,03,093 మంది ఉన్నారు. అంతక్రితం ఏడాది మొత్తం ప్రయాణికులు 1,24,93,397 మందితో పోలిస్తే 2016-17లో ప్రయాణికుల వృద్ధిరేటు 22 శాతం ఉంది. కార్యకలాపాలు ప్రారంభించిన నాటి నుంచి ఒక్క 2012-13 మినహా మిగిలిన అన్ని సంవత్సరాల్లో వృద్ధిరేటే నమోదైంది. మొదటి సంవత్సరంలో మొత్తం 62 వేల మంది ఇక్కడ నుంచి రాకపోకలు నిర్వహించారు. ఏడాదికి 1.2 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు నిర్వహించడానికి ఈ విమానాశ్రయంలో సదుపాయాలు ఉండగా.. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి ప్రయాణికుల సంఖ్య 1.8 కోట్ల మందికి చేరగలదని అంచనా వేస్తున్నారు. వృద్ధిరేటుకు అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచనున్నారు. ముందుగా సామర్థ్యాన్ని 2.5 కోట్లకు పెంచనున్నామని, ఈ పనులు 2018, జనవరిలో ప్రారంభమవుతాయని గతంలో జీహెచ్ఐఏఎల్ సీఈఓ ఎస్.జి.కె. కిషోర్ తెలిపారు. ఆ తర్వాత ఈ సామర్థ్యాన్ని 6-7 కోట్ల మంది ప్రయాణికులకు పెంచాలన్న యోచన ఉంది.

ఆకర్షణీయ విలువ..

శంషాబాద్ విమానాశ్రయంలో తాము పెట్టిన పెట్టుబడులకు ఆకర్షణీయ ప్రతిఫలం లభించినందున వాటాను విక్రయించడానికి ఒప్పందం కుదుర్చుకున్నామని మలేషియా ఎయిర్‌పోర్ట్స్ వెల్లడించింది. ఈ వాటా విక్రయం ద్వారా లభించిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకోనున్నట్లు తెలిపింది. వాటా కొనుగోలు ప్రక్రియ ఏప్రిల్ 30 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది.

తెరపైకి మళ్లీ పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదన!

పబ్లిక్ ఇష్యూకు ద్వారా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ కంపెనీని స్టాక్ మార్కెట్‌లో నమోదు చేయాలని జీఎంఆర్ ఇన్‌ఫ్రా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా ఈ అంశం తెరపైకి వచ్చింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.4,000 కోట్లకు పైగా సమీకరించాలన్నది జీఎంఆర్ ఆలోచనని, ఇష్యూకు సంబంధించి లీడ్ మేనేజర్లతో సంప్రదింపులు జరుగుతున్నాయని భోగట్టా.

ఇది వ్యవసాయ బడ్జెట్టే: నిపుణులు

ఈనాడు, హైదరాబాద్: దేశంలో రైతులు అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని. . వారికి మద్దతు కల్పించడానికి, ఆదాయాలను పెంచడానికి బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్ద పీట వేసిందని నిపుణులు విశ్లేషించారు. బడ్జెట్‌లో తీసుకున్న చర్యల వల్ల కనీస మద్దతు ధర విధానాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేయడానికి మార్గం సగమం అయిందని, దీన్ని వ్యవసాయ బడ్జెట్‌గా పేర్కొనవచ్చని బడ్జెట్‌పై డెలాయిట్‌తో కలిసి ఎఫ్‌టాప్సీ ఏర్పాటు చేసిన విశ్లేషణ కార్యక్రమంలో పేర్కొన్నారు. విదేశాలను ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి బదులు సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడాన్ని ప్రోత్సాహించడానికి దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం పెంచిందని.. దిగువస్థాయి, మధ్య తరగతి వర్గాల వారు ఆర్యోగ సంరక్షణ కోసమే పొదుపు చేసుకుంటారని, అటువంటి వారి కోసం ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ కవరేజీ పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడం చాలా కీలక నిర్ణయమని డెలాయిట్ పార్టనర్ గణేశ్ బాలకృష్ణన్ తెలిపారు. జీఎస్‌టీ అమలు తర్వాత ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్ చరిత్రాత్మక బడ్జెట్ అని జీఎస్‌టీ అండ్ కస్టమ్స్ హైదరాబాద్ జోన్ చీఫ్ కమిషనర్ బి.బి.అగర్వాల్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో ప్రభుత్వం నాలుగు అంశాలు- వ్యవసాయం, విద్యా, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని ఎఫ్‌టాప్సీ ప్రెసిడెంట్ గౌర శ్రీనివాస్ అన్నారు.

బీఎస్ఈ లాభం రూ.58 కోట్లు

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అగ్రగామి స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్ఈ రూ.58.67 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.52.77 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 11 శాతం అధికం. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.86.40 కోట్ల నుంచి 45 శాతం వృద్ధితో రూ.125.70 కోట్లకు చేరింది. ఈక్విటీ క్యాష్ విభాగం సగటు దినసరి టర్నోవర్ 57 శాతం వృద్ధితో రూ.4,781 కోట్లకు చేరింది. ఇక కరెన్సీ డెరివేటివ్ విభాగ సగటు దినసరి టర్నోవర్ సైతం 38 శాతం పెరిగి రూ.17,399 కోట్లకు చేరింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలల్లో బీఎస్ఈ నికర లాభం రూ.160.46 కోట్ల నుంచి 305 శాతం అధికమై రూ.649.20 కోట్లకు చేరింది. రూ.2 ముఖవిలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.5 మధ్యంతర డివిడెండు చెల్లించేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

2వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో)

కోడిగుడ్లు				
	హైదరాబాద్	360	వరంగల్	362
	చిల్లరగా(ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	365
	బెంగళూరు	380	చెన్నై	390
	3న		చిత్తూరు	383
	విజయవాడ/గోదావరి	360	నమక్కల్	375

బజాజ్ ఆటో లాభం రూ.1,013 కోట్లు

దిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో బజాజ్ ఆటో ఏకీకృత నికర లాభం 3.8% పెరిగి రూ.1,013.16 కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఇదే సమయంలో నికర లాభం రూ.976.82 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం కూడా రూ.5,354.13 కోట్ల నుంచి రూ.6,369.34 కోట్లకు పెరిగింది. సమీక్ష త్రైమాసికంలో మొత్తం 10,01,469 వాహనాలను విక్రయించగా.. 2016 అక్టోబరు- డిసెంబరులో అమ్మిన 8,51,645 వాహనాలతో పోలిస్తే 17.6 శాతం పెరిగాయి. 'మేం మంచి పనితీరును కనబర్చాం. అయితే మార్కెట్లో ప్రతికూల పరిస్థితుల కారణంగా పెట్టుబడులపై ఆదాయం తగ్గడం లాభంపై ప్రభావం పడింద'ని బజాజ్ ఆటో అధ్యక్షుడు (వ్యాపార అభివృద్ధి) ఎస్.రవి కుమార్ తెలిపారు. ఏడాదిక్రితం పెట్టుబడులపై ఆదాయం రూ.24,161 కోట్లు కాగా.. ఈసారి రూ.161.47 కోట్లు మాత్రమే వచ్చింది. మోటర్ సైకిళ్ల అమ్మకాలు 9 శాతం వృద్ధితో 7,48,961 వాహనాల నుంచి 8,18,510 వాహనాలకు చేరగా.. వాణిజ్య వాహనాల విక్రయాలు 78 శాతం వృద్ధితో 1,82,959 వాహనాలుగా నమోదయ్యాయి. ఎగుమతుల ద్వారా ఆదాయం 24 శాతం పెరిగి రూ.1,935 కోట్ల నుంచి రూ.2,401 కోట్లకు చేరింది.

హిందాల్కో ఆకర్షణీయం

దిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ హిందాల్కో ఇండస్ట్రీస్ స్టాండలోన్ ప్రాతిపదికన రూ.377.14 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.320.56 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 17.65 శాతం అధికం. సుప్రీం కోర్టు గనుల నిబంధనల అనుగుణంగా రూ.115 కోట్లు కేటాయించినట్లు హిందాల్కో తెలిపింది. ఇక మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.9,914.81 కోట్ల నుంచి 11,023 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.9,675.44 కోట్ల నుంచి రూ.10,576.13 కోట్లకు చేరాయి. సమీక్షిస్తున్న త్రైమాసికంలో మూలధన తరుగుదల 7 శాతం పెరిగిందని, దీర్ఘకాలిక రుణాలను ముందే చెల్లించడంతో వడ్డీ వ్యయాలు 18 శాతం మేర తగ్గాయని వెల్లడించింది.

న్యూలాండ్ ల్యాబ్స్ లాభంలో 67% క్షీణత

ఈనాడు, హైదరాబాద్: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన న్యూలాండ్ లేబొరేటరీస్ రూ.1.21 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.3.63 కోట్లతో పోలిస్తే 67% తగ్గింది. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయ 13% క్షీణించి రూ.134.89 కోట్ల నుంచి రూ.117.28 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. కొన్ని విభాగాల్లో ఒత్తిడి కొనసాగడం వల్ల ఆదాయం, నికర లాభం తగ్గాయని న్యూలాండ్ ల్యాబ్స్ సీఈఓ, వైస్ ఛైర్మన్ సుచేత్ దవులూరి తెలిపారు. 2017, డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.363.61 కోట్ల ఆదాయంపై రూ.6.1 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ప్రకటించిందని సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ సహర్షా దవులూరి చెప్పారు. ఏడాది క్రితం ఇదే కాలానికి ఆదాయం రూ.438.85 కోట్లు, నికర లాభం రూ.23.37 కోట్ల మేరకు ఉన్నాయి.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2017–18	2016–17	2017–18	2016–17
గోద్రేజ్ ప్రాపర్టీస్	25.94	77.24	674.31	551.66
ఎంఆర్‌పీఎల్	970	567	17,417	----
వర్ల్‌పూల్	53.14	55.44	979.26	919.89
ఇన్ఫో ఎడ్జ్	53.3	47.1	227.1	186
గ్లాక్సోస్మిత్‌క్లైన్	89.69	52.95	703.91	706.38
బేయర్ క్రాప్‌సైన్స్	10.7	36.8	482.6	716
టాటా గ్లోబల్ బెవరేజెస్	188.64	144.54	1,750.94	1,757.63
ఫ్యూచర్ లైఫ్‌స్టైల్	44.45	35.85	1,236.97	1,066.21
ఆదిత్య బిర్లా ఫ్యాషన్	35	12	1,862	1,715

నేటి బోర్డు సమావేశాలు

- ★ యూనియన్ బ్యాంక్
- ★ ఆర్తి ఇండస్ట్రీస్
- ★ జేకే సిమెంట్
- ★ లుమ్యాక్స్ ఇండస్ట్రీస్
- ★ రిలాక్సో ఫుట్‌వేర్

దక్షిణాదిలో కొత్త యూనిట్!

- పరిశీలిస్తున్న ఎవరెస్ట్ ఇండస్ట్రీస్
- పీఈబీ భవనాలకు మాన్యువల్ విడుదల

ఈనాడు, హైదరాబాద్: భవన నిర్మాణంలో వినియోగించే ఉత్పత్తులను తయారు చేయడానికి దక్షిణాదిలో కొత్తగా ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ఎవరెస్ట్ ఇండస్ట్రీస్ ఎండీ మనీశ్ సంఘీ తెలిపారు. అయితే.. ఇది ఇంకా ఆలోచన దశలోనే ఉందని.. కేరళను మినహాయించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా మిగిలిన రాష్ట్రాల్లో ఏర్పాటుకు చర్చలకు కంపెనీ సుముఖంగా ఉందన్నారు. ఒకవేళ యూనిట్ ఏర్పాటు చేస్తే.. రూ.50 కోట్ల నుంచి రూ.250 కోట్ల మధ్య పెట్టుబడులు ఉండొచ్చని చెప్పారు. భవన నిర్మాణంలో వినియోగించే రూఫింగ్, సీలింగ్, వాల్స్, ఫ్లోరింగ్‌ల వంటి వాటిని ఉత్పత్తి చేసి కంపెనీ విక్రయిస్తోంది. వీటితోపాటు ప్రీఇంజినీర్డ్ ఉక్కు భవనాల (పీఈబీ) నిర్మాణంలో కూడా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పీఈబీ భవనాల నిర్మాణానికి సాంకేతిక మాన్యువల్‌ను దేశంలో తొలిసారిగా ఎవరెస్ట్ విడుదల చేసింది. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగిన సందర్భంగా మనీశ్ మాట్లాడారు. కంపెనీకి ఇప్పటికే 6 యూనిట్లు ఉన్నాయి. ఎవరెస్ట్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.1,300 కోట్ల టర్నోవరు నమోదు కాగలదని, ఇందులో రూ.500 కోట్లు పీఈబీ వ్యాపారం నుంచి లభించగలదని అంచనా వేస్తోంది. మూడు యూనిట్లలో ఏడాదికి 75 వేల టన్నుల పీఈ భవన నిర్మాణ ఉత్పత్తులను తయారు చేసే సామర్థ్యం కంపెనీకి ఉందని, సంఘటిత రంగంలో పీఈ భవన నిర్మాణ పరిశ్రమ పరిమాణం



ప్రీ-ఇంజినీర్డ్ భవనాల కోసం సాంకేతిక మ్యాన్యువల్‌ను విడుదల చేస్తున్న ఎవరెస్ట్ ఇండస్ట్రీస్ ఎండీ మనీశ్ సంఘీ, పీఈబీ వ్యాపారం సీఈఓ మనీశ్ గార్గ్

రూ.5,000 కోట్ల పైన ఉండగలదని ఎవరెస్ట్ పీఈబీ వ్యాపార విభాగం సీఈఓ మనీశ్ గార్గ్ తెలిపారు. ఈ పరిశ్రమ ఏడాదికి 20 శాతం చొప్పున వృద్ధి చెందుతోందన్నారు. నిర్మాణంలో జాప్యం జరిగితే నిర్మాణ వ్యయం గణనీయంగా పెరుగుతుందని.. పీఈబీ భవన నిర్మాణం చాలా స్వల్పకాలంలో పూర్తవుతుందని గార్గ్ చెప్పారు. దీని వల్ల భద్రత కూడా ఉంటుందని వివరించారు. ప్రీ-ఇంజినీర్డ్ బిల్డింగ్స్ నిర్మాణ రంగంలో దేశంలో 6-7 కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, పెద్ద భవనాలు, గోదాములు, పాఠశాలలు వంటి కూడా ప్రీఇంజినీర్డ్ భవనాలను నిర్మిస్తున్నారు.

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 417.95 (428.75) 4265914
AMBUJA CEMEN 259.55 (266.45) 3017102
ASIAN PAINTS 1137.90 (1153.00) 872105
AUROBIND PHA 605.45 (611.20) 2253413
AXIS BANK LT 564.90 (592.80) 6185174
BAJAJ AUTO L 3241.30 (3412.95) 1269438
BAJAJ FINANC 1628.90 (1729.45) 1645045
BHARTI AIRTE 422.35 (438.40) 6009663
BHARTI INFRA 344.85 (346.85) 4467011
BOSCH LTD 19474.40 (19517.85) 22653
BPCL 477.15 (490.35) 2990091
CIPLA 581.15 (587.05) 998752
COAL INDIA L 290.35 (295.60) 6393201
DR. REDDYS 2123.55 (2157.95) 959646
EICHER MOTOR 27811.75 (28047.35) 149859
GAIL 466.45 (486.25) 3418999
HCL TECH 990.90 (984.90) 1672528
HDFC 1903.85 (1967.55) 3272591
HDFC BANK 1948.00 (1991.15) 1836531
HERO MOTOCOR 3623.45 (3732.95) 469510
HINDALCO IND 249.85 (256.25) 21737420
HINDUSTAN UN 1372.20 (1371.25) 1699619
HPCL 374.50 (392.35) 3892171
ICICI BANK 335.10 (346.20) 16957983
INDIABULLS H 1319.60 (1377.45) 2120577
INDIAN OIL 408.65 (417.90) 4844239
INDUSINDBANK 1761.30 (1795.45) 2192706
INFOSYS LTD 1143.25 (1144.60) 5122243
ITC 275.35 (275.30) 35008302
KOTAK MAHIND 1085.95 (1120.95) 2281820
LARSEN & TOU 1415.45 (1455.60) 3621563
LUPIN 847.00 (860.40) 2532888
M&M 770.25 (798.75) 3783976
MARUTI SUZIK 8990.60 (9401.85) 984189
NTPC LTD 165.20 (169.05) 4003119
ONGC 192.70 (194.90) 12239774
POWER GRID C 192.90 (194.85) 12422214
RELIANCE IND 904.35 (943.85) 13242095
SBI 297.35 (306.05) 23274673
SUN PHARMA 551.20 (554.30) 10873325
TATA CONSULT 3153.65 (3138.60) 1228245
TATA MOTORS 383.75 (393.65) 10070356
TATA STEEL L 670.45 (696.75) 6500926

ఘనం (+)

నిఫ్టీ	2న	మార్పు%
TECH MAHINDRA	619.45	1.37
HCL TECH	990.90	0.61
TCS	3153.65	0.48
HUL	1372.20	0.07
ITC	275.35	0.02

గ్రహణం (-)

నిఫ్టీ	2న	మార్పు%
BAJAJ FINANCE	1628.90	-5.81
BAJAJ AUTO	3241.30	-5.03
ULTRATECH CEM	4179.45	-4.83
AXIS BANK	564.90	-4.71
HPCL	374.50	-4.55
MARUTI SUZUKI	8990.60	-4.37
INDIABULLS HSG	1319.60	-4.20

TECH MAHINDR 619.45 (611.05) 3994302
ULTRATECH 4179.45 (4391.45) 240012
UPL LIMITED 733.05 (758.85) 2254820
VEDANTA LIMI 334.30 (341.45) 11879455
WIPRO 300.60 (300.75) 2517624
YES BANK LTD 349.05 (359.90) 16298953
ZEE ENTERTAI 586.10 (594.95) 1443177

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1678.55 (1700.45) 147057
ACC 1679.80 (1737.00) 262985
ASHOK LEYLAN 122.30 (123.35) 38049390
AVENUE SUPER 1135.10 (1174.30) 595510
BAJAJ FINSER 4935.75 (5038.40) 375160
BANK OFBAROD 153.20 (152.35) 24420057
BEL 151.85 (161.55) 13247909
BHEL 93.50 (100.35) 12197761
BRITANNIA 4726.45 (4740.50) 187184
CADILA HEALT 410.85 (417.65) 751620
COLGATE PALM 1117.65 (1130.45) 258400
CONTAINER 1337.70 (1387.30) 625235
CUMMINS INDI 829.20 (903.05) 1849800
DABUR INDIA 344.45 (349.70) 1350425
DLF LIMITED 223.40 (245.00) 16904503
EMAMI LIMITE 1104.85 (1142.10) 400349
GLAXOSMI CON 6607.95 (6716.80) 7342
GLAXOSMI PHA 2467.85 (2459.15) 11220
GLENMARK PHA 589.55 (588.15) 1308916
GODREJ CONSU 1051.60 (1053.30) 517329
HAVELLS INDI 509.60 (525.40) 1090876
HINDUSTAN ZI 294.35 (307.95) 1780007
ICICI PRU LI 422.80 (424.90) 3555957
IDEA CELLULR 88.30 (91.30) 23507092
INTERGLOBE A 1177.80 (1216.80) 894858
JSW STEEL LT 299.00 (302.65) 12354843
LIC HOUS.FIN 511.90 (531.85) 3580691
MARICO LIMIT 304.50 (310.70) 1147132
MCDOWELL 3182.30 (3302.80) 498222
MOTHERSON 352.05 (362.75) 3756722
MRF 69259.40 (71776.65) 19860
NHPC LTD 27.85 (29.15) 8726582
NMDC LTD 132.80 (141.70) 5070189
OIL INDIA 345.65 (357.90) 410036
ORACLE FIN S 4192.80 (4207.95) 50521
P&G HYG&HEAL 9226.75 (9259.25) 2337
PETRONET LNG 243.30 (252.10) 5596819
PIRAMAL ENTE 2648.65 (2749.15) 244101
PNB 161.85 (167.55) 17622089
POWER FIN CO 110.95 (117.00) 10086451
RURAL ELEC C 145.40 (153.45) 7276175
SAIL 83.60 (89.35) 13852493
SHREE CEMENT 17038.40 (17453.05) 22005
SHRIRAM TRAN 1321.90 (1380.05) 964172
SIEMENS 1292.85 (1323.75) 251785
SUN TV LTD 953.15 (1012.40) 1040044
TATA POWER 84.80 (89.70) 6950966
TITAN IND 822.20 (831.00) 8088986
TORRENT PHAR 1358.35 (1354.90) 89079

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 865.15 (893.85) 2368
AMAR RAJA BA 768.75 (804.05) 47100
ANDHRA BANK 49.20 (51.25) 567855
ANDHRA CEMEN 12.54 (13.20) 17689
ANDHRA PAPER 304.25 (325.40) 40699
ANDHRA PETRO 64.05 (67.05) 136326
ANDHRA SUGAR 612.35 (628.20) 5986
ASTRA MICROW 108.15 (112.70) 91991
AUROBINDO PH 605.10 (612.80) 238290
AVANTEL SOFT 510.65 (537.50) 11314
AVANTI FEEDS 2345.70 (2400.80) 35231
AVON ORG 14.40 (15.10) 7259
BALAJI AMIN 618.90 (675.70) 30067
BARTRONICS 13.35 (13.78) 28905
BHAGIRA CHEM 292.05 (289) 3575
BHAGYA NAG 38.85 (41.10) 25042
BRILLIANT SE 14.90 (15.65) 39822
CAMBRIDGE TE 81.75 (83.40) 1349
COMBAT DRUGS 27.40 (27.40) 3000
CONT COFFEE 276.75 (294.60) 19632
COROMAN FERT 548.05 (544.80) 16979
CYBERMATE 3.36 (3.51) 64510
CYIENT LIMIT 618.50 (640.85) 31295
DIVI'S LAB 1028.90 (1040.95) 47778
DR REDDY 2122.10 (2156.95) 86932
GATI CORPN 120 (128.15) 403869
GAYATRI PROJ 205.05 (211.10) 34181
GMR INFRASTR 19.25 (22.75) 15265916
GOLDST INFRA 199.95 (222.15) 47831
GRANULES (I) 121.40 (128) 233428
GVK POWER 20.50 (21.55) 994827
HBL NIFE POW 56.90 (62.25) 207121
HERITAGE FOO 724.95 (751.40) 5769
HYD INDUS 1654.40 (1748.65) 2987
IDL INDUSTRS 598.05 (598.40) 11348
IKF SOFT 1.19 (1.14) 802377
ILFS ENGINEE 44.15 (46.45) 7108
INNAREDY COM 4.51 (4.50) 66605
IVRCL INFRAS 4.99 (5.25) 293768
KAKATIYA CEM 341.20 (373.55) 21768
KAVERI SEED 493.70 (507.55) 44569
KCP LTD 131.30 (140.45) 93576
LANCO INDUS 363.10 (378.90) 29011
LANCO INFRAT 1.49 (1.56) 1970982
LAURUS LABS 510.75 (517.55) 12118
MADHUCON PRO 29.60 (32.10) 37416
MIC ELECTRON 8.13 (8.55) 127311
MOLD-TEK.TEC 69.45 (68.90) 4428
MOLDTK PLA 340.45 (344.85) 10119
NAGARJAGRICH 51.10 (57) 107239
NATCO PHARMA 924.35 (942.60) 24196
NAVA BH VENT 148.35 (157) 87719
NCC 115.15 (124.50) 677199
NCL IND 255.30 (270.95) 25566
NEHA INTER 7.17 (7.58) 46619
NETTLINX 88.65 (92.10) 12611
NEULAND LAB 787.95 (820.90) 16071
OIL COUNTRY 45.65 (50.55) 20882
PANYAM CEMEN 55.25 (57.50) 15307
PENNER IND 57 (60.95) 149455
PIONEER DIST 185.50 (196.90) 4339
PITTI LAMIN 80.95 (85.65) 14228
POKARNA 211.70 (221.25) 10923
PREMIER EXPL 408.60 (426.05) 2116
PRISM CEMENT 126.70 (134.65) 219004
PRUDENTL PHA 4.66 (4.65) 374011
RAIN INDUSTR 331.80 (362.85) 837581
SAGAR CEM 962.05 (1004.60) 2761
SAMKRG PIST 304.70 (320.85) 14784
SATVAH. ISPA 23.20 (25.80) 45736
SMS PHARMA 92.90 (97.40) 21352
SREE RAYAL A 56.05 (63.55) 558571
SRINIVASA SH 67 (68.50) 26941
STEEL EXCHAN 31.70 (33.10) 39230
SUJANA METAL 1.50 (1.50) 48143
SUJANA TOWER 4.29 (4.33) 34302
SUJANA UNIVE 1.12 (1.17) 54280
SURYALAKSH.C 85.05 (89) 6597
SUVEN PHARMA 191.65 (209.45) 226923
TAJ GVK HOTE 166.90 (174.55) 23523
TERA SOFTWAR 60.25 (65.40) 10891
VAMSHI RUBB 49.15 (51.90) 1875
VICEROY HOTE 16.45 (17.20) 122288
VIMTA LABS 199.60 (214.20) 38579
VIVIMED LABS 80.10 (85.10) 156449
YBRANT DIGIT 5.75 (6.01) 539166
ZENTECH 112.65 (119.85) 62090

హామీలను నెరవేర్చే బడ్జెట్

- రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని 2014లోనే హామీ ఇచ్చాం
- అందుకే వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టీకరణ

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను రూపొందించలేదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. ఎన్నికల సంవత్సరం కావడంతోనే మధ్య తరగతి, కార్పొరేట్ ప్రయోజనాలను ఫణంగా పెట్టి వ్యవసాయంపై అవసరానికి మించి దృష్టి కేంద్రీకరించారన్న విమర్శలను కొట్టిపారేశారు. ఆర్థిక రంగ వాస్తవ పరిస్థితులను బడ్జెట్ పరిగణనలోకి తీసుకుందని అన్నారు. 'తయారీ రంగం, సేవా రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి. వ్యవసాయ రంగం గత ఏడెనిమిదేళ్లుగా వెనకబడిపోయింది. అందువల్ల మొత్తం ఆర్థిక వ్యవస్థను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చామ'ని చెప్పారు. తాజా బడ్జెట్‌పై దూరదర్శన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన అభిప్రాయాలను వివరించారు.

ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్ అన్న వ్యాఖ్యలపై మీ అభిప్రాయం...?

ఈ బడ్జెట్‌కు రానున్న ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని 2014 ఎన్నికల్లోనే వాగ్దానం చేశాం. అందువల్ల వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలు లభించేలా ఈ బడ్జెట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొంది. వ్యవసాయం తరువాత సాంఘిక సంక్షేమంపై దృష్టిపెట్టాం. మరో 8 కోట్ల మందికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇవ్వనున్నాం. ఆయుష్మాన్ భారత్ జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం పది కోట్ల పేద కుటుంబాలకు ప్రయోజనం కలిగిస్తాం. ప్రతి కుటుంబానికీ బీమా కార్డు ఇస్తాం.

ప్రస్తుత బడ్జెట్‌లో అన్నీ సంక్షేమ కార్యక్రమాలే ఉన్నాయి. గతంలో మాదిరిగా పెద్దగా సంస్కరణలేమీ కనిపించడం లేదు..?


గత నాలుగు బడ్జెట్టుల్లో వరుసగా పలు వ్యవస్థాగత మార్పులు చేశాం. వాటన్నింటినీ ప్రస్తుతం స్థిరీకరించాం.

మద్దతు ధరలు పెంచడం వల్ల ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుందని నిపుణులు అంటున్నారు కదా...?

మద్దతు ధరలు పెంచడం వల్ల ఆహార ద్రవ్యోల్బణం పెరగడం నిజమే. కానీ కచ్చితంగా ఇది రైతుల పరిస్థితిని మెరుగుపరుస్తుంది. రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి సాగునీటి కల్పన వంటి ఇతర చర్యలూ తీసుకుంటున్నాం.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని ఏవిధంగా ప్రజలకు చేరువ చేస్తారు?

ఆరోగ్య శాఖ విధివిధానాలను రూపొందిస్తుంది. ఆదాయపు పన్నుపై సర్‌ఛార్జి పెంచడం ద్వారా జమ అయిన నిధులను ఆర్థిక శాఖ అందజేస్తుంది. ఎక్కువ మందికి బీమా వర్తింపజేస్తే



ప్రీమియం కూడా తక్కువగా ఉంటుంది. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చు.

ఉద్యోగాలు లేకపోవడం కారణంగా చాలా రాష్ట్రాల్లో ఆందోళనలకు దారితీస్తోంది. దీన్ని ఎలా అరికడతారు?

ఉద్యోగాలు కల్పించేవారికి ఈ బడ్జెట్‌లో ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించాం. బ్యాంకులకు మూలధనం సమకూర్చడంతో అవి రుణాలు ఇచ్చే సామర్థ్యం పెరిగింది. ఇవన్నీ ఉద్యోగాల కల్పనకు దోహదం చేస్తాయి.

చిన్నవాటికే తప్ప పెద్ద కంపెనీలకు ఎలాంటి పన్ను రాయితీలు లేవు. కారణం ఏమిటి?

గత ఏడాది రూ.50 కోట్ల టర్నోవర్ ఉన్న చిన్న కంపెనీలకు 25% మేర పన్ను మినహాయింపులు ఇచ్చాను. ఈ ఏడాది టర్నోవర్ పరిమితిని రూ.250 కోట్లకు పెంచాను. అంటే మొత్తం చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తక్కువ పన్ను పరిధిలోకి వచ్చినట్టయింది. రూ.250 కోట్లకు మించి టర్నోవర్ ఉన్న ఏడు వేల పెద్ద కంపెనీలే ఈ పరిధిలో లేవు. క్రమేణా వీటికి మినహాయింపులు ఇస్తాం. పన్ను అధికంగా ఉంటే కంపెనీలు ఇతర దేశాలకు వెళ్లిపోతాయి.

దీర్ఘకాలిక కాపిటల్ గెయిన్స్ రూ.లక్షకు మించితే 10% పన్ను విధించడంపై షేర్ మార్కెట్ వర్గాలు విమర్శిస్తున్నాయి కదా...?

2016-17లో పెద్ద కంపెనీలు, పెద్ద పెట్టుబడుదారులు రూ.3.67 లక్షల కోట్లు లాభాలు ఆర్జించినట్టు గత బడ్జెట్‌లో వెల్లడయింది. ఇంత భారీగా లాభాలు గడించినా ఒక్క రూపాయి పన్ను కట్టలేదు. ఇది న్యాయమేనా?

షేర్ మార్కెట్‌లో సొమ్ములు పెట్టిన చిన్నతరహా పెట్టుబడుదారులు కూడా విమర్శిస్తున్నారు కదా..?

రూ.లక్ష వరకు ఎలాంటి పన్ను లేదు. చిన్న తరహా పెట్టుబడిదారులపై ఎలాంటి భారం పడదు.

\- ఈనాడు, దిల్లీ

మధ్యతరగతికి సాయం ఇదివరకే చేశాం

తాజా బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలకు ఆదాయపు పన్ను అంశంలో ఉపశమనం కలిగించకపోవటాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమర్థించుకున్నారు. గత బడ్జెట్లలోనే వారికి సాధ్యమైనంత మేలు చేశామని, భవిష్యత్తులో దేశ ఆర్థిక పరిస్థితులు అనుమతిస్తే మరిన్ని అనుకూలతలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. దేశంలో ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చిన సంఖ్య చాలా తక్కువగా ఉందని, ఈ పరిధిని పెంచుకోవటంలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. పన్ను పరిధిలోకి వచ్చే వారి సంఖ్యను తగ్గించుకోవటం అభిలషణీయం కాదని అభిప్రాయపడ్డారు. "నేను సమర్పించిన గత నాలుగైదు బడ్జెట్లను విశ్లేషిస్తే ఓ పద్ధతి ప్రకారం చిన్నస్థాయి పన్ను చెల్లింపుదార్లకు ఉపశమనం కల్పించే చర్యలు తీసుకున్న విషయం తెలుస్తుంది" అని మంత్రి పేర్కొన్నారు.

మోదీ బడ్జెట్‌పై సెన్సెక్స్ అవిశ్వాస తీర్మానం

రాహుల్ గాంధీ ట్వీట్

కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు చేశారు. స్టాక్ మార్కెట్ 800 పాయింట్లకు పడిపోవడాన్ని, బడ్జెట్‌కు లంకె పెడుతూ ట్వీట్ చేశారు. స్టాక్ మార్కెట్ మోదీ బడ్జెట్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిందని వ్యాఖ్యానించారు. "పార్లమెంటు పరిభాషలో చెప్పాలంటే.. మోదీ బడ్జెట్‌పై సెన్సెక్స్ 800 పాయింట్లతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది" అని ట్వీట్ చేశారు. 'ఇంకా ఒక్క ఏడాది మాత్రమే' ('బస్ ఏక్ ఔర్ సాల్') అన్న వ్యాఖ్యను దానికి జత చేశారు. బడ్జెట్‌ను విమర్శిస్తూ గురువారం కూడా ట్వీట్ చేశారు.

రక్షణ రంగం

సొంత తయారీ అంతంత మాత్రమే!




దేశీయ ఉత్పత్తిని పెంచేందుకే 2018-19 బడ్జెట్‌లో భారీ కేటాయింపులు

రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపుల్ని ఏటేటా పెంచుకుంటూ పోతున్నాం. కానీ రక్షణ ఉత్పత్తుల దేశీయ తయారీ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. దీనిని ప్రోత్సహించే లక్ష్యంతో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2018-19లో రక్షణ బడ్జెట్‌ను దాదాపు రూ.2.95 లక్షల కోట్లుగా ప్రతిపాదించారు.

ప్రభుత్వం తీసుకురాబోయే నూతన రక్షణ ఉత్పత్తి విధానంతో.. రక్షణ ఉత్పత్తుల దేశీయ తయారీ ఊపందుకునే అవకాశముంది. 'మేక్ ఇన్ ఇండియా'లోనూ రక్షణ రంగంలో స్వయంసమృద్ధి కీలకాంశం. ఇప్పటికైతే ఆయుధాలు, రక్షణ సామగ్రి కోసం.. విదేశాలపై అతిగా ఆధారపడే దేశాల్లో మనమే ముందున్నాం. సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల లేమి దీనికి ప్రధాన కారణాలు. రాఫెల్ జెట్ యుద్ధ విమానాల్ని ఫ్రాన్స్ నుంచి కొనడానికి సిద్ధపడటం దీనికో ఉదాహరణ. ఎఫ్-16 యుద్ధ విమానాల దేశీయ తయారీకి కేంద్రం ఇంతవరకూ నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ఆయుధ కర్మాగారాలు తయారుచేసిన ఇన్సాస్ రైఫిల్ సమర్థంగా పనిచేయకపోవటంతో.. దానికి బదులు ఏకే-47ను కొనాల్సి వస్తోంది. రక్షణ సామగ్రి సొంత తయారీపై ఐదారేళ్ల నుంచే దృష్టిసారిస్తున్నాం. కొన్నేళ్ల క్రితం అంతర్జాతీయ రక్షణ ఎగుమతులు మార్కెట్లోకి అడుగుపెట్టాం. కేంద్రంలో భాజపా ప్రభుత్వ పదవీకాలం పూర్తయ్యే(2019 మే) నాటికి 2 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.13,000 కోట్లు) రక్షణ ఎగుమతులు నమోదు చేయాలనేది లక్ష్యం. తాజా బడ్జెట్ దీనికి ఊపు ఇస్తుందని భావిస్తున్నారు.

ఎగుమతులు

2013-14	రూ.1,153 కోట్లు
2014-15	రూ.1,582 కోట్లు
2015-16	రూ.2,059 కోట్లు



ఏయే దేశాలకు...

- విక్రయం: మారిషస్, ఒమన్, నేపాల్, వియత్నాం, అఫ్గానిస్థాన్
- భారత్‌నుంచి కొనుగోలుకు ఆసక్తి: బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, టర్కీ, ఈజిప్టు, కజకస్థాన్
- సంయుక్త తయారీపై ఆసక్తి: బ్రిటన్, స్పెయిన్
- మరమ్మతులు: భారత్ సాయంతో గగనతల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడంతోపాటు రక్షణ సామగ్రికి మరమ్మతులు చేసుకోవడానికి యూఏఈ ఆసక్తి చూపుతోంది. భారత్ నుంచి గస్తీనౌకలనూ కొనుగోలు చేయాలని భావిస్తోంది.

వీటిని ఎగుమతి చేస్తున్నాం...

- ఇన్సాస్ రైఫిళ్లు, గస్తీనౌకలు, ఆయుధ సామగ్రికి అవసరమైన విడిభాగాలు.

దిగుమతులు



- అత్యధికంగా రక్షణ సామగ్రి, ఆయుధాలు దిగుమతి చేసుకుంటున్న దేశాల జాబితాలో మన దేశానిది రెండో స్థానం(సౌదీ అరేబియాది మొదటిస్థానం).
- 2016లో రూ.25143 కోట్ల డాలర్ల విలువైన రక్షణ సామగ్రిని దిగుమతి చేసుకున్నాం.

ఏయే దేశాల నుంచి దిగుమతి...

- రష్యా నుంచి ఎక్కువగా...ఆ తర్వాత అమెరికా, ఇజ్రాయెల్, ఫ్రాన్స్‌ల నుంచి
- ప్రపంచంలో 2012-16 మధ్యకాలంలో ఆయుధ దిగుమతుల్లో మనదేశం వాటా 13%
  - ఆ కాలంలో రష్యా నుంచి 68%, అమెరికా నుంచి 14%, ఇజ్రాయెల్ నుంచి 7.2% ఆయుధాల్ని దిగుమతి చేసుకున్నాం.



ఏమేం దిగుమతి...?

- యుద్ధ విమానాలు, రాడార్ వ్యవస్థలు, ట్యాంకు విధ్వంసక క్షిపణులు.



ఉల్లిపై కనీస ఎగుమతి ధర నిబంధన తొలగింపు


దిల్లీ: ఉల్లిపాయలను విదేశాలకు ఎగుమతులు చేయాలంటే కనీస ధర ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం తొలగించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అన్ని రకాల ఉల్లిపాయలను కనీస ఎగుమతి ధర (మినిమం ఎక్స్‌పోర్ట్ ప్రైస్-ఎంఈపీ) అవసరం లేకుండానే విదేశాలకు పంపించవచ్చని విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ శుక్రవారం ఒక ఉత్తర్వుల్లో తెలిపారు. ఉల్లి ఎగుమతులను ప్రోత్సహించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభు ట్వీట్ ద్వారా తెలిపారు. దేశీయ మార్కెట్‌లో ఉల్లికి కొరత ఏర్పడినప్పుడల్లా ఎగుమతులు నిరోధించడానికి ప్రభుత్వం కనీస ధరను అమలు చేస్తుంది. పరిస్థితులు సర్దుకున్న తరువాత తొలగిస్తుంటుంది.

చెన్నై సమీపంలో లక్షల ఏళ్లనాటి రాతి ఆయుధాలు

చెన్నై: లక్షలాది ఏళ్లక్రితం ఆయుధాలుగా ఉపయోగించిన చేతి గొడ్డలివంటి రాతి ఉపకరణాలు చెన్నైకు 60 కిమీ దూరంలోని అత్తిరంపక్కమ్ వద్ద తాజాగా లభ్యమయ్యాయి. ఇవి అతిపురాతనమైనవి కావడమే కాకుండా ఇప్పటి సాంకేతికతకు తీసిపోని విధంగా అప్పట్లోనే తయారుచేయడం చరిత్రకారులను ఆశ్చర్యపరుస్తోంది. ఇవి 3,85,000 ఏళ్లక్రితం నాటివి. ఆధునిక మానవుడు(మోడర్న్ హ్యూమన్) పూర్వమే నివసించిన మనుషులకు చెందినవని అర్థమవుతోంది. చరిత్ర ప్రకారం ఆధునిక మానవుడు ఆఫ్రికాలో నివసించేవాడు. అక్కడి నుంచే ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లాడు. ఆఫ్రికాలో నివసించిన మొదటి హోమోనిన్స్(ఆధునిక మానవుడికి ముందుతరాల గిరిజన తెగ) సుమారు 17 లక్షల క్రితం ఆఫ్రికా నుంచి వలస వెళ్లారని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అత్తిరంపక్కమ్ వద్ద లభ్యమైన ఉపకరణాలను బట్టి అవి హోమోనిన్స్ చివరి తరాలవిగాని, ఆధునిక మానవులవి కాని అయి ఉండవచ్చని పురాతత్వ శాస్త్రవేత్త శాంతి పప్పు పేర్కొన్నారు. తమిళనాడులో స్థానికంగా నివసించిన నాటి తెగ.. ఇంతటి అధునాతన ఉపకరణాలు తయారుచేసే అవకాశం లేదంటున్నారు. మరి ఇంతటి గొప్ప ఆయుధాలను ఎవరు తయారుచేశారన్న ప్రశ్నకే జవాబు దొరకాల్సి ఉందన్నారు. పరిశోధన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

బోఫోర్స్ కేసులో సీబీఐ తాజా పిటిషన్

దిల్లీ: సంచలనాత్మక బోఫోర్స్ ముడుపుల కుంభకోణం కేసులో 2005లో దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీబీఐ శుక్రవారం సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేసింది. బోఫోర్స్ కుంభకోణంలో నిందితులపై దాఖలైన ఆరోపణలను కొట్టివేస్తూ దిల్లీ హైకోర్టు 2005లో ఉత్తర్వులు చేసింది. దాదాపు 12 ఏళ్ల జాప్యం అనంతరం ఇప్పుడు నాటి దిల్లీ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేయడంపై అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ఇచ్చిన సూచనలు ఈ సందర్భంగా గమనార్హం. బోఫోర్స్‌కు సంబంధించి కొన్ని కీలక పత్రాలు, సాక్ష్యాలు లభించినందుకు దిల్లీ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ అప్పీలు వేయవచ్చని న్యాయనిపుణులు సీబీఐకి సలహా ఇచ్చారు. దాంతో, ఇప్పుడు సీబీఐ కేసు దాఖలు చేసింది.



ఫిడెల్ క్యాస్ట్రో కుమారుడి ఆత్మహత్య

హవానా: క్యూబా దివంగత అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రో పెద్ద కుమారుడు ఫిడెల్ క్యాస్ట్రో డియాజ్ బలార్ట్ ఆత్మహత్య చేసుకున్నారు. 68 ఏళ్ల బలార్ట్ కొంతకాలంగా కుంగుబాటుతో బాధపడుతున్నారని. . గురువారం బలవన్మరణం పొందారని క్యూబా అధికార వార్తాపత్రిక 'గ్రాన్మా' తెలిపింది. ఫిడెల్ క్యాస్ట్రో మొదటి భార్య మిర్టాకు 1949 సెప్టెంబరు 1న బలార్ట్ జన్మించారు. భౌతికశాస్త్రంలో ఉన్నత విద్యనభ్యసించారు. అణు శాస్త్రవేత్తగా క్యూబాలో అణు విద్యుత్తు పథకం అభివృద్ధికి కృషి చేశారు. మరణించే నాటికి బలార్ట్ క్యూబా ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా ఉన్నారు.

రాజకీయ ఖైదీలను విడుదల చేయండి

- మాల్దీవులు సుప్రీం కోర్టు ఆదేశం

మాలె: మాల్దీవుల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. తొమ్మిది మంది కీలక రాజకీయ ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని ఆ దేశ సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలిచ్చింది. అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ పార్టీ నుంచి ఫిరాయించిన 12 మంది నేతలకూ.. తిరిగి పార్లమెంటు సభ్యత్వాన్ని కల్పించింది. దీంతో రాజకీయ ఖైదీగా ఉండి.. ప్రవాసంలోకి వెళ్లిన దేశ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నషీద్‌కు తిరిగి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ద్వారాలు తెరుచుకున్నాయి. ఇటు పార్లమెంటులో ప్రతిపక్ష కూటమి ఆధిక్యంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో యమీన్ గద్దె దిగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

లిబియా తీరానికి చేరువలో పడవ బోల్తా

- 90 మంది వలసదారులు గల్లంతు

పారిస్: లిబియా తీరానికి చేరువలో స్మగ్లర్‌కు చెందిన పడవ బోల్తాపడింది. అందులో ఉన్న 90 మంది గల్లంతయ్యారని ఐరాస వలస సంస్థ పేర్కొంది. వీరిలో ఎక్కువ మంది పాకిస్థాన్ వలసదారులేనని తెలిపింది. ఇప్పటివరకూ లిబియాలోని జువారా పట్టణ రేవు వద్దకు 10 మృతదేహాలు కొట్టుకొచ్చాయి. వీరిలో 8 మంది పాకిస్థాన్ దేశస్థులుగా కాగా, మిగతా ఇద్దరూ లిబియా వాసులు.

లోయా మృతి అంశాన్ని మాత్రమే పరిశీలిస్తాం

- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

దిల్లీ: సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బీహెచ్. లోయా మృతికి సంబంధించిన అంశాన్ని మాత్రమే తాను పరిశీలించనున్నట్లు సుప్రీంకోర్టు శుక్రవారం విస్పష్టంగా ప్రకటించింది. లోయా మృతి అంశమే తప్ప సొహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో భాజపా సారధి అమిత్ షా వ్యవహారం...తదితర ఏ ఇతర అంశం జోలికి తాము వెళ్లేదే లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సారధ్యంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. 2014 నాటి లోయా మృతిపై తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలా? వద్దా? అనే అంశం మాత్రమే తమ ముందున్నదని పునరుద్ఘాటించింది. లోయా మృతిపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్లను ఈ ధర్మాసనం విచారిస్తోంది.

'నోటీసు జారీ ప్రసక్తే లేదు'

పిటిషనర్ల తరపు న్యాయవాదుల్లో ఒకరు తాను లోయా కేసుకు సంబంధించి ముంబయి హైకోర్టులో అభ్యర్థన దాఖలు చేశామనీ...ఇప్పుడు అది సర్వోన్నత న్యాయస్థానం ముందుకు వచ్చిందనీ చెప్పారు. అమిత్ షాను తాను ఇందులో ఓ ప్రతివాదిగా పేర్కొన్న నేపథ్యంలో నోటీసు జారీ చేయాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ...వాదనలు వినిపించడానికి అనుమతిస్తాం. నోటీసులు జారీ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. చీఫ్‌జస్టిస్ దీపక్ మిశ్ర సారథ్యంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్.ఖాన్విల్కర్, జస్టిస్. డీవై చంద్రచూడ్‌లున్నారు.

రికార్డులు సమర్పించాం కదా!

అమిత్ షా అంశం ప్రస్తావనకు వచ్చినపుడు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే మాట్లాడుతూ...ఇది చాలా తీవ్రమైన అంశం. అందుకే, ముందు దీనిలో వాదనలు పూర్తయితే బాగుంటుంది అని వ్యాఖ్యానించారు. ముంబయి న్యాయవాదుల సంఘం తరపు దవే వాదనలు వినిపిస్తున్నారు. ఈ కేసులో స్వతంత్ర దర్యాప్తు అవసరం. ఎందుకంటే ఈ కేసులో అనేకానేక పరస్పర విరుద్ధమైన అంశాలున్నాయి అని పేర్కొన్నారు. అమిత్ షాపై బురదజల్లే యత్నాలు వద్దంటూ ఇదే కేసులో ఇంతకుముందు వాదనలు వినిపిస్తున్నపుడు దవేను సుప్రీంకోర్టు గట్టిగా హెచ్చరించింది. కాంగ్రెస్ నేత తెహ్‌సీన్ పూనావాలా తరపు న్యాయవాది వి.గిరి మాట్లాడుతూ..., మహారాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నివేదికలను కోర్టు ముందుంచాలని అడిగారు. ఈ అభ్యర్థనను రోహత్గీ ఖండించారు. అన్ని రికార్డులను ఇప్పటికే సమర్పించాం...దయచేసి...చూసుకోండి అంటూ అభ్యర్థించారు.

ఊహాజనిత అంశాలతో వ్యాజ్యాలు తగదు: సుప్రీం

దిల్లీ: అత్యాచారం కేసుల నిబంధనలు పురుషులకు, మహిళలకు ఒకే విధంగా ఉండే విధంగా చట్టం రూపొందించాలంటూ దాఖలైన వ్యాజ్యాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. చట్టం అందరికీ సమానంగా ఉండాలని, అత్యాచారం చేసే మహిళలనూ శిక్షించాలని వ్యాజ్యంలో కోరారు. మహిళలు అత్యాచారం చేసినట్టు ఫిర్యాదులు అందాయా? ఇలాంటి ఊహాజనిత అంశాలతో వ్యాజ్యాలు వేయకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర ఆధ్వర్యంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

కశ్మీర్‌లో భారీ హిమపాతానికి ముగ్గురు సైనికులు మృతి

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్‌లో భారీ హిమపాతానికి శుక్రవారం సాయంత్రం ముగ్గురు సైనికులు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు గాయపడ్డారు. కుప్వారా జిల్లా మచ్చిల్ సెక్టార్‌లోని '21 రాజ్‌పుత్' దళానికి చెందిన శిబిరం వద్ద ప్రమాదవశాత్తు ఈ దుర్ఘటన జరిగినట్లు సైనికాధికారి ఒకరు వెల్లడించారు. ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా జమ్మూ-కశ్మీర్‌లోని వివిధ జిల్లాల్లో భారీ హిమపాత హెచ్చరికలు జారీచేసిన రెండు రోజుల్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది. అఫ్గానిస్థాన్-తజికిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో బుధవారం 6.2 తీవ్రతతో భూకంపం సంభవించిన అనంతరం ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి.

అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలి: జస్టిస్ రోహిణి

ఏపీ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో సన్మానం

ఈనాడు, దిల్లీ: విద్య, ఆర్థిక, స్వశక్తి ఇలా అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలని ఓబీసీ సబ్ కేటగిరైజేషన్ అధ్యక్షురాలు జస్టిస్ రోహిణి అన్నారు. ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ఆధ్వర్యంలో మహిళలు జస్టిస్ రోహిణిని సన్మానించారు. ఈ సందర్భంగా జస్టిస్ రోహిణి మాట్లాడుతూ.. ఏపీ మహిళా కమిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ.. మహిళల రక్షణకు ప్రజల్లో మరింత చైతన్యం రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మహిళలు అభివృద్ధి చెందుతున్నా రక్షణ కరవవడం శోచనీయమన్నారు. తెదేపా ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ.. దేశ ఆర్థిక అభివృద్ధి, ప్రగతి సాధనలో మహిళల కృషి అనితర సాధ్యమని ప్రశంసించారు. మహిళా కమిషన్ సభ్యులు కొయ్యాన శ్రీవాణి, రాజ్యలక్ష్మి, పర్వీన్ భాను, రమాదేవి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమవతి, లక్ష్మీరమణి, పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సహ విద్యార్థుల దాడిలో బాలుడి మృతి

- పాఠశాల మరుగుదొడ్డి వద్ద మృతదేహం

దిల్లీ: తోటి విద్యార్థుల దాడిలో ఓ బాలుడు పాఠశాల మరుగుదొడ్డిలోనే ప్రాణాలొదిలాడు. దిల్లీలోని కర్వాల్‌నగర్ జీవన్‌జ్యోతి ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తుషార్ (16) గురువారం తోటి విద్యార్థులతో జరిగిన ఘర్షణలో మృతిచెందాడు. నలుగురు విద్యార్థులతో ఆ బాలుడు ఘర్షణ పడుతున్న దృశ్యాలను పోలీసులు సీసీటీవీ ఫుటేజిలో పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను (మైనర్లు) అరెస్టు చేసి విచారిస్తున్నారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. ఉదయం మరుగుదొడ్డి వద్ద తుషార్ అపస్మారక స్థితిలో పడివుండగా కొందరు విద్యార్థులు కనుగొన్నారు. అనంతరం అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడు విరేచనాలతో బాధపడుతూ చనిపోయినట్లు పాఠశాల యాజమాన్యం చెబుతుండగా.. అతని కుటుంబ సభ్యులు మాత్రం హత్యగా అనుమానిస్తున్నారు. కొద్ది నెలల క్రితం కొందరు విద్యార్థులకు, తమ కుమారుడికి మధ్య వాగ్వాదం జరిగిందని వారే దాడిచేసి ఉంటారని తుషార్ తండ్రి ఆరోపించారు. తోటి విద్యార్థులతో ఘర్షణలోనే తుషార్ కిందపడి మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తును బట్టి తెలుస్తోందని ఈశాన్య దిల్లీ డిప్యూటీ కమిషనర్ అజిత్ కె. సింగ్లా వెల్లడించారు. అయితే బాలుడి శరీరంపై గాయాలేమీ కనిపించలేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో బాలుడి కుటుంబ సభ్యులు కర్వాల్‌నగర్‌లో ఆందోళనకు దిగారు. కొద్ది నెలల క్రితం గురుగ్రామ్‌లోని రేయాన్ పాఠశాలలో రెండో తరగతి బాలుడు ప్రద్యుమన్ హత్యకు గురైన సంఘటన మరిచిపోక ముందే ఈ ఘటన కలకలం రేపుతోంది.

హాంకాంగ్ నేతకు నోబెల్ ఇవ్వాలి

- అమెరికా కాంగ్రెస్ సభ్యుల ప్రతిపాదన
- చైనా ఆగ్రహం

బీజింగ్: హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమాన్ని, దానికి సంబంధించిన ప్రముఖ విద్యార్థి నేత జాషువా వాంగ్‌కు నోబెల్ శాంతి పురస్కారం ఇవ్వాలని అమెరికా కాంగ్రెస్‌కు చెందిన పలువురు సభ్యులు ప్రతిపాదించారు. దీనిపై చైనా ఆగ్రహం వ్యక్తంచేసింది. తమ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యాన్ని మానుకోవాలని స్పష్టంచేసింది. హాంకాంగ్ తమ దేశంలో అంతర్భాగమని పేర్కొంది. 2014లో హాంకాంగ్‌లో జరిగిన ప్రజాస్వామ్య అనుకూల నిరసనలకు జాషువా వాంగ్ (21) అతడి సహచరులు నాథన్ లా (24), అలెక్స్ చౌ (27) తదితరులు నాయకత్వం వహించారు. ఈ ఆందోళనల్లో పోలీసులు ప్రయోగించే బాష్పవాయు గోళాల నుంచి రక్షణ పొందడం కోసం ఉద్యమకారులు గొడుగులను ఉపయోగించేవారు. అందువల్ల దీనికి 'గొడుగు ఉద్యమం' అనే పేరు వచ్చింది. వేల మంది ఆందోళనకారులు 79 రోజుల పాటు హాంకాంగ్‌లోని రాజకీయ, ఆర్థిక కేంద్రాన్ని ముట్టడించారు. ఈ విద్యార్థి నేతకు నోబెల్ పురస్కారానికి నామినేట్ చేస్తూ.. హాంకాంగ్‌లో రాజకీయ సంస్కరణలు, స్వయం నిర్ణయాధికారం కోసం జరుగుతున్న శాంతియుత ప్రయత్నాలకు గుర్తింపు లభించాలన్నదే తమ ఉద్దేశమని అమెరికా కాంగ్రెస్ సభ్యులు పేర్కొన్నారు. వాంగ్‌కు నోబెల్ ప్రకటిస్తే.. మలాలా యూసఫ్ జాయ్ తర్వాత ఆ పురస్కారానికి ఎంపికైన పిన్న వయస్కుడిగా గుర్తింపు పొందుతారు.



న్యాయశాఖ, ఎఫ్‌బీఐ రెండూ డెమోక్రాట్లకు అనుకూలం

- రిపబ్లికన్లకు వ్యతిరేకంగా పనిచేశాయ్
- ట్రంప్ సంచలన ఆరోపణ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. న్యాయ మంత్రిత్వశాఖ, ఫెడరల్ దర్యాప్తు సంస్థ(ఎఫ్‌బీఐ)లపై విమర్శలు గుప్పించారు. దేశాధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై నిర్వహించిన దర్యాప్తులో రెండు విభాగాలూ డెమోక్రాట్లకు అనుకూలంగా పనిచేశాయని ఆరోపించారు. రిపబ్లికన్లకు వ్యతిరేకంగా దర్యాప్తును రాజకీయం చేశాయని నిందించారు. ఈ మేరకు శుక్రవారం ట్వీట్లు చేశారు. 2016 నాటి దేశాధ్యక్ష ఎన్నికల సమయంలో ఎఫ్‌బీఐ తమ నిఘా వ్యవస్థను దుర్వినియోగం చేసిందంటూ తయారుచేసిన ఓ తాఖీదు(మెమో)ను విడుదల చేసేందుకు హౌస్ కమిటీ ఇప్పటికే ఆమోదం తెలిపిన నేపథ్యంలో.. ట్రంప్ తాజా వ్యాఖ్యలు మరింత కలకలం సృష్టించాయి. ట్రంప్ ప్రచార సిబ్బందిలో ఒకరిపై ఎఫ్‌బీఐ నిఘా ఉంచిందని మెమోలో ఉంది. న్యాయశాఖ, ఎఫ్‌బీఐ ఉన్నతాధికారులపై ట్రంప్ ఆరోపణలు చేయడం సంచలనమే. ఎందుకంటే ఆరోపణలను ఎదుర్కొంటున్నవారిలో.. ప్రస్తుత ఎఫ్‌బీఐ డైరెక్టర్ క్రిస్టోఫర్ సహా పలువురిని ఆయా పదవులకు స్వయంగా ట్రంప్ నామినేట్ చేశారు.

ట్రంప్ హయాంలో పెరిగిన విద్వేష దాడులు: అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తరువాత కొన్ని దేశాలవారిపై ద్వేషపూరిత దాడులు పెరిగాయని ఓ స్వచ్ఛంద సంస్థ అధ్యయనంలో వెల్లడయింది. హిందువులు, సిక్కులు, ముస్లింలు, దక్షిణ ఆసియా, మధ్య ప్రాచ్యం, అరబ్ జాతీయులపై దాడులు జరిగినట్టు సౌత్ ఆసియన్ అమెరికన్స్ లివింగ్ టుగెదర్ (ఎస్ఏఏఎల్‌టీ) తెలిపింది. 2016 నవంబరు 9 నుంచి 2017 నవంబరు 7 వరకు 302 సంఘటనలు చోటుచేసుకున్నట్టు పేర్కొంది. దాడులు చేసిన వారిని విచారిస్తే ట్రంప్ ప్రసంగాలు, ఆయన విధానాల ద్వారా ప్రభావితమయినట్టు వెల్లడించారని వివరించింది. ట్రంప్ అనుసరిస్తున్న ముస్లిం వ్యతిరేక విధానాలు కూడా దాడులకు కారణమని ఆ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుమన్ రఘునాథన్ తెలిపారు.

పాకిస్థాన్‌లో సైనిక చర్యలు నిర్వహించే ఆలోచనేదీ తమకు లేదని అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్ తెలిపింది. ఈ మేరకు పాక్ మీడియాలో వచ్చిన వార్తలను ఖండించింది.



ఈసారైనా..

రాహుల్ ద్రవిడ్ కోచింగ్‌లో భారత జట్టు అండర్-19 ప్రపంచకప్ ఫైనల్ ఆడటం ఇది వరుసగా రెండోసారి. 2015 జూన్‌లో ద్రవిడ్ బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల్లోనే యువ భారత్ ప్రపంచకప్ బరిలో దిగింది. 2016 ఆరంభంలో జరిగిన ఆ టోర్నీలో గొప్పగా పోరాడినా ఫైనల్లో వెస్టిండీస్ చేతిలో పరాజయం తప్పలేదు. గత రెండేళ్లుగా జట్టు వెన్నంటే ఉన్న ద్రవిడ్ కుర్రాళ్లపై తనదైన ముద్ర వేశాడు. ఒత్తిడిలోనూ ఎంతో ప్రశాంతంగా ఆడుతున్న భారత కుర్ర జట్టు.. ఫేవరెట్లలో ఒకటిగా బరిలో దిగి ఫైనల్ చేరింది. రెండేళ్ల ముందు చేజారిన కప్పును.. కుర్రాళ్లు ఈసారైనా ద్రవిడ్‌కు అందిస్తారేమో చూడాలి.

ఛాంపియన్

2000

ఎలాంటి అంచనాలు లేవప్పుడు! ఐతేనేం.. సంచలన విజయాలతో మహ్మద్ కైఫ్ సారథ్యంలోని యువ భారత్ తొలిసారి అండర్-19 ప్రపంచకప్‌తో చరిత్ర సృష్టించింది.

2008

మళ్లీ ఎప్పుడెప్పుడా అంటూ సాగిన సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది కోహ్లి సేన. కెప్టెన్ కోహ్లి నిలకడకు జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన తోడవడంతో అలవోకగా టైటిల్ కొట్టేసింది యువ భారత్.

2012

ఫేవరెట్లలో ఒకటిగా బరిలో దిగి.. కఠిన పరిస్థితుల్లో పోరాడింది. ప్రధాన ఫేవరెట్ ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో ఓడించి ముచ్చటగా మూడోసారి కప్పు అందుకుంది ఉన్ముక్త్ నేతృత్వంలోని భారత్.

ఇప్పుడు..

చరిత్ర సృష్టించే సమయం ఆసన్నమైంది. 2018 అండర్-19 ప్రపంచకప్‌లో ఆఖరి పోరాటం నేడే. అత్యధికంగా నాలుగుసార్లు ప్రపంచకప్ గెలిచిన జట్టుగా రికార్డు సాధించే అవకాశం ఇప్పుడు యువ భారత్ ముందుంది. టోర్నీలో అసాధారణ రీతిలో ఆడుతున్న భారత్.. తనతో సమానంగా అత్యధికంగా మూడుసార్లు కుర్రాళ్ల ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన ఆస్ట్రేలియాను ఫైనల్లో ఢీకొననుంది. అజేయంగా తుది పోరుకు చేరిన పృథ్వీ సేన చరిత్ర సృష్టించేందుకు కావాల్సింది ఇంకొక్క విజయమే!

చిన్నోళ్లూ... చెలరేగిపోండి



భారత్ × ఆస్ట్రేలియా
అండర్-19 ప్రపంచకప్ ఫైనల్ నేడే

ఉదయం 6.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-2లో

మౌంట్ మౌంగనుయ్ (న్యూజిలాండ్)

అండర్-19 ప్రపంచకప్‌లో ఎదురులేని భారత్‌కు ఆఖరి పరీక్ష. టోర్నీ తొలి పోరులో ఎదురైన ప్రత్యర్థే మెగా ఫైనల్లో సవాల్ విసురుతోంది. రికార్డు స్థాయిలో నాలుగో టైటిల్ సాధించాలని పట్టుదలగా ఉన్న భారత జట్టు శనివారం ఆస్ట్రేలియాను ఢీకొననుంది. గత ప్రపంచకప్ (2016)లో మాదిరిగా రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకోకూడదని ద్రవిడ్ కోచింగ్‌లోని భారత్ పట్టుదలగా ఉండగా.. 8 ఏళ్ల తర్వాత తిరిగి ప్రపంచకప్‌ను ముద్దాడాలని కోరుకుంటోంది ఆస్ట్రేలియా. మరి కప్పు దక్కేది ఎవరికో..!

> "తొలి మ్యాచ్ నుంచి మా ఫాస్ట్ బౌలర్లు మంచి ప్రదర్శన చేస్తున్నారు. జట్టుకు అవసరమైన ప్రతిసారి వారు వికెట్లు తీశారు. ఇది మాకు ఎంతో మేలు చేసే అంశం. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఓడించాం. ఇప్పుడు ఆ జట్టు ఎంతో మెరుగ్గా కనిపిస్తోంది. ఫైనల్ కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాం"
> – పృథ్వీ షా, భారత కెప్టెన్

> "భారత పేసర్ల గురించి మాకెలాంటి ఆందోళన లేదు. వారి మంచి ప్రదర్శనే చేశారు. ఐతే.. మేం ఎలాంటి బౌలింగ్‌నైనా ఎదుర్కోగలం. మేం ఆడబోయేది ఫైనల్. తొలి మ్యాచ్ ప్రభావం మాపై ఏ మాత్రం లేదు. ఒత్తిడి రెండు జట్లపై సమానంగా ఉంటుంది. ఏ జట్టునైనా ఓడించగల సత్తా మాకుంది"
> – జేసన్ సంఘా, ఆస్ట్రేలియా కెప్టెన్



శుభ్‌మన్ గిల్

ఫేవరెట్ భారతే: అద్భుత ఫామ్‌లో ఉన్న భారతే ఫైనల్లో ఫేవరెట్. టోర్నీలో ఐదుకు ఐదు మ్యాచ్‌లు గెలిచి ఫైనల్లో అడుగుపెట్టింది పృథ్వీ షా బృందం. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 100 పరుగుల తేడాతో నెగ్గిన జట్టు.. సెమీస్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 203 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో 272 పరుగులు చేసిన భారత్ ఆ తర్వాత పాక్‌ను 69 పరుగులకే కుప్పకూల్చింది. నిజానికి టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ పృథ్వీషా (232 పరుగులు), మన్‌జోత్ కల్రా (151), శుభ్‌మన్ గిల్ (341)లు మ్యాచ్‌ను మిగతా బ్యాట్స్‌మన్ వరకు తీసుకెళ్లడం లేదు. ఇప్పుడు భారత సమస్య ఇదే. మిడిల్, లోయర్‌ఆర్డర్ బ్యాట్స్‌మన్‌కు ఎక్కువగా బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఇక కోచ్ ద్రవిడ్ ఎక్కువగా నమ్మకం పెట్టుకున్న రియాన్ పరాగ్ గాయం కారణంగా తొలి రెండు మ్యాచ్‌లు ఆడలేదు. ఆ తర్వాత జట్టులోకి వచ్చిన అతడు పెద్దగా నిరూపించుకుంది లేదు. ఫైనల్లో సత్తా చాటుతాడేమో చూడాలి. బౌలింగ్‌లో ఆస్ట్రేలియా కంటే భారత దళమే మెరుగ్గా ఉంది. శివమ్ మావి (8 వికెట్లు), నాగర్‌కోటి (7) పేస్‌తో వణికిస్తుండగా.. అనుకుల్ (12), అభిషేక్ వర్మ (6) స్పిన్‌తో ప్రత్యర్థి జట్లను ఇరుకున పెడుతున్నారు. కలిసికట్టుగా ఆడుతున్న భారత కుర్రాళ్లకు ఇప్పటివరకు గట్టి పోటీనే ఎదురుకాలేదు. ఫైనల్లో జోరు కొనసాగితే టైటిల్ భారత్‌దే అనడానికి ఆలోచించాల్సిన పనిలేదు.



8/35
ఆస్ట్రేలియా స్పిన్నర్ లాయిడ్ పోప్ ప్రదర్శన. టోర్నీలో అత్యుత్తమ గణాంకాలు అతడివే.

కంగారూలు తక్కువేం కాదు: భారత్‌తో తొలి మ్యాచ్ మినహా ఆస్ట్రేలియా అన్ని మ్యాచ్‌ల్లో ఆకట్టుకుంది. కెప్టెన్ జేసన్ సంఘా, జాక్ ఎడ్వర్డ్స్ మంచి ఫామ్‌లో ఉన్నారు. వీరిద్దరు స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోగలరు. నాథన్ మెక్‌స్వీని పపువా న్యూ గినియాపై 156 పరుగుల భారీ స్కోరు సాధించాడు. ఐతే నిలకడలేమి ఆ జట్టును వేధిస్తోంది. ఇద్దరు ముగ్గురు మినహా మిగతావారు ఆశించిన మేరకు రాణించడం లేదు. గాయాలు ఆ జట్టుకు ప్రధాన సమస్యగా మారింది. పేసర్ జేసన్ రాల్‌స్టన్ గాయపడటంతో జట్టులోకి వచ్చిన జాక్ ఇవాన్స్ కూడా గాయమై బెంచ్‌కు పరిమితమయ్యాడు. క్వార్టర్‌ఫైనల్లో ఇంగ్లాండ్‌పై 8 వికెట్లు తీసిన స్పిన్నర్ లాయిడ్ పోప్‌నే ఇప్పుడు ఆ జట్టు నమ్ముకుంది.

అచ్చొచ్చిన వేదికలో..: అచ్చొచ్చిన వేదికలో తుది సమరానికి సిద్ధమైంది భారత్. లీగ్ దశలో అన్ని మ్యాచ్‌లను పృథ్వీ బృందం మౌంట్ మౌంగనుయ్‌లోనే ఆడింది. అక్కడే జరిగిన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ఘన విజయం అందుకుంది. సాధారణంగా ఈ పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామం. తొలి మ్యాచ్‌లో భారత్ 300పైగా స్కోరు చేసింది. ఆ తర్వాత రెండు మ్యాచ్‌ల్లో బౌలింగ్ చేసిన యువ భారత్ ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసింది. ఐతే గత కొన్ని రోజులుగా ఇక్కడ వర్షం పడుతుండటంతో పిచ్‌ను కప్పి ఉంచారు. మ్యాచ్ ముందు రోజు ఎండ కాయడంతో మైదానాన్ని ఫైనల్‌కు సిద్ధం చేశారు. మరి పిచ్ ఎలా స్పందిస్తుందో చూడాలి. వర్షం కురిసినా మ్యాచ్‌లో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశాముందనేది విశ్లేషకుల మాట.

5 ఇప్పటివరకు అండర్-19 ప్రపంచకప్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మ్యాచ్‌లు. గెలుపోటముల్లో 3-2తో భారత్‌దే పైచేయి.

6 అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టుకు ఇది ఆరో ఫైనల్. 2000, 2008, 2012లో టైటిల్ గెలిచిన యువ భారత్.. 2006, 2016లో ఓడింది.

12 అండర్-19 విభాగంలో జరుగుతోన్న పన్నెండో ప్రపంచకప్ ఇది. భారత్, ఆస్ట్రేలియా అత్యధికంగా మూడేసిసార్లు టైటిళ్లు గెలిచాయి. భారత్ 2000, 2008, 2012లో విజేతగా నిలవగా.. ఆస్ట్రేలియా 1988, 2002, 2010లో టైటిల్ గెలిచింది.

341 టోర్నీలో శుభ్‌మన్ చేసిన పరుగులు. కేవలం 4 ఇన్నింగ్స్‌ల్లో అతడు ఇన్ని పరుగులు సాధించడం విశేషం. టోర్నీలో అతడి సగటే (170.50) అత్యధికం. మరోవైపు టాప్-10 పరుగుల వీరుల్లో ఆస్ట్రేలియా నుంచి ఒక్కరూ లేరు.




డు ప్లెసిస్ ఔట్

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా జట్టుకు అతిపెద్ద దెబ్బ. గాయం కారణంగా ఆ జట్టు కెప్టెన్ డు ప్లెసిస్ భారత్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు. తొలి వన్డే సందర్భంగా అతడి చేతి వేలికి గాయమైంది. పగులు ఏర్పడిందని ఆ తర్వాత పరీక్షల్లో తేలింది. అతడు కోలుకోవడానికి ఆరు వారాలు పట్టొచ్చని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు తెలిపింది. డు ప్లెసిస్ స్థానంలో ఫర్హాన్ బెహర్డీన్ జట్టులోకి వచ్చాడు. ఐతే మిగతా వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా సారథి ఎవరన్నది ఆ దేశ క్రికెట్ బోర్డు ప్రకటించలేదు. గాయం కారణంగా ఏబీ డివిలియర్స్ ఇప్పటికే తొలి మూడు వన్డేలకు దూరమైన సంగతి తెలిసిందే.



నాన్న చనిపోయినా ఏడవలేదు

కోల్‌కతా: భావోద్వేగాలను సౌరభ్ గంగూలీ దాచుకోడు. ఈ విషయం మనకు తెలుసు. చాలా సందర్భాల్లో మైదానంలో ప్రత్యర్థితో సై అంటే సై అనేవాడు. అలాంటి గంగూలీ.. తన తండ్రి చనిపోయినపుడు ఏడవలేదట. "అవును.. మా నాన్న చనిపోయినపుడు ఏడవలేదు. చాలా మంది ఈ విషయాన్ని నమ్మకపోవచ్చు. నేను నిజం చెప్పడం లేదని అనుకోవచ్చు. కానీ కొందరైనా నేను చెప్పేది నమ్ముతారు. నాలాంటి వాళ్లు కొంత మంది ఉంటారు. ఏడిస్తే బాధ తీరిపోతుందని చాలా మంది అనుకుంటారు. నాలాంటి వాళ్లు మాత్రం భావోద్వేగాలను లోపలే దాచుకుంటారు. బయటకు గంభీరంగా కనిపించినా లోపల మాత్రం బాధ ఉంటుంది" అని గంగూలీ తెలిపాడు. తాను గౌతమ్ భట్టాచార్యతో కలిసి రచించిన "ఏ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్" పుస్తకంలో ఇలాంటి ఆసక్తికర సంఘటనలు చాలానే ఉన్నాయని గంగూలీ అంటున్నాడు. తన రిటైర్‌మెంట్, అప్పటి కెప్టెన్ కుంబ్లే అందించిన సహకారం, గ్రెగ్ ఛాపెల్ గురించి ఇలా చాలా విషయాలను ఇందులో పొందుపరిచానని తెలిపాడు. రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని తీసుకునేముందు తన మానసిక స్థితి, తన ఆలోచనా విధానం ఎలా ఉంది లాంటి విషయాలను పుస్తకంలో ప్రస్తావించానని గంగూలీ అన్నాడు. దుర్గ నవరాత్రి ఉత్సవాలప్పుడు సింగ్ వేషధారణలో తానెలా బయటకు వెళ్లేవాడినో పుస్తకంలో రాశానని దాదా చెప్పాడు.






సింధు

సింధు నిలిచింది

- సైనా, సాయిప్రణీత్, కశ్యప్ ఓటమి
- సెమీస్‌లో సిక్కి జోడీ
- ఇండియా ఓపెన్



సైనా



కశ్యప్

దిల్లీ: ఇండియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలనాలు కొనసాగుతున్నాయి. గురువారం కిదాంబి శ్రీకాంత్ నిష్క్రమించగా.. శుక్రవారం సైనా నెహ్వాల్, కరోలినా మారిన్ (స్పెయిన్), సాయిప్రణీత్, పారుపల్లి కశ్యప్‌లకు చుక్కెదురైంది. మహిళల సింగిల్స్‌లో స్టార్ షట్లర్, డిఫెండింగ్ ఛాంపియన్ పి.వి. సింధు.. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి- ప్రణవ్ చోప్రా మాత్రమే భారత్ తరపున పోరాటం కొనసాగిస్తున్నారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో టాప్ సీడ్ సింధు 21-12, 19-21, 21-11తో బీట్రిజ్ కారెల్స్ (స్పెయిన్)పై నెగ్గి సెమీస్ చేరుకుంది. సైనా నెహ్వాల్ 10-21, 13-21తో బీవెన్ జాంగ్ (అమెరికా) చేతిలో, మారిన్ 12-21, 19-21తో చూంగ్ నాన్ (హాంకాంగ్) చేతిలో ఓడారు. శనివారం జరిగే సెమీస్‌లో ఇంతానన్ రచనోక్‌తో సింధు తలపడుతుంది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో సాయిప్రణీత్ 15-21, 13-21తో తీన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో, కశ్యప్ 16-21, 18-21తో కియావో బిన్ (చైనా) చేతిలో, సమీర్‌వర్మ 17-21, 14-21తో ఇస్కందర్ జుల్కర్‌నైన్ (మలేసియా) చేతిలో పరాజయం చవిచూశారు. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సుమీత్‌రెడ్డి- మను అత్రి 19-21, 19-21తో మార్కస్- కెవిన్ (ఇండోనేసియా) చేతిలో; మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో మేఘన- పూర్విష 10-21, 15-21తో జాంగ్‌కోల్ఫన్- రవీంద (థాయ్‌లాండ్) చేతిలో, సిక్కిరెడ్డి- అశ్విని పొన్నప్ప 17-21, 21-23తో డు యు- యిన్‌హు (చైనా) చేతిలో ఓటమి పాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి- ప్రణవ్ 21-8, 21-13తో టాంగ్ వీ- చెంగ్‌కాయ్ (చైనా)పై గెలిచి సెమీస్ చేరుకున్నారు. సాత్విక్ సాయిరాజు- అశ్విని పొన్నప్ప 17-21, 11-21తో మథియస్- పెడర్సన్ (డెన్మార్క్) చేతిలో ఓడారు.

మహి భాయ్ ఉంటే సగం పని తగ్గినట్లే



డర్బన్: వికెట్ల వెనుక మహేంద్రసింగ్ ధోని ఉంటే చాలు సగం భారం తగ్గిపోతుందని యువ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ అన్నాడు. ఎప్పటికప్పుడు విలువైన సలహాలిస్తూ చేయాల్సిన పనిని సగానికి తగ్గించేస్తాడని అతనన్నాడు. "తొలిసారి దక్షిణాఫ్రికాతో ఆడడం వల్ల ఎలా బౌలింగ్ చేయాలనే దానిపై స్పష్టత లేదు. ఇక్కడ గాలి ఎక్కువగా ఉంది.. బంతి అనుకున్న దిశగా వెళ్లట్లేదు. అప్పుడు ఎటువైపు బంతులేయాలని మహిని అడిగాను. నువ్వు ఎప్పుడూ ఎలా బౌలింగ్ చేస్తావో అలాగే చేయి అని సలహా ఇచ్చాడు. అతని మాటల స్ఫూర్తితోనే నా లైన్‌లో బంతులేశాను. ధోని, కోహ్లి లాంటి ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు జట్టులో ఉంటే యువ ఆటగాళ్లకు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా మహి భాయ్.. స్పిన్నర్ల పనిని సగానికి తగ్గించేస్తాడు. ఏ పరిస్థితుల్లో ఎలా బంతులేయాలో మహి చెబితే.. వీలైనన్ని ఎక్కువ వికెట్లు తీయడానికే ప్రయత్నించాలని విరాట్ చెబుతాడు. 10 పరుగులు రక్షించుకోవడం కన్నా.. అదనంగా తీసే ఒక వికెట్టే పరిస్థితిని మారుస్తుందనేది కోహ్లి ఆలోచన. కెప్టెన్ ఇలా చెప్పినప్పుడే ఏ బౌలర్‌కైనా నమ్మకం పెరుగుతుంది" అని కుల్‌దీప్ అన్నాడు.

వింటర్ ఒలింపిక్స్‌కు కేశవన్, జగదీష్



కేశవన్

దిల్లీ: ఈ నెల 9న దక్షిణ కొరియాలో ప్రారంభమయ్యే వింటర్ ఒలింపిక్స్‌లో భారత్ తరపున శివ కేశవన్, జగదీష్ సింగ్ అర్హత సాధించారు. 36 ఏళ్ల కేశవన్ (లూజ్ విభాగం) ఈ పోటీల్లో పాల్గొనడం ఇది ఆరోసారి. 1998లో తొలిసారి పాల్గొన్న అతను 2002, 06, 10, 14 క్రీడల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. మరోవైపు జగదీష్ సింగ్ (క్రాస్‌కంట్రీ స్కీయింగ్)కు ఇవే తొలి క్రీడలు. 2010 వాంకోవర్ క్రీడల్లో కేశవన్‌తో పాటు జమ్‌యంగ్, తషి కూడా పాల్గొన్నారు. 2014 సోచి క్రీడల్లో కేశవన్, హిమాంశు ఠాకూర్, నదీమ్ ఇక్బాల్ ప్రాతినిధ్యం వహించారు. అయితే భారత ఒలింపిక్స్ సంఘంపై ఐఓసీ అప్పుడు నిషేధం విధించడంతో వాళ్లు స్వతంత్ర క్రీడాకారులుగా బరిలో దిగారు. ఈ క్రీడలు జరుగుతుండగానే ఐఓసీ నిషేధాన్ని ఎత్తేసింది.

ఆ చిట్కా కోహ్లి దగ్గర నేర్చుకో

సౌరభ్ గంగూలీ

దక్షిణాఫ్రికా గడ్డపై గత పదిరోజులూ కోహ్లి నేతృత్వంలోని భారత్‌కు గొప్ప అనుభవం. విరాట్ సేన ప్రదర్శన నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. ముఖ్యంగా వాండరర్స్ టెస్టు గెలుపు టీమ్‌ఇండియాకు చిరకాలం గుర్తుండిపోతుంది. దీన్ని కేవలం మరో విజయంగానే చూడకూడదు. దీని ప్రభావం చాలా ఉంటుంది. డర్బన్ వన్డేలో ఆ ప్రభావాన్నే చూశాం. భారత్.. దక్షిణాఫ్రికాపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వాండరర్స్‌లో నాలుగోరోజు ఆటను కొనసాగించాలా లేదా అనే విషయంలో రిఫరీ సరైన నిర్ణయం తీసుకున్నాడు. ఇదే జరగకపోతే భారత్ అప్పటిదాకా చూపించిన తెగువ, పోరాటం వృథా అయిపోయేది. డీన్ ఎల్గర్ కూడా ఎప్పటికీ గుర్తుంచుకునే ఇన్నింగ్స్ ఆడాడు. అజింక్య రహానె, భువనేశ్వర్ కుమార్ మరోసారి సత్తా చాటారు. వాళ్లిద్దరు జట్టుకు అమూల్యమైన ఆస్తి. క్లాస్ ఆటగాడైన రహానె ప్రదర్శన ఆశ్చర్యపరచలేదు. నైపుణ్యం విషయంలో అజింక్యకు తిరుగులేదు. ఐతే సెంచరీలు ఎలా సాధించాలో కెప్టెన్ కోహ్లి నుంచి అతను నేర్చుకోవాలి. తొలి వన్డేలో అతని 79 పరుగుల ఇన్నింగ్స్ ఓ అద్భుతం. కానీ దాన్ని మూడంకెల స్కోరుగా మలచాలి. గత రెండు మ్యాచ్‌ల్లో ఓడడం దక్షిణాఫ్రికాకు మానసికంగా పెద్ద దెబ్బే. డివిలియర్స్, స్టెయిన్ లేకపోవడం ఆ జట్టుకు పెద్ద లోటు. ఎంగిడిని తీసుకోకపోవడం కూడా సరైన నిర్ణయం కాదు. ఏదేమైనా ఆరు వన్డేల సిరీస్ దక్షిణాఫ్రికాకు సులభం కాదు.

అందుకే రోహిత్‌ను ఎంపిక చేశాం



"రహానె మైదానంలోనే కాదు నెట్స్‌లోనూ ఇబ్బంది పడడంతో మొదటి నుంచి రోహిత్‌ను ఆడించాలని అనుకున్నాం. నిరుడు రోహిత్ టెస్టుల్లో 200కు పైగా సగటుతో పరుగులు చేశాడు. వన్డేల్లో శ్రీలంకపై ద్విశతకం సాధించాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్‌ను ఎలా తప్పించగలం? నువ్వు చేసిన పరుగులు లెక్కలోకి రావు అని చెప్పలేం కదా. అజింక్య సామర్థ్యం గురించి మాకు తెలుసు. కానీ 2017లో టెస్టుల్లో అతను కేవలం 34 సగటు మాత్రమే నమోదుచేశాడు"

– తొలి రెండు టెస్టులకు రోహిత్ ఎంపికపై రవిశాస్త్రి వ్యాఖ్యలు

మెండిస్ 196 ఔట్

డిసిల్వా భారీ శతకం • లంక 504/3

చిట్టగాంగ్: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో శ్రీలంక భారీ స్కోరు సాధించింది. శుక్రవారం మూడోరోజు ఆట ఆఖరికి ఆ జట్టు 3 వికెట్లకు 504 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (196; 327 బంతుల్లో 22×4, 2×6) కొద్దిలో డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోగా.. ధనంజయ డిసిల్వా (173; 229 బంతుల్లో 21×4, 1×6) భారీ సెంచరీ సాధించాడు. ఓవర్‌నైట్ స్కోరు 187/1తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంకను.. మెండిస్, డిసిల్వా జోడీ నడిపించింది. ఈ జంట రెండో వికెట్‌కు 307 పరుగులు జోడించింది. డిసిల్వాను ముస్తాఫిజుర్ ఔట్ చేసి ఈ జంటను విడగొట్టాడు. ఆ తర్వాత రోషెన్ సిల్వ (87 బ్యాటింగ్)తో కలిసి మెండిస్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. ద్విశతకం ముంగిట నిలిచిన అతను.. తైజుల్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆట ఆఖరికి రోషెన్, కెప్టెన్ చండిమాల్ (37 బ్యాటింగ్)తో క్రీజులో ఉన్నాడు. బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 513 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.